

అనంత జనశక్తి

జనం కోసమే మా అక్షరం

04.11.2026
బుధవారం | అనంతపురం
సంపుటి : 11 | సంచిక: 173
పేజీలు : 08 | వెల: రూ.5

AJS అనంత జనశక్తి జనం కోసమే మా అక్షరం

PUBLISHED BY ANANTAPUR, KADAPA, CHITTOR, VISAKHAPATNAM, SRIKAKULAM, EALLURU, TIRUPATHI, ONGOLE, VIJAYAWADA, NELLORE, PRAKASHAM, GUNTUR, KURNOOL.

మున్సిపాలిటీల్లో కూటమి హవా

- ఉమ్మడి చిత్తూరు జిల్లాలో కూటమి క్లీన్ స్వీప్
- తిరుపతి కార్పొరేషన్‌లో టీడీపీకి 38 డివిజన్లు
- పుంగనూరులో నయీమ్ తాజ్ ఏకగ్రీవం
- విశాఖ కార్పొరేషన్ ఎన్నికల్లో టీడీపీ ఘన విజయం
- మేయర్‌గా ముక్కా శ్రావణి గెలుపు
- పుత్తూరులో జనసేన అభ్యర్థి ఎలుమలై విజయం
- కుప్పంలో మొత్తం 32 వార్డులు టీడీపీ ఖాతాలోకి
- పలమనేరులో టీడీపీకి 26 వార్డులు
- విజయవాడ మేయర్ ఎన్నిక
- లక్షకుపైగా ఓట్లతో ఆధిక్యంలో జనసేన అభ్యర్థి
- విజయనగరం మేయర్‌గా అవనాపు భార్గవి విజయం



అమరావతి, నవంబర్ 03, అనంత జనశక్తి న్యూస్

ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు సత్తా చాటారు.. ఇక, ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లో తెలుగుదేశం పార్టీ, కూటమి అభ్యర్థులు ఆధిపత్యం ప్రదర్శించారు. తిరుపతి, చిత్తూరు కార్పొరేషన్లతో పాటు నగరి, పుంగనూరు, పుత్తూరు, కుప్పం, పలమనేరు, మదనపల్లె మున్సిపాలిటీల్లోనూ టీడీపీ అత్యధిక స్థానాలను కైవసం చేసుకుంది. పలు చోట్ల మేయర్, మున్సిపల్ చైర్మన్ అభ్యర్థులు భారీ మెజారిటీలతో విజయం సాధించారు.

తిరుపతి కార్పొరేషన్‌లో టీడీపీకి 38 డివిజన్లు

తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ మేయర్‌గా జేబీ శ్రీనివాస్ 61,712 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. మొత్తం 66 డివిజన్లకు గాను రెండు డివిజన్లలో టీడీపీ అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికలు జరిగిన డివిజన్లలో టీడీపీ 36, జనసేన 19, బీజేపీ 3, వైసీపీ 3, స్వతంత్ర అభ్యర్థులు 3 స్థానాలను గెలుచుకున్నారు. దీంతో తుది ఫలితాల్లో టీడీపీ 38, జనసేన 19, బీజేపీ 3, వైసీపీ 3, ఇండిపెండెంట్లు 3 డివిజన్లను కైవసం చేసుకున్నారు.

5లో..

ఎన్నికల పద్ధతి ఏదైనా.. ప్రజల మద్దతు కూటమికే..

డిప్యూటీ సీఎం పవన్ కీలక వ్యాఖ్యలు

అమరావతి, నవంబర్ 03, అనంతజనశక్తి న్యూస్



మున్సిపల్ ఎన్నికల్లో కూటమి పార్టీలు సత్తా చాటాయి.. ఈ ఎన్నికల ఫలితాలపై స్పందిస్తూ.. పట్టణ, నగర ప్రజలు కూటమి ప్రభుత్వ పాలనపై విశ్వాసం చూపించారని జనసేన పార్టీ అధ్యక్షుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. ఈవీఎంల ద్వారా జరిగిన సార్వత్రిక ఎన్నికల్లోనైనా, బ్యాలెట్ ద్వారా నిర్వహించిన స్థానిక సంస్థల ఎన్నికల్లోనైనా ప్రజలు కూటమి పక్షానే నిలిచారని పేర్కొన్నారు. జనసేనకు పట్టణ, నగర ప్రాంతాల్లో లభిస్తున్న ఆదరణ ఎంతో విలువైనదని తెలిపారు. సార్వత్రిక ఎన్నికల్లో ఓటమి పాలైన పార్టీ తమ పరాజయానికి ఈవీఎంలను నిందించిందని పవన్ కల్యాణ్ గుర్తుచేశారు.

5లో..

మున్సిపల్ ఎన్నికల విజయం మరింత పెద్ద బాధ్యత: లోకేశ్

అమరావతి, నవంబర్ 03, అనంత జనశక్తి న్యూస్



ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పును కేవలం గెలుపుగా మాత్రమే కాకుండా, తమపై ఉంచిన మరింత పెద్ద బాధ్యతగా భావిస్తున్నామని మంత్రి, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ తెలిపారు. గత రెండున్నరేళ్లుగా ప్రజా ప్రభుత్వం అందిస్తున్న సుపరిపాలనకు ప్రజలు అందించిన ఆశీర్వాదంగా ఈ తీర్పును స్వీకరిస్తున్నామని పేర్కొన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో విజయం సాధించిన తెలుగుదేశం, జనసేన, బీజేపీ అభ్యర్థులందరికీ నారా లోకేష్ హృదయపూర్వక అభినందనలు తెలిపారు. మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు సమష్టిగా చేసిన కృషికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

5లో..

ఇవి ఎలక్షన్లు కావు.. సెలక్షన్లు

- మున్సిపల్ ఎన్నికల ఫలితాలపై..
- వైఎస్ జగన్ సంచలన వ్యాఖ్యలు
- నామినేషన్ ప్రక్రియను అపహాస్యం చేశారు
- స్ట్రూట్నీలోనూ అక్రమాలు
- ఓట్ల లెక్కింపును కూడా హైజాక్ చేశారు

2లో..



అమరావతి, నవంబర్ 03, అనంత జనశక్తి న్యూస్

ఏపీ మున్సిపల్ ఎన్నికల ఫలితాలపై మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి స్పందించారు. ఇవి ఎన్నికలు కావని, ఎంపికలని కూటమి ప్రభుత్వం, పోలీసులపై తీవ్రస్థాయిలో ఆయన విమర్శలు గుప్పించారు. నామినేషన్ ప్రక్రియను అపహాస్యం చేశారని, స్ట్రూట్నీలోనూ అక్రమాలు జరిగాయని జగన్ దుయ్యబట్టారు.

నిరసనల పేరుతో స్థలాన్ని ఆక్రమించలేరు

- సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు.!
- ఒక ప్రాంతాన్ని నిరవధికంగా ఆక్రమించలేరు
- అందరికి నిరసన తెలిపే హక్కు ఉంది
- నిరసనల కోసం కేటాయించిన ప్రాంతాలకూ సమయ పరిమితి ఉండాలి

2లో..



న్యూఢిల్లీ, నవంబర్ 03, అనంత జనశక్తి న్యూస్

నిరసనల పేరుతో ఒక ప్రాంతాన్ని నిరవధికంగా ఆక్రమించడానికి వీల్లేదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. నిరసనల కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా కేటాయించిన ప్రదేశాలకు కూడా నిర్దిష్ట సమయ పరిమితి ఉండాలని వ్యాఖ్యానించింది.

తుఫాన్‌పై చంద్రబాబు సమీక్ష

వర్షపాతం లోటు తగ్గిందన్న అధికారులు



అమరావతి, నవంబర్ 03, అనంత జనశక్తి న్యూస్

రాష్ట్రంలో మురసు తుఫాన్ ప్రభావంపై సచివాలయంలోని ఆర్టీజీఎస్ కేంద్రం నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమీక్ష నిర్వహించారు. వివిధ ప్రాంతాల్లో నమోదైన వర్షపాతం, గాలుల తీవ్రత తదితర అంశాల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. సమాచారాన్ని విశ్లేషించి దానికి అనుగుణంగా వ్యవస్థలను సమర్థంగా నిర్వహించేలా చూడాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రతి అంశంలోనూ డేటా డ్రివెన్ డెసిషన్ మేకింగ్ జరగాలని సూచించారు.

2లో..

ఆలయాల్లో పూజారుల
అత్యాచారాలు



2లో..

ముంచెత్తిన మురసు

- 30 వేలకుపైగా హెక్టార్లలో పంట నష్టం
- పలు జిల్లాల్లో తీవ్ర ప్రభావం!
- కృష్ణా, బాపట్ల, నంద్యాల జిల్లాలను
- తీవ్రంగా ప్రభావితం చేసిన తుఫాన్
- వర్షపు నీరు పాలాల్లో చేరడంతో తీవ్ర నష్టం

2లో..

అమరావతి, నవంబర్ 03, అనంత జనశక్తి న్యూస్

తీవ్ర తుపాను మురసు ఆంధ్రప్రదేశ్‌పై తీవ్ర ప్రభావాన్ని చూపింది. బలమైన ఈదురుగాలులు, కుండపోత వర్షాలతో విరుచుకుపడటంతో రాష్ట్రవ్యాప్తంగా వ్యవసాయ రంగం తీవ్రంగా దెబ్బతింది. ప్రాథమిక అంచనాల ప్రకారం రాష్ట్రంలోని 15 జిల్లాల్లో 30,661 హెక్టార్లలో నిలబడి ఉన్న పంటలు నీటమునిగి తీవ్ర నష్టం వాటిల్లినట్లు ప్రభుత్వ వర్గాలు చెప్పాయి.



కేసీఆర్ హయాంలో తెలంగాణ
సొత్తును కొల్లగొట్టారు



హైదరాబాద్, నవంబర్ 03, అనంతజనశక్తి న్యూస్

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ హయాంలో తొమ్మిదిన్నరేళ్లు తెలంగాణను ఏలి పేదోళ్ల కష్టాలను పట్టించుకోలేదని ధ్వజమెత్తారు. వారి స్వార్థానికి, స్వలాభానికి రాష్ట్ర సొత్తును ఆ దొరలు కొల్లగొట్టి, ప్రజలను పేదవాళ్లుగా చేశారని ఆగ్రహించారు. మంగళవారం ఖమ్మం రూరల్ మండలం ఏదులాపురం మున్సిపాలిటీ తెల్దారుపల్లిలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు.

2లో..

- మంత్రి పొంగు లేటి ధ్వజం
- తొమ్మిదిన్నరేళ్లు తెలంగాణను ఏలి
- పేదోళ్ల కష్టాలను పట్టించుకోలేదు
- ప్రజలను పేదవాళ్లుగా చేశారని ఆగ్రహం

రాహుల్ జుగుప్సా కరమైన వ్యక్తి



2లో..

ఆ ఎమ్మెల్యేలపై సస్పెన్షన్
వేటు వేయొద్దు

- మంత్రి శ్రీధర్‌బాబుకు పెద్దపల్లి ఎంపీ లేఖ
- ఇండియా కూటమి నిర్వహించిన సభకు..
- హాజరు కాని పార్టీ ఎమ్మెల్యేలపై సస్పెన్షన్ వ్యవహారం

హైదరాబాద్, నవంబర్ 03, అనంత జనశక్తి న్యూస్

దిల్లీ రాంలీలా మైదానంలో ఇండియా కూటమి నిర్వహించిన సభకు హాజరు కాని పార్టీ ఎమ్మెల్యేలపై సస్పెన్షన్ వేటు వేయొద్దని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ సోమవారం మంత్రి శ్రీధర్‌బాబుకు లేఖ రాసి సామాజిక మాధ్యమాల్లో విడుదల చేయడం కలకలం రేపుతోంది. జిల్లా ఎమ్మెల్యేలతో ఎంపీకి విభేదాలుండడంతో వ్యంగ్యంగా ఈ లేఖ విడుదల చేశారన్న చర్చ రాజకీయ వర్గాల్లో జరుగుతోంది.

అంబటి రాంబాబుకు
ఈడీ నోటీసులు

- మద్యం అక్రమ రవాణా కేసులో
- నేడు విచారణకు హాజరుకావాలని ఆదేశం



5లో..

తెలంగాణను కరువు రాష్ట్రంగా ప్రకటించాలి

- ఎమ్మెల్యే కూనంనేని డిమాండ్
- సాగునీరు అందక పంట పొలాలు ఎండిపోయాయి
- బీడు భూములుగా మారాయని ఆవేదన
- వెంటనే ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించి రైతులను ఆదుకోవాలి



5లో..



ఇవి ఎలక్షన్లు కావు.. సెలక్షన్లు

(మొదటి పేజీ తరువాయి)

ఓట్ల లెక్కింపును కూడా హైజాక్ చేశారని, ప్రతిపక్ష పోలింగ్ ఏజెంట్లను అడ్డుకున్నారని ఆయన ఆరోపించారు. ఇందుకు చంద్రబాబు నాయుడు, రాష్ట్ర ఎన్నికల సంఘానికి అభినందనలని వ్యంగ్యాస్త్రాలు సంధిస్తూ సోషల్ మీడియాలో ఈ మేరకు వైఎస్ జగన్ పోస్ట్ పెట్టారు.

''ప్రతిపక్షానికి పోటీ చేసే అవకాశమే లేకుండా చేస్తూ, ఒక ఎన్నికల్లో ఏ విధంగా అద్భుత విజయం సాధించాలో మీరు నిరూపించి చూపించారు!... ప్రతి దశలోనూ ఈ ప్రక్రియను దుర్వినియోగం చేశారు.. నామినేషన్ హైజాక్!..స్క్రూటినీ హైజాక్! ఉపసంహరణ: హైజాక్! పోలింగ్ ఏజెంట్లను అడ్డుకోవడం లేదా బయటకు లాగేయడం! పోలింగ్: అక్రమాలు! పోలింగ్ శాతం: మోసపూరిత మార్పులు! ఓట్ల లెక్కింపు: హైజాక్! అభ్యర్థులను మీరే ఎంపిక చేసుకున్నారు; ప్రజలు వారిని ఎన్నుకోలేదు!

ఇవి ఇకపై ఎంతమాత్రమూ 'ఎన్నికలు' కావు, కేవలం 'ఎంపికలు' మాత్రమే! చంద్రబాబు నాయుడు జంగిల్ రాజ్‌లో ఎన్నికల సంస్కరణల ఆవశ్యకత ఎన్నడూ లేనంత స్పష్టంగా ఇప్పుడు కనిపిస్తోంది!'' అంటూ కేంద్ర ఎన్నికల కమిషన్‌ను మాజీ ముఖ్యమంత్రి ట్యాగ్ చేశారు. ఏపీ మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లో అధికార ఎన్డీయే కూటమి హవా కొనసాగుతోంది. మొత్తం 13 కార్పొరేషన్లలో 12 చోట్ల టీడీపీ జనసేన కూటమి చైర్మన్ అభ్యర్థులు ఆధిక్యంలో ఉన్నారు. ఒక్క చోట హోరాహోరీ పోరు నెలకుంది. ఇక, 87 మున్సిపాల్టీల్లో 78 చోట్ల కూటమి, వైసీపీ 4, ఇతరులు రెండు చోట్ల విజయం దిశగా సాగుతున్నారు.

తుఫాన్‌పై చంద్రబాబు సమీక్ష

(మొదటి పేజీ తరువాయి)

ప్రకాశం, బాపట్ల, పల్నాడు, కృష్ణ, ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో విస్తారంగా వర్షాలు నమోదయ్యాయని అధికారులు వివరించారు. రాష్ట్రమంతటా 20.38 సెం.మీ సగటు వర్షపాతం నమోదు కాగా, బాపట్ల జిల్లాలో 21 సెం.మీ, ప్రకాశం జిల్లాలో 20 సెం.మీ మేర వర్షాలు కురిసినట్లు అధికారులు తెలిపారు. రేపు ఉదయం వరకు బాపట్ల, గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో భారీ వర్షాలకు అవకాశం ఉందన్నారు. తుఫాన్ కారణంగా కురిసిన వర్షాల వల్ల వర్షపాతం సగటు లోటు 53 నుంచి 28.9 శాతానికి తగ్గిందని అధికారులు తెలియజేశారు. నిన్న ఉదయం నుంచి ఈరోజు వరకు 24 గంటల్లో 2 శాతం వర్షపాతం లోటు తగ్గగా... వచ్చే 5 రోజుల్లో కురిసే వర్షాలతో మరో 2 శాతం లోటు తగ్గుతుందని వెల్లడించారు. ఒక్క రోజులో 0.45 మీటర్ల మేర భూగర్భ జలాలు పెరగ్గా... 20 టీఎంసీల నుంచి 30 టీఎంసీల మేర భూగర్భ జలాలు రీఛార్జి అయ్యే అవకాశం ఉందన్నారు. చెరువులు, మైనర్ ఇరిగేషన్ ట్యాంకులకు 10 టీఎంసీల వరకూ నీరు చేరి ఉంటుందని అధికారులు అంచనా వేశారు. 7 నుంచి 8 టీఎంసీల వరకు నీరు రిజర్వాయర్లకు చేరిందని ముఖ్యమంత్రికి అధికారులు తెలిపారు. ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయటం ద్వారా విలువైన ప్రాణాలను కాపాడగలిగామని... తమిళనాడు, కర్ణాటక ముఖ్యమంత్రులకు ఫోన్ చేసి సహకారం కోరామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ఆర్టీజీఎస్‌లో సమీక్షకు సీఎస్ సాయి ప్రసాద్, ఆర్టీజీఎస్ సహా వివిధ శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు.

ఆలయాల్లో పూజారుల అత్యాచారాలు

నేహా బోరా వ్యాఖ్యలపై బీజేపీ ఆగ్రహం.!

రాహుల్ గాంధీ వ్యాఖ్యల్ని పోలి ఉన్నాయని విమర్శ

కాంగ్రెస్ డీఎన్ఏలోనే హిందూ వ్యతిరేకత ఉందన్న బీజేపీ విమర్శలు

న్యూఢిల్లీ, నవంబర్ 03, అనంతజనశక్తి న్యూస్

ఆల్ ఇండియా స్టూడెంట్ అసోసియేషన్(నేహా బోరా చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు వివాదాస్పదంగా మారాయి. ఆలయాలు, పూజారులు, కుల వ్యవస్థపై ఆమె చేసిన వ్యాఖ్యలపై బీజేపీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. గతంలో రాహుల్ గాంధీ, కాంగ్రెస్ కూడా హిందువుల అవమానించేందుకు ఇలాంటి వ్యాఖ్యలే చేశారని బీజేపీ ఆరోపిస్తోంది. సనాతన ధర్మాన్ని లక్ష్యంగా చేసుకుని కాంగ్రెస్ ఒక భావజాలమైన ప్రచారాన్ని నిర్వహిస్తోందని బీజేపీ అధికార ప్రతినిధి ప్రదీప్ భండారీ ఆరోపించారు. మహిళలకు రక్షణ అవసరమని, ముఖ్యంగా బ్రాహ్మణీయ వ్యవస్థ నుంచి వారిని కాపాడాల్సిన అవసరం ఉందని, ఆలయాల్లో పూజారులు అత్యాచారాలకు పాల్పడుతున్నారని నేహా బోరా ఆరోపించింది. ఈ వ్యాఖ్యలపై స్పందించిన బీజేపీ.. హిందూ మతాన్ని కించపరిచేలా ఆమె మాట్లాడారని విమర్శించింది. నేహా బోరా చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ గతంలో చేసిన వ్యాఖ్యల మాదిరిగానే ఉన్నాయని ప్రదీప్ భండారీ అన్నారు. ఈ వ్యాఖ్యలు రాహుల్ గాంధీ నుంచి ప్రేరణ పొందినట్లు ఉన్నాయని అన్నారు. ఆలయాల్లో దేవతలను పూజించడానికి వెళ్లే వారే బస్సుల్లో మహిళలపై వేధింపులకు పాల్పడుతున్నారని రాహుల్ గతంలో అన్న వ్యాఖ్యల్ని ప్రస్తావించారు. 2014లో ఢిల్లీలో జరిగిన సామూహిక అత్యాచార ఘటనపై స్పందిస్తూ రాహుల్ గాంధీ ఈ వ్యాఖ్యలు చేసినట్లుగా తెలుస్తోంది.

గతంలో కాంగ్రెస్ నేతలు ఉపయోగించిన ''హిందూ ఉగ్రవాదం'', ''కాషాయ ఉగ్రవాదం'' వంటి పదాలను కూడా ప్రదీప్ భండారీ ప్రస్తావించారు. 20102013 మధ్య యూపీఏ ప్రభుత్వ హయాంలో అప్పటి కేంద్ర హోంమంత్రి పి.చిదంబరం, సుశీల్ కుమార్ షిండేలు ఈ వ్యాఖ్యలు చేసినట్లుగా బీజేపీ చెబుతోంది. నేహా బోరా వ్యాఖ్యలు బంగ్లాదేశ్ ఇస్లామిస్ట్‌ల నుంచి ప్రేరణ పొందాయని భండారీ ఆరోపించారు. కాంగ్రెస్ డీఎన్ఏలోనే హిందూ వ్యతిరేకంగ, రాజ్యాంగ వ్యతిరేకత, సనాతన ధర్మ వ్యతిరేక ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.

45వ వార్డులో జింకా లావణ్య ఘనవిజయం

-వైసిపి అభ్యర్థి సానే వరలక్ష్మి పై తిరుగులేని ఆదిత్యం.

-ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటా.... సేవే నా లక్ష్యం అంటున్నా జింకా లావణ్య.

ధర్మవరం నవంబర్ 3 అనంత జనశక్తి న్యూస్ :

ధర్మవరం మున్సిపల్ ఎన్నికల్లో 45వ వార్డు టీడీపీ అభ్యర్థి జింకా లావణ్య ఘనవిజయం సాధించారు. వైసీపీ అభ్యర్థి సానే. వరలక్ష్మిపై విజయం కైవసం చేసుకుని వార్డులో పసుపుదళం జెండా ఎగురవేశారు. ఈ విజయంతో టీడీపీ శ్రేణులు, అభిమానుల్లో ఉత్సాహం నెలకొంది. ఈ సందర్భంగా జింకా బ్రదర్స్ మాట్లాడుతూ..... ఈ గెలుపు తమ వ్యక్తిగత విజయంగా కాకుండా వార్డు ప్రజలు అందించిన ఆశీర్వాదంగా భావిస్తున్నామని తెలిపారు. ఎన్నికల సమయంలో ప్రజలు చూపిన ఆదరణ, నమ్మకానికి కృతజ్ఞతలు తెలియజేశారు. జింకా లావణ్య మాట్లాడుతూ..... తనపై నమ్మకంతో ఓటు వేసి గెలిపించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. రాజకీయాలకు అతీతంగా వార్డులోని ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉంటూ, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని, ప్రజాసేవకే కట్టుబడి ఉంటానని స్పష్టం చేశారు. 45వ వార్డు అభివృద్ధికి శక్తివంచన లేకుండా పనిచేస్తానని హామీ ఇచ్చారు.



నిరసనల పేరుతో స్థలాన్ని ఆక్రమించలేరు

(మొదటి పేజీ తరువాయి)

నిరసన తెలిపే హక్కు ఉంది, అయితే దానికి కాలపరిమితి ఉండాలని ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ అన్నారు. కేవలం నిరసన జరుగుతోందన్న కారణంగా ఒక సమూహం బహిరంగ ప్రదేశంలో ఇతరుల రాకపోకల్ని అడ్డుకోకూడదని వ్యాఖ్యానించారు. కాక్రోచ్ జనతా పార్టీ జూలై 20న జరిగిన నిరసనకు కేవలం ఒక్క రోజు మాత్రమే అనుమతి ఇచ్చామని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోర్టుకు తెలిపారు. అయితే, నిరసనకారులు అనుమతించిన సమయం కన్నా ఎక్కువ సమయం, 17 రోజుల పాటు అక్కడే ఉన్నారనే విషయాన్ని కోర్టుకు వెల్లడించారు. పార్లమెంట్ వరకు ర్యాలీగా వెళ్లారని తెలిపారు. పార్లమెంట్, సుప్రీంకోర్టులు సాధారణ రాజకీయ భవనాలు కాదని, మీరు అక్కడికి ర్యాలీగా వెళ్లలేరని మెహతా అన్నారు. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్‌తో పాటు జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చి, జస్టిస్ వి. మోహనాలతో



కూడిన ధర్మాసనం పలు పిటిషన్లను విచారించింది. వీటిలో వ్యాపార సంఘాలు దాఖలు చేసిన పిటిషన్లతో పాటు నిరసన సందర్భంగా పెద్ద సంఖ్యలో ప్రజల్ని నిర్బంధించడం, పోలీసుల దౌర్జన్యాలు, మెట్రో స్టేషన్ల మూసివేత, ఇంటర్నెట్ నిలిపివేత అంశాలపై పిటిషన్లు దాఖలయ్యాయి.

నిరసనల కారణంగా వ్యాపారానికి నష్టం జరిగిందని వ్యాపార సంఘాలు ఆరోపించాయి. ఈ సమయంలో ఆందోళనలు నిర్వహించిన రాజకీయ పార్టీలను కూడా పిటిషన్‌లో ప్రతివాదులుగా చేర్చాలని ధర్మాసనం సూచించింది. వ్యాపారుల తరఫున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ వాదనలు వినిపించారు. నిరసన ప్రాంతానికి సమీపంలో సుమారు 50 లక్షల మంది నివసిస్తున్నారని, ఆందోళన సమయంలో దుకాణాలు మూతపడ్డాయని, కన్నాట్ ప్లేస్ ప్రాంతంలో జన సంచారం లేదని తెలిపారు.

కేసీఆర్ హయాంలో తెలంగాణ

సొత్తును కొల్లగొట్టారు

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మీడియాతో మాట్లాడారు.

మరిన్ని ఉద్యోగాలను కల్పిస్తాం..

పొర్లు దండాలు పెట్టుకుంటూ ప్రతిపక్షాల నేతలు తమ ప్రభుత్వం గురించి విమర్శలు చేస్తున్నారని మంత్రి పొంగులేటి దుయ్యబట్టారు. కేసీఆర్ హయాంలో రైతులు వరి సాగు వేస్తే ఉరే అన్నారని.. తమ ప్రభుత్వం అన్నదాతలు పండించిన పంటకు బోనస్ ఇచ్చి ఆదుకుందని వ్యాఖ్యానించారు. ఇందిరమ్మ ప్రభుత్వం ప్రతి పేదింటికి సంక్షేమ కార్యక్రమాలను అందజేస్తోందని వెల్లడించారు. తమ ప్రభుత్వం నిరుద్యోగులకు ఇచ్చిన మాట నిలబెట్టుకుందని అన్నారు. ఇప్పటికే 74 వేల ఉద్యోగాలు ఇచ్చామని.. మళ్లీ మరిన్ని ఉద్యోగాలను కల్పిస్తామని భరోసా కల్పించారు.

అన్నిగ్రామాల్లో భూసర్వే చేయాలి..

రాష్ట్రంలో 8 లక్షలకు పైగా ఇందిరమ్మ ఇళ్లను అర్హులైన పేదలకు ఇచ్చామని మంత్రి పొంగులేటి తెలిపారు. 120 సంవత్సరాల క్రితం భూముల సర్వేలు జరిగాయని వెల్లడించారు. రాష్ట్రంలో ప్రతి అంగుళం సర్వే చేసి భూములు ఉన్న వారికి పూర్తి భరోసా కల్పిస్తున్నామని చెప్పుకొచ్చారు. పాలేరు నియోజకవర్గంలో అన్నిగ్రామాల్లో భూసర్వే చేయాలని



కలెక్టర్‌ను ఆదేశించామని అన్నారు. మ్యాపులతో కూడిన సర్వేతో ఆధార్ ఎలా ఉందో.. భూదార్ కూడా అలానే ఉండేలా ప్రతి భూస్వామికి ఇచ్చి తీరుతామని స్పష్టం చేశారు. విద్య, వైద్యంపై తమ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు.

ముంచెత్తిన మురసు





(మొదటి పేజీ తరువాయి)

మురసు తుపాను ధాటికి ముఖ్యంగా కృష్ణా, బాపట్ల, నంద్యాల జిల్లాలు తీవ్రంగా ప్రభావితమయ్యాయి. వర్షపు నీరు పొలాల్లో చేరడంతో చేతికి వచ్చిన పంటలు పాడైపోయాయి. ముఖ్యంగా దెబ్బతిన్న పంటలు చూసుకుటే.. వరి, పత్తి, మొక్కజొన్న పంటలకు అత్యధికంగా నష్టం వాటిల్లింది.

వర్షపు నీరు పొలాల్లో నిలిచిపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంట నష్టం అంచనాను త్వరలోనే పూర్తి చేసి బాధితులకు పరిహారం అందిస్తామని అధికారులు తెలిపారు. ఈ తీవ్ర తుపాను 15 జిల్లాల్లోని 132 మండలాలపై అసాధారణ ప్రభావాన్ని చూపింది. లోతట్టు ప్రాంతాలు జలమయమవ్వడంతో అధికారులు త్వరితగతిన స్పందించి సహాయక చర్యలు చేపట్టారు.

ముంపు ముప్పు ఉన్న ప్రాంతాల నుండి 10,805 మంది ప్రజలను సురక్షిత ప్రాంతాలకు, తుపాను షెల్టర్లకు తరలించారు. రాష్ట్ర ప్రభుత్వం 171 బియ్యం/ఆహార పరిమితి శిబిరాలను ఏర్పాటు చేసి బాధితులకు ఇప్పటివరకు 14,810 ఫుడ్ ప్యాకెట్లను పంపిణీ చేసింది. విద్యుత్ సరఫరా నిలిచిపోయిన ప్రాంతాల్లో పునరుద్ధరణ కోసం 613 జనరేటర్లను సిద్ధం చేసి వినియోగిస్తున్నారు.

తుపాను ప్రభావిత ప్రాంతాల్లో రెస్క్యూ, సహాయక చర్యల కోసం భారీగా బలగాలను మోహరించారు. నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ 11 బృందాలు రెస్క్యూ చర్యల్లో పాల్గొంటున్నాయి. స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ 13 బృందాలు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉన్నాయి.

రహదారులపై విరిగిపడిన చెట్లను తొలగించడానికి, నిలిచిపోయిన నీటిని తోడేందుకు ఫైర్ డిపార్ట్‌మెంట్ 185 ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపింది. తుపాను తీవ్రతను ముందుగానే ఊహించిన రాష్ట్ర యంత్రాంగం ముందస్తు హెచ్చరికలతో చర్యలు చేపట్టింది. ముంపు ప్రమాదం ఉన్న ప్రాంతాల నుంచి 3,066 మంది గర్భిణులు, 1,008 మంది బాలింతలను సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రులకు, సురక్షిత వైద్య కేంద్రాలకు ముందస్తుగా తరలించారు.

వ్యాధులు వ్యాపించకుండా 13 జిల్లాల్లో 725 వైద్య బృందాలను ఏర్పాటు చేశారు. అత్యవసర సహాయం కోసం 362 అంబులెన్సులను నిరంతరం అందుబాటులో ఉంచారు.

వర్షాలు తగ్గిన తర్వాత దోమలు, నీటి ద్వారా వచ్చే వ్యాధులు (డెంగ్యూ, మలేరియా, గ్యాస్ట్రోఎంటరైటిస్) విజృంభించే అవకాశం ఉంది. నిల్వ ఉన్న నీటిలో బ్లీచింగ్ పౌడర్ చల్లాలని ఆరోగ్య శాఖ సూచించింది. వైద్య శిబిరాలు, 104 సేవలను ఉచితంగా వినియోగించుకోవచ్చు.

రాహుల్ జుగుప్సా కరమైన వ్యక్తి

విదేశీ సాయం వ్యాఖ్యలపై బీజేపీ మండిపాటు

న్యూఢిల్లీ, నవంబర్ 03, అనంతజనశక్తి న్యూస్

కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ, బీజేపీ నేతల మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. విదేశీ సాయంతోనే ప్రధాని నరేంద్ర మోదీ అధికారంలో కొనసాగుతున్నారని రాహుల్ ఎక్స్‌లో ఆరోపించిన విషయం తెలిసిందే. బీజేపీ ఆర్థిక వ్యవస్థను విదేశీయులే నియంత్రిస్తున్నారని ఆయన ట్వీట్ చేశారు. దీంతో ఆయన వ్యాఖ్యలపై బీజేపీ జాతీయ ప్రతినిధి సీఆర్ కేశవన్ తీవ్రంగా అభ్యంతరం తెలిపారు. రాహుల్ గాంధీ ఒక అసహ్యకరమైన, జుగుప్సాకరమైన వ్యక్తి అని ఆయన విమర్శించారు. రాహుల్ నిరాధార, పేలవ ఆరోపణలు చేసి చివరకు నవ్వులపాలవుతారని, అది ఆయనకు అలవాటేనని కేశవన్ ట్వీట్ చేశారు. వాస్తవానికి 2023 మార్చిలో యూకేలో భారత ప్రజాస్వామ్యం గురించి రాహుల్ దిగజారి మాట్లాడారని విమర్శించారు. దేశ అంతర్గత వ్యవహారాల్లో విదేశీ జోక్యం కోరింది రాహులేనని మండిపడ్డారు.

నాడు రాహుల్ మాట్లాడిన వీడియోను ఆయన షేర్ చేశారు. కాంగ్రెస్ నాయకత్వానికి ఫోరం ఆఫ్ డెమోక్రటిక్ లీడర్స్ ఇన్ ద ఏషియా పసిఫిక్‌తో సంబంధాలు ఉన్నాయని, అంతేకాకుండా జార్జ్ సోరోస్ ఫౌండేషన్ నుంచి కాంగ్రెస్‌కు నిధులు కూడా అందాయని ఆయన ఆరోపించారు. అలాగే రాహుల్ విదేశీ పర్యటనలపైనా ఆయన విమర్శలు చేశారు. 'రాహుల్ ఎందుకు రహస్యంగా విదేశీ పర్యటనలకు వెళ్తారు? విదేశాల్లో వ్యక్తులను ఆయన ఎందుకు రహస్యంగా కలుస్తారు? అసలు ఆయన అజెండా ఏమిటి?' అని కేశవన్ ప్రశ్నించారు.



ఆ ఎమ్మెల్యేలపై సస్పెన్షన్

వేటు వేయొద్దు

(మొదటి పేజీ తరువాయి)

శ్రీధర్‌బాబుకు వంశీకృష్ణ లేఖ రాస్తూ 'మీరు, విజయ రమణారావు, మక్కాన్‌సింగ్‌లు మంథనిలో గణపతి సచ్చిదానంద స్వామీజీ కార్యక్రమంలో పాల్గొన్నారని తెలిసింది. వ్యక్తిగత విశ్వాసాలను, మతపరమైన కార్యక్రమాలను నేను పూర్తిగా గౌరవిస్తాను. అయితే ఇటీవల విశాఖ ట్రస్టు కార్యక్రమానికి హాజరైనందుకే ఒక గిరిజన మహిళా ప్రజాప్రతినిధితో సహా కాంగ్రెస్ కార్యకర్తలకు షోకాజ్ నోటీసు సైతం ఇవ్వకుండా సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించడం తీవ్ర విచారకరం. సొంత పార్టీ ఎంపీతో కలిసి పేద విద్యార్థులకు స్కూల్ బ్యాగులు పంపిణీ చేయడమే క్రమశిక్షణారాహిత్యంగా భావిస్తే.. దిల్లీలో నిర్వహించిన సభకు హాజరు కాకపోవడాన్ని అంతకంటే తీవ్రమైన ఉల్లంఘనగా భావించాల్సి ఉంటుంది. కానీ ఈ ఒక్కసారి సహజ న్యాయసూత్రాలకు కట్టుబడి మక్కాన్‌సింగ్, విజయ రమణారావులపై ఎలాంటి క్రమశిక్షణ చర్యలు తీసుకోకూడదని, వారిని సస్పెన్షన్ నుంచి మినహాయించాలని కోరుకుంటున్నా' అని పేర్కొన్నారు.



ఎవరీ మనస్వి వశిష్ట.. ఢిల్లీ ఏసీపీని ఎందుకు బదిలీ చేశారు?



న్యూఢిల్లీ: ఢిల్లీ పోలీసు శాఖలోని ఏసీపీ మనస్వీ వశిష్ట ను విధుల నుంచి సస్పెండ్ చేశారు. ఆయన బదిలీని వ్యతిరేకిస్తూ కొందరు పోలీసులు సిబ్బంది సోమవారం ఆందోళన వ్యక్తం చేసిన ఘటన నేపథ్యంలో ఈ చర్యలు తీసుకున్నారు. అయితే షాదారా పోలీసు స్టేషన్‌లో లాయర్లను ఇద్దరు ఆఫీసర్లు బెదిరించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఆ కేసులో ఏసీపీ మనస్వీ వశిష్టను బదిలీ చేసినట్లు తెలిసింది. సోమవారం పోలీసు ప్రధానకార్యాలయం ముందు జరిగిన నిరసన ప్రదర్శలో వశిష్ట పాల్గొన్నారు. ట్రాన్స్‌ఫర్ ఆర్డర్‌ను వెనక్కి తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. పోలీసు ప్రధాన కార్యాయంలో ఆందోళన చేపట్టిన నేపథ్యంలో ఏసీపీ వశిష్టను సస్పెండ్ చేసినట్లు పోలీసు వర్గాలు వెల్లడించాయి.

బదిలీకి ముందు ఏసీపీ వశిష్ట.. షాదారా సబ్‌డివిజన్‌లోని గాంధీనగర్ లో సబ్ డివిజినల్ పోలీసు ఆఫీసర్‌గా విధులు నిర్వర్తించారు. అక్టోబర్ 28వ తేదీన స్పెషల్ పోలీసు యూనిట్ ఫర్ వుమెన్ అండ్ చిల్డ్రన్ శాఖకు ఆయన్ను బదిలీ చేశారు. షాదారా పోలీసు స్టేషన్‌లో ఎస్‌హెచ్‌వోగా చేస్తున్న ఇన్‌స్పెక్టర్ అరుణ్ కుమార్‌ను కూడా ఢిల్లీ పోలీసు శాఖకు చెందిన సెక్యూరిటీ బ్రాంచ్‌కు బదిలీ చేశారు. ఢిల్లీ పోలీసు అధికారులు, బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, జిల్లా కోర్టు బార్ సంఘాల ఆఫీస్ బేరర్ల ప్రతినిధులతో జరిగిన మీటింగ్ తర్వాత ఇద్దరు ఆఫీసర్లను బదిలీ చేశారు.

పోలీసు శాఖ బదిలీ ఆదేశాలు ఇచ్చిన తర్వాత జిల్లా కోర్టు బార్ సంఘాలు తమ నిరవధిక నిరసనను వెనక్కి తీసుకున్నారు. పోలీసు ఆఫీసర్లపై చర్యలు తీసుకునే వరకు తాము న్యాయ విధులకు హాజరు కాబోమని లాయర్లు భీష్మించారు. అయితే అక్టోబర్ 23వ తేదీన షాదారా పోలీసు స్టేషన్‌లో లలిత్ బన్సల్ అనే అడ్వకేట్ పై దాడి జరిగింది. ఆ ఘర్షణలో అతని తలకు గాయమైంది. ఈ కేసులో అమూల్య రతన అనే వ్యక్తి ఫిర్యాదు చేశారు. బన్సల్‌పై దాడి చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ లాయర్లు, అడ్వకేట్లు పోలీసు స్టేషన్ వెళ్లారు. కేసులో ఉన్న వ్యక్తులను అరెస్టు చేస్తామని వశిష్ట, ఇన్‌స్పెక్టర్ అరుణ్ కుమార్ హామీ ఇచ్చినట్లు తెలిపారు.

అయితే అక్టోబర్ 24వ తేదీన నిందితులను రిలీజ్ చేసినట్లు లాయర్లు గ్రహించారు. విషయం తెలుసుకుందామని పోలీసు స్టేషన్‌కు వెళ్లినప్పుడు, రివాల్వర్‌ను చూపిస్తూ.. అడ్వకేట్లను ఏసీపీ వశిష్ట బెదిరించాడు. పోలీసుల వైఖరిని ఖండిస్తూ న్యాయ విధులకు లాయర్లు దుమ్మాకొట్టారు. పోలీసులపై చర్యలు తీసుకునే వరకు దీక్ష కొనసాగిస్తామన్నారు. దీంతో ఆ ఆఫీసర్లను బదిలీ చేస్తూ అక్టోబర్ 28వ తేదీన ఆదేశాలు జారీ చేశారు. ఆ తర్వాతే లాయర్లు తమ నిరసన విరమించారు. కానీ ఇద్దరు ఆఫీసర్ల బదిలీ అంశంలో ఢిల్లీ పోలీసు శాఖలో విభిన్నస్వరాలు వినిపించాయి. బదిలీ చేయవద్దు అని కొందరు డిమాండ్ చేశారు. ఆఫీసర్లకు మద్దతుగా నవంబర్ 2న పోలీసు హెడ్‌క్వార్టర్స్ ముందు ధర్నాకు రావాలని పోలీసు వాట్సాప్ గ్రూపులో మెసేజ్ సర్క్యూలేట్ అయ్యింది. 2వ తేదీన సుమారు 100 మంది పోలీసులు సిబ్బంది హెడ్‌క్వార్టర్స్ గేటు వద్ద ఆందోళన చేపట్టారు. ప్లకార్డులు ప్రదర్శించారు. పోలీసు కమీషనర్‌తో మీటింగ్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

చిన్నారిపై లైంగిక వేధింపులు మాల్దీవులు మాజీ విదేశాంగ మంత్రి అరెస్టు



మాలే: మాల్దీవుల మాజీ విదేశాంగ మంత్రి అబ్దుల్లా షాహిద్ ను పోలీసులు అరెస్టు చేశారు. చిన్నపిల్లలను లైంగికంగా వేధించినట్లు ఆయనపై ఆరోపణలు ఉన్నాయి. మాల్దీవు పోలీసులు సోమవారం దీనిపై ఓ ప్రకటన రిలీజ్ చేశారు. కోర్టు వారెంట్ ప్రకారం రాత్రి 9.59 నిమిషాలకు మాజీ మంత్రి అబ్దుల్లాను అరెస్టు చేసినట్లు చెప్పారు. గతంలో ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ ప్రెసిడెంట్‌గా చేశారాయన. వాస్తవానికి 2028లో జరగబోయే దేశాధ్యక్ష ఎన్నికల్లో ఆయన మాల్దీవియన్ డెమోక్రటిక్ పార్టీ తరపున అధ్యక్ష పదవి కోసం నామినేషన్ వేయాల్సి ఉన్నది. 64 ఏళ్ల అబ్దుల్లా 18 లోపు ఉన్న చిన్నారిని లైంగికంగా వేధించినట్లు అనుమానాలు ఉన్నాయని, నవంబర్ 2వ తేదీన కోర్టు వారెంట్ ఆధారంగా ఆయన్ను అదుపులోకి తీసుకున్నామని, ఈ కేసులో పోలీసులు మరింత దర్యాప్తు చేస్తున్నారని అధికారులు పేర్కొన్నారు. అయితే తనపై వచ్చిన ఆరోపణలను షాహిద్ కొట్టిపారేశారు. నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారన్నారు. తన గురించి చెడుగా ప్రచారం చేయరాదు అని ఆయన కోరారు.

మాల్దీవుల్లో ఉన్న రాజకీయవేత్తల్లో షాహిద్‌కు అంతర్జాతీయంగా మంచి గుర్తింపు ఉన్నది. 2018 నుంచి 2023 వరకు ఆయన ఆ దేశ విదేశాంగ మంత్రిగా చేశారు. ఆ సమయంలో దేశాధ్యక్షుడిగా ఇబ్రహీం మొహమ్మద్ సోలి ఉన్నారు. 2021-22 మధ్య కాలంలో యూఎన్ జనరల్ అసెంబ్లీలో అధ్యక్షుడిగా చేశారు. పీపుల్స్ మజ్లిస్ స్పీకర్‌గా చేశారు. 2024 ఫిబ్రవరి నుంచి ఆగస్టు 2026 వరకు మాల్దీవుల డెమోక్రటిక్ పార్టీకి నాయకత్వం వహించారు. గతనెలలోనే ఢిల్లీలో జరిగిన లిటరేచర్ సదస్సుకు షాహిద్ హాజరయ్యారు.స్పేసెస్ వీ కాల్ హోమ్.. డయాస్పోరా అండ్ బిలాంగింగ్ అన్న అంశంపై ఆయన మాట్లాడారు.

నిరసనలంటూ అక్కడే కూర్చుంటే ఎలా..?: సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు



పండగ సీజన్‌లో దిల్లీలో నిరసనలు చేపట్టవద్దంటూ విపక్షాలు, ఇతర గ్రూప్‌లకు వ్యాపార సంఘాలు విజ్ఞప్తి చేస్తోన్న నేపథ్యంలో సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. నిరసనల పేరిట ఎవరూ కూడా ఏ ప్రాంతాన్ని నిరవధికంగా ఆక్రమించుకోవడం వీలుకాదని స్పష్టం చేసింది. అందోళనల కోసం కేటాయించిన అధికారిక ప్రదేశాలకూ ఒక సమయ పరిమితి ఉండాలని పేర్కొంది .

''మీరు ఒక ప్రదేశాన్ని శాశ్వతంగా ఆక్రమించుకోవడం వీలుకాదు. ఎప్పటికీ మీ అధీనంలోనే ఉంచుకోలేరు. ఇతర అంశాలపై నిరసనలు చేస్తున్నవారు కూడా ఉన్నారు. రైతులు, న్యాయవాదులు ఎక్కడికి వెళ్తారు..? ప్రతి ఒక్కరికీ నిరసన తెలిపే హక్కు ఉంది'' అని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ పేర్కొన్నారు. నిరసనలకు పిలుపునిచ్చేవారే.. తర్వాత జరిగే ఎలాంటి పరిణామాలకైనా బాధ్యత వహించాలని ఈ సందర్భంగా ప్రభుత్వం తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు. జులై 20న చేపట్టిన నిరసనకు కేవలం ఒక్కరోజు మాత్రమే అనుమతి ఇచ్చారని, కానీ నిరసనకారులు ఆ ప్రాంతాన్ని ఆక్రమించి, పార్లమెంట్ వరకు మార్చ్ చేశారని మెహతా న్యాయస్థానానికి తెలియజేశారు .

వ్యాపార సంఘాల తరపున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ వాదనలు వినిపించారు. దేశ రాజధానిలో నిరసనల వల్ల కలుగుతోన్న అంతరాయంపై ఆందోళన వ్యక్తంచేశారు. వాణిజ్య కార్యలాపాలపై వాటి ప్రభావాన్ని పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వ్యాపారులు నష్టపోతున్నారని, రానున్న రెండు నెలల పాటు నిరసనలపై ఆంక్షలు విధించాలని కోరారు. ఈ వాదనల అనంతరం సుప్రీంకోర్టు .. కేంద్ర ప్రభుత్వం తోపాటు, సంబంధిత వర్గాలకు నోటీసులు జారీ చేసింది.

ఆ టపాసుల సంగతేంటో చూడండి: కేంద్రానికి సుప్రీం ఆదేశాలు



దీపావళి సందర్భంగా దిల్లీలో ఈ నెల 7,8 తేదీల్లో ఉదయం 6 నుంచి 7 గంటల వరకు, రాత్రి 8 నుంచి 10 గంటల వరకు గ్రీన్ క్రాకర్స్ మాత్రమే కాల్చుకోవడానికి సోమవారం సుప్రీంకోర్టు అనుమతిచ్చింది. అయితే, కోర్టు ఆదేశాలను ధిక్కరించి.. కొందరు వ్యాపారులు దేశ రాజధానిలో అన్ని రకాల బాణసంచా విక్రయిస్తున్నట్లు స్థానిక మీడియాలో కథనాలు వచ్చాయి. వీటి గురించి మాట్లాడుతూ.. మంగళవారం న్యాయస్థానం అందోళన వ్యక్తం చేసింది. 'ఈ రోజు మీడియాలో ఒక ఫోటో వచ్చింది. గ్రీన్ క్రాకర్స్ మాత్రమే కాల్చాలని నిన్న మేం ఆదేశాలు ఇచ్చినప్పటికీ.. మార్కెట్లో లైసెన్స్ ఉన్నవి, లేనివి, క్యూఆర్ కోడ్ లేనివి.. ఇలా అన్ని రకాలు దొరుకుతున్నాయని అందులో పేర్కొన్నారు. ఆ టపాసుల సంగతేంటో చూడండి' అని కేంద్ర ప్రభుత్వాన్ని సుప్రీం కోర్టు ఆదేశించింది.

దిల్లీఎన్‌సీఆర్ ప్రాంతంలో కాలుష్యాన్ని అరికట్టే ఉద్దేశంతో తాము బాణసంచాపై పరిమితులు విధించామని సుప్రీం కోర్టు పేర్కొంది. కానీ, క్షేత్రస్థాయిలో అవి సరిగ్గా అమలు కాకపోవడంపై అసహనం వ్యక్తం చేసింది. ఈ విధంగా అన్ని రకాల టపాసులు కాల్చితే దేశరాజధానిలో కాలుష్య సమస్య కచ్చితంగా తీవ్రమవుతుందని ఆందోళన వ్యక్తం చేసింది. మతపరమైన అంశాలతో ముడిపడి ఉన్న ఆచారాలను పాటించే హక్కు వ్యక్తులకు ఉంటుందని పేర్కొంది. అది రాజ్యాంగపరమైన ఆంక్షలను అతిక్రమించకూడదని హెచ్చరించింది.

మనది లౌకిక దేశం.. నటి వీడియోను అప్‌లోడ్ చేయండి: బాంబే హైకోర్టు



దియా మీర్జా దీపావళి వీడియోపై వివాదం తలెత్తడంతో బృహన్ ముంబయి మున్సిపల్ కార్పొరేషన్ సోమవారం ఆ వీడియోను సామాజిక మాధ్యమాల నుంచి తొలగించింది. ఈ వివాదంపై బాంబే హైకోర్టు స్పందిస్తూ.. తీవ్ర విచారం వ్యక్తం చేసింది. ఆ వీడియోను తిరిగి అప్‌లోడ్ చేయాలని బీఎంసీని ఆదేశించింది. ఈ విషయంలో కొందరు వ్యక్తులు.. సంకుచిత మనస్తత్వాన్ని ప్రదర్శించారని ఆవేదన వ్యక్తం చేసింది. పర్యావరణ పరిరక్షణ, వాయు, శబ్ద కాలుష్యాల గురించి అవగాహన కల్పించేందుకు రూపొందించిన వీడియోకు అనవసరమైన రంగులు పులమడం దురదృష్టకరమని జస్టిస్ గిరీష్ కులకర్ణి, జస్టిస్ నీలా గోఖలేలతో కూడిన ధర్మాసనం వ్యాఖ్యానించింది.

పర్యావరణ హితంగా దీపావళి పండగను చేసుకోవాలని అవగాహన కల్పించేందుకు ప్రముఖులను ఎంచుకోవాలని బీఎంసీ కమిషనర్ తీసుకున్న నిర్ణయం సరైనదేనని కోర్టు పేర్కొంది. దీనిపై కొందరు వ్యక్తులు అనవసరమైన వివాదాలను తెరపైకి తీసుకురావడం బాధాకరమని వెల్లడించింది. వీడియోపై అభ్యంతరం తెలిపిన వారిని ఉద్దేశిస్తూ.. సమాజంలోని ప్రతి వ్యక్తిని వారి మతం, కులం, వర్గంతో సంబంధం లేకుండా గౌరవించాలని స్పష్టం చేసింది. మనది లౌకిక దేశమని.. పౌరులందరూ లౌకిక స్ఫూర్తిని పెంపొందించుకోవాలని రాజ్యాంగం ఆశిస్తుందని పేర్కొంది.

'ప్రజల ఐక్యత, సమాజం పట్ల ఉండే బలమైన అనుబంధంతోనే ముంబయి వంటి నగరం మనుగడ సాగిస్తోంది. కొందరి బాధ్యతారాహిత్య వ్యాఖ్యల వల్ల ఆ ఐక్యతకు భంగం కలగకూడదు. నటి వీడియోపై విమర్శలు చేసిన రాజకీయ నాయకులు లేదా ఇతర వ్యక్తులు.. పర్యావరణ అవగాహన కల్పించేలా ఎటువంటి వీడియోలు చేసినట్లు మాకు కనిపించలేదు. మనం లౌకిక దేశంలో ఉన్నాం. వారి ప్రవర్తన మాకు తీవ్ర ఆవేదన కలిగించింది. ప్రజలకు నాయకత్వం వహించే పదవుల్లో ఉన్న వ్యక్తుల నుంచి ఇలాంటి ప్రవర్తన ఆశించలేం. ఇది పర్యావరణానికి సంబంధించిన అంశం. దీనికి మతం, కులంతో సంబంధం లేదు. ఎందుకంటే ప్రతి ఒక్కరూ పీల్చే గాలి ఒక్కటే ' అని కోర్టు పేర్కొంది.



సముద్ర దొంగల ఆటకట్టించిన ఇండియన్ నేవీ.. ఇరాన్ ఫిషింగ్ షిప్, 20 మంది సిబ్బంది సేఫ్ రిలీజ్..!

సోమాలియా సముద్ర దొంగలు అపహరించిన ఇరాన్ ఫిషింగ్ షిప్‌ను అందులోని 20 మంది సిబ్బందిని భారత నావికాదళం ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ సహకారంతో సురక్షితంగా కాపాడింది. సముద్ర దొంగల ఆటకట్టించేందుకు భారత నౌకాదళం ఇండియన్ ఫోర్స్‌తో కలిసి 48 గంటలపాటు ఓ సాహసోపేతమైన ఆపరేషన్ నిర్వహించింది. పక్కా ప్రణాళికతో ముందుకు కదిలి సముద్ర దొంగలను తరిమికొట్టింది.

దాంతో దొంగలు హైజాక్ చేసిన మత్స్యకారుల నౌక చెరవీడింది. ఎలాంటి ప్రాణనష్టం లేకుండా 20 మంది సిబ్బందిని ఇండియన్ నేవీ రక్షించింది. అరేబియా సముద్రంలో ఇరాన్‌కు చెందిన ఫిషింగ్ షిప్ 'అజిని ' ని సోమాలియా సముద్ర దొంగలు అక్టోబర్ 29న హైజాక్ చేశారు. ఆ నౌకలోని 20 మంది సిబ్బందిని కాపాడేందుకు భారత నేవీ, భారత వైమానిక దళం సంయుక్త ఆపరేషన్ నిర్వహించాయి. అక్టోబర్ 29న ఈ నౌక అపహరణకు గురైంది. నవంబర్ 2న ఈ ఆపరేషన్ విజయవంతంగా పూర్తయింది.

ఒమన్ తీరంలో భారత నౌకపై దాడి.. ఇండియన్ సెయిలర్ దుర్మరణం..!



ఒమన్ తీరం లో భారత్ కు చెందిన నౌక 'ఎంఎస్‌వి అల్ జుసుఫీ ' పై దాడి జరిగింది. ఈ ఘటనలో నౌకలోని ఓ భారతీయ నావికుడు ప్రాణాలు కోల్పోయినట్లు కేంద్ర మంత్రి సర్బానంద సోనోవాల్ వెల్లడించారు. ప్రమాదం జరిగిన సమయంలో నౌకలో మొత్తం 14 మంది భారత నావికులు ఉన్నట్లు పేర్కొన్నారు.

వారిలో ఒకరు మరణించగా మిగతా 13 మందిని ఒమన్ కోస్ట్ గార్డ్ బృందాలు రక్షించినట్లు నేవీ అధికారులు తెలిపారు. వారికి తగిన సాయం అందేలా అక్కడి భారత రాయబార కార్యాలయం స్థానిక అధికారులతో సంప్రదింపులు జరుపుతోందని చెప్పారు. మృతుడు గుజరాత్‌కు చెందిన గంధర్ నహీం అజీజ్‌గా గుర్తించారు. ప్రాణాలతో బయటపడిన సిబ్బందిని, మరణించిన నావికుడి మృతదేహాన్ని వీలైనంత త్వరగా భారత్‌కు రప్పించేందుకు కృషి చేస్తున్నామన్నారు.

రూ.5 కోట్లు ఇవ్వకుంటే లేపేస్తాం.. మరో బాలీవుడ్ నటుడికి బిష్ణోయ్ గ్యాంగ్ బెదిరింపులు..!



ఇటీవల బాలీవుడ్ నటుడు టైగర్ ష్రాఫ్ పై ఇటీవల లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ కాల్పులకు పాల్పడింది. అంతకుముందు కూడా సల్మాన్ ఖాన్ ఇంటిపై బిష్ణోయ్ గ్యాంగ్ కాల్పులు జరిపింది. ఈ ఘటనలు బాలీవుడ్ ఇండస్ట్రీలో సంచలనం సృష్టించాయి. తాజాగా ఆ గ్యాంగ్ మరో నటుడిని టార్గెట్ చేసింది. బాలీవుడ్ నటుడు తుషార్ కపూర్‌ను బిష్ణోయ్ గ్యాంగ్ సభ్యులు బెదిరించారు.

లారెన్స్ గ్యాంగ్ సభ్యుడు 'హ్యారీ బాక్సర్' పేరిట ఓ వ్యక్తి నుంచి తుషార్ కపూర్‌కు ఫోన్ కాల్ వచ్చింది. తమకు రూ.5 కోట్లు ఇవ్వాలని లేదంటే హత్య చేస్తామని ఫోన్‌చేసిన వ్యక్తి బెదిరింపులకు దిగాడు. దాంతో అప్రమత్తమైన తుషార్ కపూర్ వెంటనే ముంబై క్రైమ్ బ్రాంచ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తుషార్ కపూర్ వారం ముందే తమకు ఫిర్యాదు చేశాడని, భద్రతాకారణాల దృష్ట్యా ఈ విషయాన్ని బయటికి వెల్లడించలేదని తెలిపారు.

ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. కాగా, తుషార్ కపూర్ 30కి పైగా బాలీవుడ్ సినిమాల్లో నటించారు. పలు చిత్రాలకు నిర్మాతగానూ వ్యవహరించారు. ప్రముఖ నిర్మాత ఏక్తా కపూర్ సోదరుడే ఈ తుషార్ కపూర్.

ప్రమాదకర స్థాయికి వాయు కాలుష్యం

దీపావళికి ముందే దిల్లీ లో వాయు కాలుష్యం అత్యంత ప్రమాదకర స్థాయికి చేరుకుంది. మంగళవారం ఉదయం 8 గంటలకు సగటు వాయు నాణ్యతా సూచీ 451కిపైగా నమోదవడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. రోహిణీలో 429, పంజాబీ బాగ్‌లో 424, బవానలో 408 ఏక్యూఐ నమోదైనట్లు కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి తెలిపింది. మిగిలిన ప్రాంతాల్లోనూ ఏక్యూఐ 360 దాటి గాలినాణ్యత వెరీ పూర్ కేటగిరీలో కొనసాగుతోంది. దీంతో వాయు నాణ్యతా నిర్వహణ కమిషన్ దిల్లీఎన్‌సీఆర్ వ్యాప్తంగా GRAPII ఆంక్షలను అమల్లోకి తెచ్చింది. దిల్లీ రహదారులపై మెకానికల్ స్వీపింగ్, నీళ్లు చల్లడం వంటి చర్యలు చేపట్టారు.



తల్లులు ఎందరికో స్ఫూర్తి

ఇటీవల జపాన్‌లోని ఐచీ నగోయాలో అట్టహాసంగా ముగిసిన ఆసియా క్రీడల్లో భారత్ అత్యద్భుతమైన ప్రదర్శన కనబర్చింది. భారత క్రీడాకారులు 21 బంగారు పతకాలు సహా మొత్తం 85 పతకాలు సాధించి 140 కోట్ల మంది భారతీయులు గర్వపడేలా చేశారు. 2022లో చైనాలో జరిగిన ఆసియా క్రీడల్లో సత్తా చాటినట్లుగానే, ఈసారి జపాన్ ఏషియాడ్‌లోనూ మనవాళ్లు అదరగొట్టారు. గత దశాబ్దకాలంగా భారతదేశంలో క్రీడాభివృద్ధికి తీసుకుంటున్న చర్యలు, అందిస్తున్న ప్రోత్సాహం కారణంగా మన క్రీడాకారులు అంతర్జాతీయ వేదికలపై నిలకడ ప్రదర్శన కనబరుస్తున్నారు. 1982లో ఢిల్లీ వేదికగా జరిగిన ఆసియా క్రీడల్లో స్వర్ణం గెలుచుకున్న భారత మహిళల హాకీ జట్టు.. 44 ఏళ్ల తర్వాత ఈ ఆసియా క్రీడల్లో స్వర్ణం గెలుచుకుంది. 17 ఏళ్ల కుముద్ మహోద్.. ఆర్చరీ మహిళల విభాగంలో స్వర్ణం గెలుచుకుని.. 1998 నుంచి ఆసియా క్రీడల్లో ఆర్చరీలో కొరియా మహిళల ఆధిపత్యానికి చెక్ పెట్టారు.

తెలంగాణలోని పెద్దపల్లి జిల్లా సుల్తాన్‌పూర్ అనే చిన్న గ్రామం నుంచి వచ్చిన చికిత తానిపర్తి.. కాంపౌండ్ ఆర్చరీలో బంగారు పతకాన్ని గెలుచుకోవడం భవిష్యత్తు తరాలకు స్ఫూర్తిదాయకం. ఆ కుటుంబం పడిన శ్రమకు, చేసిన త్యాగాలకు ఈ విజయం గొప్ప బహుమానం. అద్భుతమైన టాలెంట్ ఉన్న చికిత.. హరియాణాలోని సోనిపత్‌లో ఉన్న స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా 'నేషనల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'లో చేరి, కోచ్ వివేక్ కుమార్ ప్రోత్సాహంతో ఎంతో సాధన చేశారు. దీని ఫలితంగానే ఇవాళ ఆసియాడ్ ఆర్చరీలో భారత్ ఖాతాలో స్వర్ణం చేరింది. ఇదే విభాగం నుంచి విజయవాడ అమ్మాయి జ్యోతి సురేఖ స్వర్ణం సాధించి మరెందరికో ఆదర్శంగా నిలిచారు.

ఇక, 400 మీటర్ల హర్డిల్స్ పరుగులో విథియా రామరాజ్ 42 ఏళ్ల నేషనల్ రికార్డును బద్దలు కొట్టారు. 1984 లాస్ ఏంజెలెస్ ఒలింపిక్స్‌లో పీటీ ఉష రికార్డును అధిగమించారు. ఇలాంటి ఎన్నో కుటుంబాల కృషి ఫలితమే ఇవాళ మెరికల్లాంటి క్రీడాకారులు అంతర్జాతీయ వేదికలపై మన త్రివర్ణ పతాకాన్ని రెపరెపలాడిస్తున్నారు. మనందరం గర్వపడేలా చేస్తున్నారు. భారత్ సాధించిన 21 బంగారు పతకాల్లో సగం పతకాలను మహిళలే సాధించారు. వీరేమీ సకల సౌకర్యాలున్న నేపథ్యం నుంచో, బాగా డబ్బున్న కుటుంబాల నుంచో రాలేదు. వీరిలో ఉన్న ప్రతిభను తల్లిదండ్రులు గుర్తించి.. వారి పరిస్థితులు సహకరించకపోయినా.. కష్టనష్టాలకు ఓర్చి ప్రభుత్వ సహకారాన్ని అందిపుచ్చుకుని వీరికి క్రీడల్లో శిక్షణ అందించారు.

క్రీడాకారుల కృషికి.. ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం.. ఖేలో ఇండియా, టార్గెట్ ఒలింపిక్ పోడియం స్కీమ్ , టార్గెట్ ఏషియన్ గేమ్స్ గ్రూప్ (వంటి పథకాల ద్వారా అండగా నిలిచింది. పథకంలో భాగంగా వారికి జాతీయ కోచింగ్ క్యాంపుల్లో శిక్షణ, అంతర్జాతీయ స్థాయి ట్రైనింగ్ సెషన్స్‌తో పాటు విదేశాల్లోనూ శిక్షణ అందిస్తోంది. అవసరమైనచోట విదేశీ నిపుణులను, కోచ్‌లను, సపోర్టింగ్ స్టాఫ్‌ను నియమిస్తోంది. అవసరమైన క్రీడాసామగ్రిని, శిక్షణ వసతులను సమకూర్చుతోంది. అంతేకాదు, ఖేలో ఇండియా పథకం ద్వారా 2,786 మంది క్రీడాకారులను వెన్నంటి ప్రోత్సహిస్తోంది.

ఈ ఆసియా క్రీడల్లో మన మహిళా క్రీడాకారులు.. ఆర్చరీ, హాకీ, క్రికెట్, అథ్లెటిక్స్‌లోనే కాకుండా అనేక క్రీడల్లో తమ సత్తా చాటారు. గోల్ఫ్‌లో ప్రణవి ఉర్స్, బాక్సింగ్‌లో పల్వీన్ ఖుడా, లవ్లీనా బోర్గోహైన్, షూటింగ్‌లో నీరూ ధాండాతో పాటు టీం, మిక్స్‌డ్ ఈవెంట్లలోనూ మహిళా క్రీడాకారులు అద్భుతంగా రాణించారు.

దేశ ప్రాధాన్యతాంశాల్లో స్పోర్ట్స్‌కు కూడా కేంద్రం పెద్దపీట వేసింది. తాజా ఆసియాడ్ ఫలితాల నేపథ్యంలో మరింత ఉత్సాహంతో ముందడుగేయనుంది. అంతర్జాతీయ క్రీడల్లో మన ఆటగాళ్లు మెరుగైన ఫలితాలు సాధించేందుకు నిరంతరం అండగా నిలబడుతూనే ఉంటుంది. అహ్మదాబాద్‌లో 2030లో కామన్‌వెల్త్ గేమ్స్ జరగనున్నాయి. అలాగే 2036 ఒలింపిక్స్ క్రీడలను భారత్‌లో నిర్వహించాలన్న ప్రధానమంత్రి నరేంద్రమోదీ కల నెరవేరే దిశగా వడివడిగా అడుగులు పడుతున్నాయి. ఒలింపిక్స్ నిర్వహణ కోసం భారత్‌తో పాటుగా మరో 6 దేశాల బిడ్స్‌ను పరిశీలిస్తున్నట్లు అంతర్జాతీయ ఒలింపిక్స్ సంఘం స్పష్టం చేసింది. కాగా, రానున్న ఒలింపిక్ క్రీడల్లో, అంతర్జాతీయ పోటీల్లో సాధ్యమైనన్ని ఎక్కువ ఈవెంట్లలో మన క్రీడాకారులు పాల్గొనాలని 80వ స్వాతంత్ర్య వేడుకల సందర్భంగా ఎర్రకోట వేదికగా ప్రధానమంత్రి మోదీ సూచించారు. ఒలింపిక్ క్రీడల్లో దాదాపు 40 స్పోర్ట్స్, దాదాపు 325 ఈవెంట్లు ఉంటే, ఇందులో కనీసం మూడింట రెండొంతుల ఈవెంట్లలో కూడా భారతదేశం పాల్గొనలేకపోతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మరి కొన్నింటిలో కనీసం అర్హత కూడా సాధించలేకపోతున్నామన్నారు. 2036 నాటికి అన్ని క్రీడాంశాలపై దృష్టి సారించాలని యువతకు మోదీ పిలుపునిచ్చారు. దీంతో ప్రధానమంత్రి ఆలోచనలకు అనుగుణంగా ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి, వారి సామర్థ్యాలకు సానబెట్టి 2036 ఒలింపిక్స్‌లో భారతదేశం వీలైనన్ని ఎక్కువ పతకాలను సాధించే దిశగా.. క్రీడామంత్రిత్వ శాఖ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ప్రపంచ క్రీడాపటంలో భారత్ అగ్రస్థానంలో నిలవాలంటే.. అవసరమైన మౌలిక వసతులను అభివృద్ధి చేయడంతో పాటు ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించడం, వారికి మెరుగైన శిక్షణ అందించడం, శారీరక, మానసిక దృఢత్వాన్ని పెంపొందించడం అవసరం. ఇందుకోసం అన్ని వ్యవస్థల సమన్వయంతో క్రమబద్ధంగా ముందుకు సాగాలి. క్రీడలు, యువజన వ్యవహారాలకు కేంద్ర ప్రభుత్వం కేటాయిస్తున్న బడ్జెట్ గత 12 ఏళ్లలో దాదాపు 4 రెట్లు పెరిగింది. 2013–14లో రూ.1,219 కోట్లు కేటాయించగా, ఈ ఏడాది రూ.4,480 కోట్లను కేంద్ర ప్రభుత్వం కేటాయించింది. భారత క్రీడా రంగాన్ని సమూలంగా మార్చే లక్ష్యాల్లో భాగంగా 2026–27 నుంచి 2030–31 వరకు 'ఖేలో ఇండియా' పథకాన్ని కొనసాగించేందుకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం రూ.29,054 కోట్లు కేటాయించింది. అథ్లెట్లు, పారా–అథ్లెట్లకు సహకారం అందిస్తూనే, ఆదివాసీ క్రీడలు, వెనుకబడిన ప్రాంతాల్లోని క్రీడాకారులకు అండగా నిలిచేందుకు ప్రత్యేక కార్యక్రమాలను చేపట్టేలా ఈ పథకాన్ని అమలు చేస్తోంది. క్రీడల్లో మహిళల భాగస్వామ్యాన్ని పెంచేందుకు 2021లో ప్రారంభించిన 'ఖేలో ఇండియా మహిళల (అస్మిత) లీగ్' ద్వారా ఇప్పటివరకు 700 నగరాల్లో, 38 ఈవెంట్లలో 3,500కు పైగా పోటీలు జరిగాయి. ఇందులో 6 లక్షలకు పైగా మహిళా క్రీడాకారులు పాల్గొన్నారు. ఇవన్నీ భారత క్రీడాప్రతిభను వెలికితీస్తూ, వారిని దేశానికి ప్రాతినిధ్యం వహించేలా ప్రోత్సహించేందుకు మోదీ సర్కారు చేపడుతున్న కార్యక్రమాలకు కొన్ని ఉదాహరణలు మాత్రమే.



విజయవాడకే దక్కిన ఘనత

సుమారు 1500 ఏళ్లకు పైగా ఒక నగరాన్ని ఒకే పేరుతోనో స్వల్ప మార్పులతోనో పిలవటం దక్షిణాదిలో అరుదు. విజయవాడకే ఈ ఘనత దక్కింది. తమిళనాడులోని మధురైని అలా పిలిచినా, దాని పేర్లు మూలంతో సంబంధం లేకుండా చాలా మారాయి. కానీ ఒకే పేరుతోనో లేదా స్వల్ప తేడాతోనో పిలుస్తున్న నగరం విజయవాడ మాత్రమే. జనపదాల నాటి జనస్మృతులు కొన్ని కల్పనలతో కూడి పురాణాలుగా మారడం సహజమే గానీ వాటికి ఆధారాలుండవు. పురాణాలతో సంబంధం లేకుండానే విజయవాడ నామధేయ చారిత్రక దశలు మనకు శాసనాల్లో కనిపించడం విశేషం. విజయవాడ ప్రాంతం ఎంత పాతదో... అంత కాకపోయినా విజయవాడ పేరు కూడా పాతదే. చెన్నై తదితర ప్రఖ్యాత మ్యూజియాలలో ఇప్పటి వరకు లభించిన అనేక శాసనాల ఆధారంగా చూసినప్పుడు విజయవాడ మొదటి పేరు.. విజయవాట.మనకు లభిస్తున్న ముఖ్యమైన ఆధారాల్లో ఒకటి 7వ శతాబ్దానికి (సామాన్య శకం 673–682) చెందిన తూర్పు చాళుక్య రాజు రెండో విష్ణువర్ధన కాలానికి సంబంధించిన పెదపురప్పాడు తామ్ర పత్రాల మొదటి సముదాయం. ఈ తామ్రపత్రంలోని ప్రారంభ వాక్యం 'స్వస్తి విజయవాట స్కంధావారాత్' అని ఉంది. దాని భావం 'విజయవాట రాజ/ సైనిక శిబిరం నుంచి శుభం', లేదా 'విజయవాటలోని రాజ శిబిరం నుంచి జారీ అయింది' అని. ఇది ఇప్పటివరకు మనకు దొరికిన శాసనాలలో మొదటిదిగా భావిస్తున్నందున అంతకు కొన్నివందల ఏళ్ల ముందే ఈ పేరు ఉండి ఉండవచ్చు.



తర్వాతి కాలంలో (719-755) మూడో విష్ణువర్ధను డి ముసినికుండ రాగి ఫలకాలలో 'బిజవాడ' పేరు కనిపించింది. అందులోని 21-23 పంక్తుల్లో 'ప్రియవల్లభ-అయ్యణ మహాదేవీ-బిజవాడ-నడుంబి-వసత్యై' అని కనిపిస్తుంది. కుబ్జ విష్ణువర్ధన మహారాజు (624-642) మహారాణి అయ్యణ మహాదేవి ఏర్పాటు చేసిన బిజవాడ నడుంబి వసతికి ముసినికుండ గ్రామాన్ని దానం చేసిన భావం అది.

అద్దంకి పండరంగ శాసనంలో బెజవాడగా పేరు మారి కనిపించింది. భారత పురావస్తుశాఖ దీనిని గుణగ విజయాదిత్యుని మొదటి రాజ్య సంవత్సరానికి అనగా 848కు సంబంధించిందిగా పరిగణిస్తోంది. పాత ఎపిగ్రాఫియా ఇండికా గుణగ విజయాదిత్యుడి పాలనను 844-888గా తీసుకుంది. కాబట్టి ఈ శాసనం 844-845 కాలానిదై ఉండవచ్చని పేర్కొంటున్నారు. ఇందులో ఎనిమిదవ పంక్తి.. 'కట్టెపుదుర్గం బు గదు బయల్సేసి కణ్డుకూర్ బెజవాడ గావ మెచ్చి'.. అని బెజవాడ ప్రస్తావన ఇందులో ప్రస్ఫుటంగా ఉంది. విజయవాడ ఇంద్రకీలాద్రిపై ఉన్న 9వ శతాబ్దం నాటి కిరాతార్జున స్తంభ శాసనంలో పెచ్చవాడ అని ఉంది. 9వ పంక్తిలో 'కలొ పెచ్చెవాడ- కలియమ బోయి పుత్రః త్రికోటి బోయి' అనే పఠనం ఉంది. అంటే త్రికోటి బోయి అనే వ్యక్తిని పెచ్చవాడకు సంబంధించినవాడిగా పేర్కొంటోంది. 'బెజవాడకు ఈ శాసనంలో పెచ్చవాడ అని పేరు ఉన్నప్పటికీ, తామ్రపత్రాల్లో మాత్రం విజయవాడ, విజయవాట, విజయవాటిక అనేరూపాలు ఉన్నాయి' అని పురావస్తు సర్వే నివేదిక పేర్కొంది.

928-934 మధ్య పాలించిన తూర్పు చాళుక్య రాజు యుద్ధమల్లుడి స్తంభ శాసనంలో బెజవాడ అనే రూపం కనపడింది. బెజవాడకు వచ్చే యాత్రికులు, అక్కడి దేవాలయం, మఠం వంటి విషయాలు కూడా శాసనంలో ఉన్నాయి. ఇందులోని నాలుగో పద్యంలో... చేబ్రోలు నుంచి బెజవాడ జాతరకు వచ్చిన కుమారస్వామి ఈ ప్రదేశాన్నే ఇష్టపడి ఇక్కడ ప్రత్యక్షంగా నిలిచాడని, దాంతో మల్లుడు ఆలయం, మఠం నిర్మించాడని చెబుతుంది. ఐదో పద్యం.. 'బెజవాడకెల్ల బెడంగును రక్షయుంగాను న్దమతాత మల్లపరాజు వేరెయు దానుం గట్టించెం..' అని ఉంది. బెజవాడ మొత్తానికి అలంకారంగా, రక్షణగా నిలిచేలా యుద్ధ మల్లుని తాత మల్లపరాజు ఆలయాన్ని నిర్మించాడు అని దీని భావం. 'బెజవాడ మొత్తానికి' అనే సూచన చూస్తే బెజవాడ అప్పటికే ఒక పట్టణంగానో, క్లస్టర్‌గానో ఆవిర్భవించినట్లు అనుకోవచ్చు.

పదో శతాబ్దం ప్రారంభానికి సంబంధించి రికార్డు చేసిన మధ్యయుగ జైన మతం అనే పరిశోధన గ్రంథం, తూర్పు చాళుక్య రాజు రెండో అమ్మరాజు కాలంలో విజయవాటికలోని రెండు జైన దేవాలయాలకు దానాలు జరిగినట్లు చెప్పి, 'విజయవాటికను బిజవాడ' అని కూడా పేర్కొంది. ఇదే విషయాన్ని ఎపిగ్రాఫియా ఇండికా సంపుటి మరింత స్పష్టంగా 'విజయవాటిక ఈజ్ క్లియర్లీ ఐడెంటికల్ విత్ మోడరన్ టౌన్ బెజవాడ ఆన్ ది కృష్ణా రివర్' అని పేర్కొంది. రెండో అమ్మరాజు (945-970)కి సంబంధించిన తామ్రపత్ర దాన శాసనం విజయవాటికలోని రెండు జైన దేవాలయాలకు భూదానం చేసినట్లు చెప్తోంది. ఈ అమ్మరాజు కాలానికే చెందిన 958 నాటి రాగి ఫలక శాసనంలో తాండికొండతో పాటు మరికొన్ని గ్రామాలను విజయవాటలోని శివాలయానికి దానం చేసినట్లు నమోదై ఉంది. అసగా ఒక శాసన సంప్రదాయంలో విజయవాటిక, మరో శాసనంలో విజయవాట కనిపిస్తున్నాయి. ఇక 1229 నాటి ప్రకాశం జిల్లా వెలిగండ్ల లో లభించిన శాసనంలో 'ఇంద్రకీలాద్రిలోని బెజవాడ మల్లేశ్వరదేవ'కు దానం నమోదై ఉంది. అక్కడ ఇంద్ర కీలాద్రి, బెజవాడ, మల్లేశ్వరదేవ... మూడు అంశాలు ఒకే ధార్మిక స్థలాన్ని సూచిస్తున్నాయి.

ఇక విజయవాడ అనే రూపానికి కూడా శాసన ఆధారాలు ఉన్నాయి. పురావస్తు శాఖ శాసనాల జాబితాలో తూర్పు చాళుక్య సర్వలోకాశ్రయ విష్ణువర్ధనుడి పదిహేడో పాలన సంవత్సరానికి చెందిన విజయవాడ శాసనం నమోదై ఉంది. మల్లికార్జున ఆలయం నుంచి కనకదుర్గ ఆలయం వైపు వెళ్లే మార్గంలోని రెండో మెట్ల వరుస వద్ద ఈ శాసన ఫలక ఉన్నట్లు ఆ జాబితా పేర్కొంది. శాసనంలో తెలుగు-సంస్కృత భాషలు, తెలుగు లిపి ఉపయోగించారు.

ఇప్పటివరకు లభించిన శాసనాధారాలన్నిటినీ ఒక క్రమంలో పరిశీలిస్తే.. విజయవాట, బిజవాడ, పెచ్చవాడ, బెజవాడ, విజయవాటిక, విజయవాడ అనే రూపాలు మన ముందుకు వస్తాయి. వీటిలో కొన్ని ప్రత్యక్ష శాసన పఠనాలు, కొన్ని సంబంధిత రూపాలు; మరికొన్ని శాసన సంపాదకులు ప్రదేశాన్ని గుర్తించేందుకు అనుసంధానించిన రూపాలు. మొదటి 'విజయవాట' అనే పేరు ఆ స్థానిక జనపదాల సంస్కృతీకరణ ప్రభావంతో ఏర్పడి, ఏ చారిత్రక, భాషాపరమైన కారణాలతోనో 'బిజవాడ'గా, తర్వాత 'బిజవాడ'గా, 'బెజవాడ'గా మారి ఉండవచ్చు. ఈ మధ్యలో జరిగిన చాలా పరిణామాలు శాసనాలకు ఎక్కకపోయి ఉండొచ్చు. ఈ మార్పుల వెనుక స్థానిక ఉచ్చారణలు, ధ్వని పరిణామాలు, లిప్యంతరీకరణలు, వాడుకలు, వాడుక భేదాలు, సంస్కృతీకృత రూపాలతో కలిసి విస్తరించి, వివిధ రూపాల్లో కొనసాగిన ప్రక్రియగా భావించాల్సి ఉంటుంది. అయితే తొలి రూపం (విజయవాట) పెద్దగా చెరిగిపోకుండా కొనసాగడమే విజయవాడ పేరు చరిత్రలోని ప్రత్యేకత. శాసనాధారాల ప్రకారం ఈ నగర నామానికే 15 శతాబ్దాల చరిత్ర కనిపిస్తుంటే, అంతకు ముందరి శతాబ్దాలవి కనిపించని శాసనాలెన్నో.. ఇక ఈ నగర ఆవిర్భావ తొలి దశలు అంతకు ముందు ఎన్ని శతాబ్దాల నాటివో! విజయోస్తు.. విజయవాడ!!

చరిత్రను పురాణంగా చెప్పినవారు

చరిత్రను పురాణంగా చెప్పినవారు- మధునాపంతుల సత్యనారాయణశాస్త్రి. కాల్పనిక నవలా ప్రక్రియ రూపంలో అందించినవారు- ముదిగొండ శివప్రసాద్. నిజానికి చరిత్రను అక్షరాల్లో పాదిగేందుకు కేవలం రచనా సామర్థ్యం చాలదు. భారతీయమైన వైభవోజ్జ్వల చారిత్రక ఘట్టాలను అక్షరబద్ధం చేయడమనేది ఒక తపస్సు! ఆధునిక యుగంలో ఒక విశ్వనాథ సత్యనారాయణ, ఒక నోరి నరసింహశాస్త్రి, ఒక అడవి బాపిరాజు వంటి దిగ్గజాలకు సాధ్యం అయిందది. ఆ పరంపరకు చెందినవారు ముదిగొండ శివప్రసాద్! 'చారిత్రక నవలా చక్రవర్తి'గా పేరొందిన ముదిగొండ శివైక్యం చెందడంతో ఆ పరంపర ముగిసినట్లయింది. యువతరంలో చరిత్ర పట్ల అనురక్తిని తద్వారా వ్యక్తిగతమైన ధర్మనిబద్ధతను రక్తంలో రంగరించగల మరో రచయిత కోసం రసజ్ఞలోకం చాలాకాలం ఎదురుచూడాల్సి ఉంటుంది.



ముదిగొండ నోరున్న రచయిత. తాను నమ్మిన సిద్ధాంతాల గురించో, సాంస్కృతిక వారసత్వం గురించో ఆమోదయోగ్యం కాని వ్యాఖ్యానాలు వెలువడిన ప్పుడల్లా 86 ఏళ్ల వయసులోనూ ఖంగుమని మోగే కంఠంతో, అపారమైన ధారణతో బలమైన ప్రమాణాలతో విరుచుకుపడటం ఆయన నైజం. ప్రాచీన సాహిత్యంలో, పురాణవాఙ్మయంలో ఆయనకు గల గట్టి పట్టు ఈ విషయంలో గొప్ప ఆయుధం అయింది. నిందకు తావివ్వని ఆక్షేపణలతో, తీవ్ర పదజాలంతో కువ్యాఖ్యలను ఆయన ఖండించే తీరు జనాన్ని అబ్బురపరచేది. 1940 డిసెంబర్ 23న ప్రకాశం జిల్లా ఆకుల అల్లూరులో జన్మించిన ముదిగొండ వృత్తి జీవితం హైస్కూలు ఉపాధ్యాయుడిగా మొదలై ఉస్మానియా విశ్వవిద్యాలయ ఆచార్యుడిగా విస్తరించింది. సినారె గైడుగా 'ఆధునిక ఆంధ్రకవిత్వంపై ఉద్యమాల ప్రభావం' అనే అంశం గురించి చేసిన పరిశోధన ఆయనను 'డాక్టర్ ముదిగొండ'ను చేసింది. రాజకీయ సామాజిక సాహిత్య ఉద్యమాలు కవిత్వాన్ని ఏయే కోణాల్లో ప్రభావితం చేశాయన్నది తనదైన విలక్షణ చారిత్రక అవగాహనతో విశ్లేషించడం ఆ పరిశోధనకు పన్నెత్తెచ్చింది. రచయితగా తన కలం నుంచి దాదాపు 150 నవలలు వెలువడ్డాయని ముదిగొండ ఓ ఇంటర్వ్యూలో ప్రకటించారు. వాటిలో 20కుపైగా చారిత్రకాలు కావడం ఆయన అభిరుచి విశేషానికి చిహ్నం.

ప్రత్యేక రచనా శైలి...

పట్టాభి, రెసిడెన్సీ, శ్రీలేఖ, శ్రావణి, వంశధార, తంజావూరు విజయం, మహాసర్ప, బసవగీత, సమ్రాట్ పుష్యమిత్ర, సగం విరిగిన చంద్రుడు, గంగ నుండి గంగ వరకు వంటి నవలలు ముదిగొండకు విశేష ఖ్యాతిని అందించాయి. ముఖ్యంగా ఓరుగల్లు పౌరుషాన్ని, కాకతీయుల అభిజాత్యాన్ని, వేయి స్తంభాల గుడి ప్రాశస్త్యాన్ని చిత్రించిన అద్భుతకావ్యం 'ఆవాహన' 70వ దశకంలో అప్పటి విద్యార్థులను ఉర్రూతలూపింది. చరిత్ర పట్ల ఆసక్తిలేని వారిని సైతం గొప్పగా ఆకట్టుకుంది. చరిత్రపట్ల అభిరుచిని మప్పింది. ఆయన శైలికి చెందిన ఘనతగా దాన్ని మనం గుర్తించాలి. చారిత్రక నవలలే కాదు 'అమృతవాహిని' (సాంఘికం), 'శ్రీపదార్చన' (ఆధ్యాత్మికం) వంటి ఇతరత్రా గ్రంథాలు సైతం ముదిగొండకు ఎంతో పేరు తెచ్చాయి. అమృతవాహినిలోని సముద్రపు హోరు, శ్రీపదార్చనలో అన్నమాచార్యుడి ఆధ్యాత్మికతను చెప్పిన తీరు ఎంతో విశిష్టంగా ఉన్నాయి. కానీ కాకతీయ వీరవిహారం జోరు ముందు తెలుగు చారిత్రక నవలా సాహిత్యానికి సంబంధించి ముదిగొండ శివప్రసాద్ అనే ఒక ప్రత్యేక అధ్యాయంలో అవి మౌనం వహించాయి.

దివాకర్ల వేంకటావధాని మాస్టారితో అనుబంధం, దువ్వూరి వేంకటరమణ శాస్త్రి వంటి మహాపండితుడి దగ్గర వ్యాకరణ అధ్యయనం ముదిగొండ వైదుష్యానికి పునాదిరాళ్లు. 'పాకుడురాళ్లు' రచయిత రావూరి భరద్వాజతో చిరకాల స్నేహం, పింగళి, కాటూరి, వేదుల, విశ్వనాథ, గంటి జోగి సోమయాజి వంటి ఉద్దండుల ప్రభావం ముదిగొండ వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దాయి. కృష్ణాపత్రిక సంపాదకవర్గంలో ముదిగొండ సభ్యుడిగా ఉన్న కాలంలోనే రావూరి 'పాకుడురాళ్లు' వెలుగుచూడటం విశేషం. చారిత్రక వ్యక్తులను పాత్రలుగా స్వీకరించి శాతవాహన, కాకతీయ, విజయనగర సామ్రాజ్య, తంజావూరు నాయకరాజుల వంశ వృత్తాంతాలు, ఆయా కాలాల సంప్రదాయాలు, జీవన సంస్కృతి, శాసనాల నేపథ్యాలను ఈతరానికి అందించారు ముదిగొండ. నాయకరాజుల కాలంనాటి రాజ్యపాలన, కళాపోషణ, భాషా సాహిత్యాలకు దక్కిన ఆదరణ వంటి విలువైన అంశాలతో ఆయన రచించిన 'తంజావూరు విజయం' ఇంటర్ విద్యార్థులకు పాఠ్యాంశమైంది.

సమగ్ర సాహితీవేత్త... పరిశోధకుడు...

ముదిగొండ రచనలపై సుమారు 30మంది పరిశోధనలు చేసి పట్టభద్రతను సాధించారు. పాల్కురికి సోమనాథుడిపై ముదిగొండ రచించిన ఆంగ్ల పరిశోధనాత్మక రచనను సాహిత్య అకాడమీ ప్రచురించింది. వేదాలు జ్యోతిషగ్రంథాలు, ప్రాచీన సాహిత్యంలోని గూఢార్థాలు.. ఆయనను విశేషంగా ఆకర్షించాయి. వాటిపై పరిశోధనకు ప్రోత్సహించాయి. కేవలం గ్రంథరచనలతో సరిపెట్టుకోకుండా తెలుగు సాహిత్య వైభవాన్ని దేశదేశాల్లో ప్రచారం చేశారు. ఆయన పద్య పఠనాసామర్థ్యం, ధారణాపటిమ అందరినీ మంత్రముగ్ధులను చేసేవి. 'ముదిగొండ శివప్రసాద్ మరణించారు' అనే మాటకు అర్థం ఒక వ్యక్తి ఈలోకంలోంచి నిష్క్రమించారని కాదు ఒక దేశభక్తుడు, సాంస్కృతిక ప్రియుడు, ఓ సాహిత్య సృజనకారుడు, ఈ దేశ చరిత్రను తనదైన రీతిలో జాతికి అందించాలన్న తపనకు జీవితాన్ని ముడుపుకట్టిన ఒక సమగ్ర సాహితీవేత్త, పరిశోధకుడు ఇక లేరని!

'నోబెల్ శాంతి'కి సరైన ఎంపిక

నిరుడు మాదిరిగానే ఈసారి కూడా అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఎంతగా అర్రులు చాచినా నోబెల్ శాంతి బహుమతి ఆయనకు దక్కలేదు. భారతీయ మూలాలున్న దక్షిణాఫ్రికా న్యాయవేత్త, మానవహక్కుల ఉద్యమకారిణి నవనీతం పిళ్లేను శాంతి పురస్కారానికి ఎంపిక చేశామని నోబెల్ కమిటీ శుక్రవారం చేసిన ప్రకటనను ప్రపంచవ్యాప్త మానవహక్కుల ప్రియులు హర్షించారు. కండబలం ఉన్నదనీ, ప్రపంచ దేశాలను దోచుకొచ్చి పోగేసిన అపార సంపద, ఆయుధ సంపత్తి సొంతమని విర్రవీగి బడుగు దేశాలపై దండెత్తే దుర్నీతి రాజ్యమేలుతున్న కాలంలో మానవహక్కుల కోసం నిలబడి హంతకుల్ని వేలెత్తి చూపగల చేవ, సాహసం ప్రదర్శించేవారు నిస్సందేహంగా మహోన్నతులు. నవనీతం ఆ కోవకు చెందిన అరుదైన మహిళ. గాజాలో మూడేళ్లుగా మారణహోమం సృష్టిస్తూ, వేలాదిమంది మరణానికి, లక్షలాదిమంది క్షతగాత్రులు కావటానికి కారణమైన ఇజ్రాయెల్ ముసుగు తొలగించిన ఐక్యరాజ్యసమితి మానవహక్కుల కమిషన్‌కు 2025లో ఆమె నేతృత్వం వహించారు.

మహాకవి శ్రీశ్రీ 'కవితా... ఓ కవితా!' ఖండికలోని అపురూప ప్రయోగం 'అగ్ని సరస్సున వికసించిన వజ్రం' విశేషణానికి నవనీతం సరిగ్గా సరిపోతారు. తన బతుకంతా పోరాటమే ఊపిరిగా శ్వాసించిన ఆమె...బాల్యంలో దుర్భరదారిద్ర్యాన్ని చవిచూశారంటే... విద్యార్థినిగానే దక్షిణాఫ్రికా జాత్యహంకార ప్రభుత్వాన్ని ధిక్కరించారంటే చిన్న విషయం కాదు. 70వ దశకంలో భర్త గాబీ పిళ్లేతోసహా వందలమందిని అప్పటి పాలకులు ఉగ్రవాద చట్టం కింద నిర్బంధిస్తే వారి విడుదలకు చట్టబద్ధంగా పోరాడి ఆమె తొలి విజయాన్నందుకున్నారు.

నాటల్‌లో 1967లో న్యాయవాద వృత్తిని ప్రారంభించిన తొలి మహిళ ఆమెనే. అటుపై దేశంలోనూ, అంతర్జాతీయంగానూ ఎన్నో ప్రాముఖ్యతగల బ్రైబ్యునళ్లకు సారథ్యంవహించి అసహాయులకు స్వరమై నిలిచారు. మహిళలపై సాగే లైంగిక హింసను నరమేధంగా పరిగణించాలని 1998లో చరిత్రాత్మక తీర్పునిచ్చిన ధర్మాసనంలో ఆమె ఉన్నారు. హేగ్‌లోని అంతర్జాతీయ క్రిమినల్ కోర్టుకు 2003నుంచి అయిదేళ్లపాటు పనిచేశారు. ఆ తర్వాత సమితి మానవహక్కుల హైకమిషనర్‌గా పనిచేశారు.

ఇతర పురస్కారాల మాటెలావున్నా శాంతి బహుమతి ఎంపిక విషయంలో వ్యవహరించే తీరుపై ఎప్పటినుంచో ఫిర్యాదులున్నాయి. 1919లో అప్పటి అమెరికా అధ్యక్షుడు ఉడ్రో విల్సన్‌కూ, 1973లో అప్పటి అమెరికా విదేశాంగమంత్రి హెన్రీ కిసింజర్‌కూ, 2002లో మాజీ అధ్యక్షుడు జిమ్మీ కార్టర్‌కూ, 2009లో ఒబామాకూ బహుమతులెలా ఇచ్చారో ఎవరికీ తెలియదు. నానాజాతి సమితిలో ప్రధాన పాత్ర పోషించినందుకు ఉడ్రో విల్సన్‌కు శాంతి బహుమతినిచ్చినా... అమెరికా ఆ సమితిలో చేరిందిలేదు. చిలీలో సైనిక కుట్రకు ప్రణాళిక రచించి, వియత్నాం యుద్ధాన్ని కొనసాగించి, కాంబోడియాపై బాంబులు కురిపించిన కిసింజర్‌కి ఇచ్చినప్పుడు ప్రపంచం నివ్వెరపోయింది.

అఫ్గానిస్తాన్ ముజాహిదీన్లకు ఆయుధాలిచ్చి ఉగ్రవాదానికి బీజం వేసినవారు కార్టర్. శాంతి పురస్కారం ఇచ్చేనాటికి ఒబామా అధికారంలోకి వచ్చి ఎన్నాళ్లో కాలేదు. కనీసం అందుకైనా ఆయన శాంతి కోసం పాటుపడకపోగా, బుష్ మొదలెట్టిన యుద్ధాలను మరింత తీవ్రం చేశారు. 'అది ఎందుకిచ్చారో నాకే అర్థంకాలేద'ని అనంతరకాలంలో ఒబామా చెప్పారు. 'ఒబామాకున్న అర్హత ఆయన బుష్ కాకపోవటమే' అని చాలామంది అప్పట్లోనే ఎగతాళిగా అన్నారు. పిళ్లేకు పురస్కారం ఇవ్వటం ద్వారా నోబెల్ కమిటీ తన పాత పాపాలను కడిగేసుకుంది. ఆ బహుమతికి అరులుచాచిన ట్రంప్... విజేత నవనీతం రెండు విరుద్ధ భావజాలాలకూ, ఆచరణలకూ ప్రాతినిధ్యం వహిస్తారు. అంతర్జాతీయ వ్యవస్థల్ని ఖాతరుచేయని వ్యక్తి ట్రంప్ అయితే... వాటి వైశిష్ట్యాన్ని చాటినవారు పిళ్లే. అంతర్జాతీయ క్రిమినల్ కోర్టును ట్రంప్ వ్యతిరేకిస్తే... నవనీతం దానికి సారథి. ఇజ

అనంత జనశక్తి
జనం కోసమే మా అక్షరం
బుధవారం 04.11.2026 01

43వ వార్డులో స్వతంత్ర అభ్యర్థి చింతా లక్ష్మీనారాయణ విజయకేతనం.

- బ్యాట్ గుర్తుతో బరిలోకి దిగి ప్రత్యర్థులపై ఆధిక్యం..
- విజయం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్న వార్డు ప్రజలు
- 43వ వార్డులో స్వతంత్ర అభ్యర్థి ఘనవిజయం

ధర్మవరం, నవంబర్ 3, అనంత జనశక్తి న్యూస్:



ధర్మవరం మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లో 43వ వార్డులో స్వతంత్ర అభ్యర్థి చింతా లక్ష్మీనారాయణ విజయం సాధించారు. బ్యాట్ గుర్తుతో స్వతంత్ర అభ్యర్థిగా ఎన్నికల బరిలో నిలిచిన ఆయన ఓటర్ల మద్దతుతో గెలుపొందారు. ఓట్ల లెక్కింపులో విజయం ఖరారు కావడంతో ఆయన అభిమానులు, మద్దతుదారులు హర్షం వ్యక్తం చేశారు. వార్డు ప్రజల ఆదరాభిమానాలతో విజయాన్ని అందుకున్న చింతా లక్ష్మీనారాయణకు స్థానికులు శుభాకాంక్షలు తెలియజేశారు. స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించడం పట్ల వార్డులో ఆనందోత్సాహాలు వ్యక్తమయ్యాయి.

చివరి రోజు విస్తృతంగా సాగిన
పరిటాల సునీత ఎన్నికల ప్రచారం





- జన జాతర మధ్య సాగిన ఎన్నికల ప్రచారం
- వైసీపీకి మరోసారి బుద్ధి చెప్పే సయమం ఆసన్నమైందన్న సునీత
- రెండున్నరేళ్లుగా మేము చేసిన అభివృద్ధి చూడాలన్న ఎమ్మెల్యే సునీత
- కూటమితోనే గ్రామాల ప్రగతి, సంక్షేమం సాధ్యమన్నది మరవద్దన్న సునీత

రాప్తాడు నవంబర్ 03, అనంత జనశక్తి న్యూస్

రాప్తాడు నియోజకవర్గంలో స్థానిక సంస్థల ఎన్నికల ప్రచార పర్వం చివరి రోజు ముమ్మరంగా సాగింది. ఎమ్మెల్యే పరిటాల సునీతకు ప్రజల నుంచి అనూహ్య మైన జనస్పందన, ఘన స్వాగతం లభించడంతో నియోజకవర్గమంతా టీడీపీ విజయం ఖాయమన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. చివరి రోజు ప్రచారంలో భాగంగా రామగిరి, అనంతపురం రూరల్ మండలాల్లో భారీ ర్యాలీలు, రోడ్ షోలు నిర్వహించారు. ప్రచారంలో భాగంగా రామగిరి మండలం, పేరూరు గ్రామంలో నిర్వహించిన భారీ స్థానిక సంస్థల ఎన్నికల ప్రచార ర్యాలీలో ఎమ్మెల్యే సునీత పాల్గొన్నారు. రామగిరి మండల జడ్పీటీసీ అభ్యర్థి బైనేని శిరీష, పేరూరు ఎంపీటీసీ 1 అభ్యర్థి వడ్డే లక్ష్మీ దేవి గార్లను అఖండ మెజారిటీతో గెలిపించాలని సునీత ఓటర్లను అభ్యర్థించారు.

అనంతపురం రూరల్ మండలం, రాచానపల్లి పంచాయతీ పరిధిలోని సిండికేట్ నగర్ లో వెలసిన శ్రీ రామాంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి సిండికేట్ నగర్, కామారుపల్లి, పాపంపేట, ఆకుతోటపల్లి, కందుకూరు గ్రామాల లో ముగింపు ప్రచారం హోరెత్తింది. ఆయా గ్రామా ల్లో కూటమి తరఫున పోటీ చేస్తున్న అనంతపురం రూరల్ మండల జడ్పీటీసీ అభ్యర్థి ఎం.మాధవి, రాచానపల్లి ఎంపీటీసీ 1 అభ్యర్థి రమ్య, రాచానపల్లి ఎంపీటీసీ 2 అభ్యర్థి నల్లమ్మ, కామారుపల్లి ఎంపిటిసి అభ్యర్థి బోయ యల్లప్ప, ఏ.నారాయణపురం ఎంపీటీసీ 4 (జనసేన) అభ్యర్థి రాపా రాధ, ఏ.నారాయణపురం ఎంపీటీసీ 5 (బీజేపీ) అభ్యర్థి చైతన్య కిషోర్, ఏ.నారాయణపురం ఎంపీటీసీ 6 అభ్యర్థి కుమ్మరి రామాంజనేయులు, ఏ.నారాయణపురం ఎంపీటీసీ 7 అభ్యర్థి రావూరి శ్రీలేఖ, ఆకుతోటపల్లి ఎంపీటీసీ 1 అభ్యర్థి ఈడిగ మేకల వెంకట చలపతి, కందుకూరు ఎంపీటీసీ 2 అభ్యర్థి బండారు సుబ్బమ్మ గార్లను అఖండ మెజారిటీతో గెలిపించాలని సునీత పిలుపునిచ్చారు. అలాగే ఇప్పటికే ఏకగ్రీవమైన ఆకుతోటపల్లి ఎంపీటీసీ 2 అభ్యర్థి పోలా వీణాప్రియ, కందుకూరు ఎంపీటీసీ 1 అభ్యర్థి ఓబిలేసుల పరిధిలోని ఓటర్లంతా జడ్పీటీసీ అభ్యర్థి మాధవి కి ఓటు వేసి గెలిపించాలని కోరారు. కామారుపల్లి గ్రామంలో ప్రచారం నిర్వహిస్తున్న సమయంలో కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితులై చిన్నంపల్లి గ్రామానికి చెందిన ముగ్గురు ముఖ్య వైసిపి కార్యకర్తలు వైసిపిని వీడి, ఎమ్మెల్యే సునీత సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఎమ్మెల్యే సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా జరిగిన ముగింపు సభల్లో ఎమ్మెల్యే పరిటాల సునీత మాట్లాడుతూ వైసిపి అడ్డగోలు విమర్శలపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ రెండున్నరేళ్ల కాలంలో రాప్తాడు నియోజకవర్గంలో రికార్డు స్థాయిలో మొత్తం అభివృద్ధి చేసి చూపించామని స్పష్టం చేశారు. రోడ్లు, తాగునీరు, సాగునీరు, విద్యుత్ సబ్‌స్టేషన్లు, ఇండస్ట్రియల్ పార్కులు, విలేజ్ క్లినిక్‌ల నిర్మాణంతో పల్లెల రూపురేఖలు మార్చామని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, తల్లికి వందనం, ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీతో ప్రతి ఇంటికీ సంక్షేమాన్ని చేర్చామని వివరించారు. గత ఐదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని, నియోజకవర్గాన్ని సర్వనాశనం చేసి, రూపాయి అభివృద్ధి చేయని వైసిపి నాయకులు ఈరోజు ఏ మొహం పెట్టుకుని ఓట్లు అడుగుతున్నారని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం చేసిన ఈ రికార్డు స్థాయి ప్రగతిని చూసి ఓర్వలేక వైసిపి నాయకులు అడ్డగోలుగా, అసత్య విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. గత పాలనలో రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన వైసిపికి ఈ స్థానిక ఎన్నికల్లో ఓటు అనే ఆయుధంతో ప్రజలంతా కలిసి మరోసారి గట్టి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.

ఇలాంటి విషయాల్లో కూడా
రాజకీయాలేంటి జగన్ రెడ్డి

- బాలికపై సైకో దాడి చేస్తే.. దానిపై కూడా రాజకీయాలా..?
- రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత ఆగ్రహం
- బాలికకు మెరుగైన వైద్యం, కుటుంబానికి భరోసా ఇస్తున్నాం
- హైకోర్టులో పిల్ వేయించింది నువ్వు కాదా అని నిలదీసిన సునీత

రాప్తాడు నవంబర్ 03, అనంత జనశక్తి న్యూస్



రాప్తాడు జడ్పీ హైస్కూల్లో పదో తరగతి బాలికపై ఉన్మాది జరిపిన దారుణ దాడి ఘటన విషయంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి వ్యవహరించిన తీరు పట్ల రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. బాధిత బాలిక పట్ల కనీస మానవత్వం, సానుభూతి లేకుండా జగన్ కేవలం తన రాజకీయ లబ్ధి కోసమే ప్రాకులాడటం అత్యంత దుర్మార్గమని ఆమె మండిపడ్డారు. ప్రస్తుతం బెంగళూరులోని మణిపాల్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న బాధిత బాలిక క్రమంగా కోలుకుంటోందని సునీత వెల్లడించారు. బాలిక కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు. రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ స్వయంగా బెంగళూరు మణిపాల్ ఆసుపత్రికి వెళ్లి బాధిత బాలికను, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారని తెలిపారు. అక్కడి వైద్యులతో మాట్లాడి బాలికకు అత్యంత మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకున్నారని, కుటుంబానికి పూర్తి భరోసా కల్పించారని ఆమె అన్నారు. దుఃఖంలో ఉన్న బాధిత కుటుంబం వద్దకు వెళ్లి కూడా జగన్ రాజకీయాలు మాట్లాడటం సిగ్గుచేటని సునీత దుయ్యబట్టారు. బాధిత కుటుంబానికి రూ.50 లక్షల పరిహారం అందాలంటే తాను మళ్లీ అధికారంలోకి రావాలంటూ జగన్ వ్యాఖ్యానించడం, ఆయన అధికార ఆరాటాన్ని, దిగజారుడు రాజకీయ నైజాన్ని సూచిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బాలికపై అమానుషంగా దాడి చేసిన నిందితుడు ఉన్మాదిపై పోలీసులు ఆత్మరక్షణ కోసం కాల్పులు జరిపితే.. దానిపై జగన్ తన మనుషులతో కోర్టులో పిల్ వేయించడాన్ని సునీత తీవ్రంగా ఆక్షేపించారు. శాంతిభద్రతలను కాపాడే పోలీసుల చర్యలను అడ్డుకుంటూ, నిందితుడికి మద్దతుగా నిలిచేలా జగన్ వ్యవహరించడం దారుణమన్నారు. ఇలాంటి ఘోరమైన విపత్కర పరిస్థితులు ఎదురైనప్పుడు ఏ నాయకుడు బాధ్యతాయుతంగా వ్యవహరిస్తున్నారో, ఏ నాయకుడు శవరాజకీయాలు చేస్తున్నారో ప్రజలంతా ఒక్కసారి ఆలోచించుకోవాలని ఎమ్మెల్యే పరిటాల సునీత ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

అభివృద్ధికి పట్టం

- రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత
- జగన్ ను ప్రజలు మడతపెట్టేశారు
- అభివృద్ధి, సంక్షేమానికి జైకొట్టారు
- పెనుకొండ మున్సిపాల్టీ మాదిరిగా పరిషత్ ఎన్నికల్లోనూ స్వీప్ చేస్తాం : మంత్రి సవిత
- పెనుకొండలో భారీ ర్యాలీ
- గెలిపొందిన చైర్మన్, కౌన్సెలర్లకు మంత్రి సవిత సత్కారం

పెనుకొండ నవంబర్ 03 అనంత జనశక్తి న్యూస్



పెనుకొండ మున్సిపాల్టీ సహా రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు అభివృద్ధికి పట్టం కడుతూ, కూటమి అభ్యర్థులకు ఓట్లేశారని, చొక్కా మడతపెడతానని బెదిరించిన జగన్ ను మడత పెట్టి పక్కన పడేశారని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. రాబోయే పరిషత్ ఎన్నికల్లోనూ క్లీన్ స్వీప్ చేయబోతున్నామని, కూటమి ప్రభుత్వానికి అండగా నిలిచిన ప్రజలకు ధన్యవాదాలని తెలిపారు. మంగళవారం మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లో పెనుకొండ మున్సిపాల్టీలో కూటమి అభ్యర్థులు అఖండ విజయం సాధించిన అనంతరం భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తనను కలిసిన విలేకరులతో మంత్రి సవిత మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని మున్సిపాల్టీల్లోనూ ప్రజలు అభివృద్ధికి పట్టం కట్టారన్నారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు జై కొట్టారన్నారు. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, ఉచిత గ్యాస్ సిలెండర్లు, ఉచిత బస్సు ప్రయాణం వంటి ఎన్నో సంక్షేమ పథకాలు ప్రజలను ఆకట్టుకున్నాయన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని మున్సిపల్ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు అఖండ మెజార్టీతో గెలిపించారని మంత్రి సవిత తెలిపారు.

పరిషత్ ఎన్నికల్లోనూ స్వీప్ చేస్తాం...

పెనుకొండ మున్సిపాల్టీలో 23 వార్డులతో పాటు చైర్మన్ అభ్యర్థిని ప్రజల సహకారంతో కూటమి ప్రభుత్వం గెలుచుకుందని మంత్రి సవిత తెలిపారు. సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ప్రజలు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నారు. పెనుకొండ ప్రజల ఆదరాభిమానాలతో క్లీన్ స్వీప్ చేశామన్నారు. రాబోయే జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లోనూ మున్సిపల్ ఎన్నికల మాదిరిగా క్లీన్ స్వీప్ చేయబోతున్నట్లు మంత్రి ధీమా వ్యక్తంచేశారు. పెనుకొండ నియోజక వర్గ చరిత్రలోనే గతంలో ఎన్నడూ లేనంత అభివృద్ధి చేపట్టామన్ని, ప్రజలు అభివృద్ధికి వెన్నుదన్నుగా నిలుస్తూ... పరిషత్ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు ఓటేయాలని పిలుపునిచ్చారు.

గెలిచిన అభ్యర్థులకు సత్కారం

మున్సిపల్ ఎన్నికల్లో విజయం సాధించిన చైర్మన్ అభ్యర్థి త్రివేంద్రమూర్తి, వార్డు కౌన్సిలర్లతో ప్రజలకు ధన్యవాదాలు తెలియజేస్తూ మంత్రి సవిత పెనుకొండ పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం చైర్మన్ అభ్యర్థి త్రివేంద్రమూర్తిని, వార్డు కౌన్సిలర్లను అభినందిస్తూ మంత్రి సవిత సత్కరించారు. ఈ కార్యక్రమంలో భారీ సంఖ్యలో కూటమి నాయకులు, కార్యకర్తలు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

మున్సిపల్ ఫలితాల స్ఫూర్తితో ఎంపీటీసీ, జెడ్పీటీసీ, పంచాయతీ పోరులోనూ కూటమిని ఆశీర్వదించండి

- రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్
- ఉండ్రాజవరం మండలంలో వర్షా న్నిసైతం లెక్కచేయకుండా ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ చైర్మన్ బూరుగుపల్లి శేషారావుతో కలిసి మంత్రి దుర్గేష్ భారీ రోడ్ షో
- గత రెండున్నరేళ్లలోనే ఉండ్రాజవరం మండల అభివృద్ధికి రూ. 68.09 కోట్లు వ్యయం చేశామని వెల్లడి.. కూటమి జెడ్పీటీసీ అభ్యర్థి, ఎంపీటీసీ అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి
- స్థానిక సంస్థల్లోనూ గెలిపిస్తే 'ట్రిపుల్ ఇంజిన్' సర్కార్‌తో గ్రామాల సర్వతోముఖాభివృద్ధి సాధ్యమని స్పష్టం

నిడదవోలు నవంబర్ 03 అనంత జనశక్తి న్యూస్

ఇటీవల ముగిసిన నిడదవోలు మున్సిపల్ ఎన్నికల్లో మొత్తం 32 వార్డులకు గానూ 28 వార్డుల్లో కూటమి కూటమి అభ్యర్థులను ఘనవిజయంతో ఆశీర్వదించిన ప్రజలందరికీ రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఇదే విజయపరంపరను నవంబర్ 5న జరగనున్న ఎంపీటీసీ, జెడ్పీటీసీ మరియు రాబోయే పంచాయతీ ఎన్నికల్లోనూ కొనసాగించి, గ్రామీణాభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు. మంగళవారం నిడదవోలు నియోజకవర్గం ఉండ్రాజవరం మండలంలోని పలు గ్రామాల్లో ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ చైర్మన్ బూరుగుపల్లి శేషారావుతో కలిసి మంత్రి దుర్గేష్ వర్షంలో సైతం భారీ రోడ్ షో నిర్వహించారు. ఉండ్రాజవరం, సూర్యారావుపాలెం, పసలపూడి, సత్యవాడ, వడ్లూరు, చివటం, సావరం, పాలంగి,తాడిపర్రు, వెలగదుర్రు, మోర్త, దమ్మెన్ను, వేలివెన్ను తదితర ప్రాంతాల్లో సాగిన ఈ ప్రచారంలో కూటమి జెడ్పీటీసీ అభ్యర్థి వేముల వెంకట మంజూల (జనసేన)తో పాటు ఎంపీటీసీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ..."గత వైకాపా ప్రభుత్వం చేయలేని పనులను కూటమి ప్రభుత్వం బాధ్యతలు చేపట్టిన రెండున్నరేళ్ల స్వల్ప కాలంలోనే పూర్తి చేసి చూపించింది. ఒక్క ఉండ్రాజవరం మండలంలోనే రూ. 69 కోట్ల వ్యయంతో సిసి రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థలను నిర్మించాం. ఒక్క సూర్యారావుపాలెంలోనే రూ. 2.50 కోట్లతో పనులు చేపట్టాం. అదే విధంగా ఉండ్రాజవరంలో రూ.15.40 కోట్లు, పసలపూడిలో రూ. 1.59 కోట్లు, సత్యవాడ లో రూ.2.83 కోట్లు, వడ్లూరు లో రూ. 2.24 కోట్లు, చివటం లో రూ. 6.82 కోట్లు, సావరంలో రూ. 4.05 కోట్లు, పాలంగి లో రూ. 6.50 కోట్లు,తాడిపర్రు లో రూ. 3.89 కోట్లు, వెలగదుర్రు లో రూ. 1.24 కోట్లు, మోర్తలో రూ. 4.90 కోట్లు, దమ్మెన్ను లో రూ. 1.29 కోట్లు, వేలివెన్ను లో రూ. 8.80 కోట్లు గత ప్రభుత్వం జల్ జీవన్ మిషన్ నిధులను పక్కదారి పట్టించి నిర్లక్ష్యం చేసింది. జల్ జీవన్ మిషన్ ద్వారా గోదావరి జలాలను శుద్ధి చేసి ప్రతి ఇంటికి పైప్‌లైన్ ద్వారా స్వచ్ఛమైన తాగునీటిని అందించే బాధ్యత కూటమి ప్రభుత్వానిదే.కూటమి ప్రభుత్వం రోడ్లను అద్భుతంగా నిర్మిస్తే.. గత ప్రభుత్వ పాలనలో కనీసం రోడ్లపై తట్టెడు మట్టి కూడా వేయలేదు. కేంద్ర, రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న కూటమికి స్థానిక సంస్థల బాధ్యతలు కూడా అప్పగిస్తే, 'ట్రిపుల్ ఇంజిన్ సర్కార్'గా అభివృద్ధి, సంక్షేమాలు మరింత వేగంగా ముందుకు సాగుతాయి. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన 'పల్లె పండుగ 1.0', 'పల్లె పండుగ 2.0', మరియు 'శాస్మీ' పథకాల ద్వారా గ్రామీణ రోడ్ల రూపురేఖలను మార్చివేశాం.అన్ని నియోజకవర్గాలకు రూ.7 కోట్లు ఇస్తే డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తో మాట్లాడి నిడదవోలు నియోజకవర్గానికి రూ.28 కోట్ల శాస్మి నిధులు తీసుకొచ్చాను.ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సంయుక్తంగా అందిస్తున్న సూపర్ సిక్స్ హామీల లబ్ధిని ప్రతి పేదవాడికి అందిస్తున్నాం.త్వరలోనే నూతన పింఛన్లు అందించి, ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేస్తాం" అన్నారు.వర్షాన్ని సైతం లెక్కచేయకుండా తరలివచ్చిన ప్రజల ఉత్సాహం కూటమి ప్రభుత్వ పాలనకు నిదర్శనమని, వైసీపీలా మాటల ప్రభుత్వం కాకుండా చేతల ప్రభుత్వంగా ప్రజా సంక్షేమానికి నిరంతరం కట్టుబడి ఉంటామని మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు.

మునిసిపల్ ఎన్నికల కేంద్రాన్ని పరిశీలించిన
జిల్లా ఎన్నికల పరిశీలకుడు



- ధర్మవరం బి.ఎస్.ఆర్ ఉన్నత పాఠశాల నందు మునిసిపల్ ఎన్నికల లెక్కింపు కేంద్రాన్ని పరిశీలించిన శ్రీ సత్యసాయి జిల్లా ఎన్నికల పరిశీలకులు పి.అరుణ్ బాబు.

శ్రీ సత్యసాయి జిల్లా ప్రతినిధి, నవంబర్ 3, అనంత జనశక్తి న్యూస్ :

ధర్మవరంలోని బి.ఎస్.ఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన మునిసిపల్ ఎన్నికల కౌంటింగ్ కేంద్రాన్ని జిల్లా ఎన్నికల పరిశీలకులు (ఎలక్షన్ అబ్జర్వర్) పి.అరుణ్ బాబు మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు.కౌంటింగ్ కేంద్రం వద్ద చేపట్టిన భద్రతా ఏర్పాట్లు, సీసీ కెమెరాల నిఘా, కౌంటింగ్ టేబుళ్ల అమరిక మరియు అభ్యర్థుల/ఏజెంట్ల ప్రాంగణాలను ప్రత్యక్షంగా పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.రాష్ట్ర ఎన్నికల సంఘం నిబంధనల మేరకు ఓట్ల లెక్కింపు ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, నిష్పాక్షికంగా నిర్వహించాలని కౌంటింగ్ సిబ్బందికి ఆదేశించారు.లెక్కింపు కేంద్రంలో పాల్గొనే కౌంటింగ్ ఏజెంట్లు, అధికారులు, మీడియా ప్రతినిధులకు అవసరమైన మౌలిక వసతులు, తాగునీరు, సమాచార కేంద్రం వంటి సౌకర్యాలు కల్పించాలని సంబంధిత అధికారులను సూచించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కౌంటింగ్ కేంద్రం చుట్టూ బలమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు.ఈ తనిఖీ కార్యక్రమంలో ధర్మవరం ఆర్డీఓ రామభూపాల్ రెడ్డి, ధర్మవరం మున్సిపల్ కమిషనర్ వెంకట రమణయ్య,ధర్మవరం తహశీల్దార్ దేవరాజు,మున్సిపల్ అధికారులు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

పినకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని
ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా అధికారి

- రికార్డులను పరిశీలించి వైద్య సిబ్బందితో సమావేశం

అనంతగిరి నవంబర్03:అనంత జనశక్తి న్యూస్

అల్లూరి సీతారామరాజు జిల్లా, అనంతగిరి మండలం పినకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం జిల్లా లెప్రసీ, టీబీ అధికారి డాక్టర్ ఎం. కిరణ్ కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ తనిఖీలో భాగంగా ఆరోగ్య కేంద్రంలో నిర్వహిస్తున్న సంబంధిత రికార్డులను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. వైద్య సేవలకు సంబంధించిన రికార్డుల నిర్వహణ, సంబంధిత విభాగాల పనితీరును పరిశీలించారు. అనంతరం పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ చైతన్య ఆధ్వర్యంలో వైద్య, ఆరోగ్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లెప్రసీ, క్షయ వ్యాధి (టీబీ) సంబంధిత కార్యక్రమాల నిర్వహణ, రికార్డుల నిర్వహణ, వైద్య సేవలకు సంబంధించిన అంశాలపై చర్చించారు.గ్రామీణ, గిరిజన ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తాయి. ఈ నేపథ్యంలో వైద్య సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు అందుబాటులో ఉండేలా ఆరోగ్య సేవలను నిర్వహించడం ప్రాధాన్యత సంతరించుకుంది.ఈ కార్యక్రమంలో జిల్లా టీబీ ల్యాబ్ సూపర్ వైజర్, నగేష్‌దొర,సీనియర్ టీబీ సూపర్ వైజర్,సాధానందం,పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ చైతన్య, లెప్రసీ సూపర్వైజర్ సంజీవ్ పాత్రుడు,పిహెచ్సి వైద్య, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



హైడ్రో పవర్ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా పోరాడే సీపీఎం అభ్యర్థిని గెలిపించాలి



- సీపీఎం జిల్లా కార్యదర్శి పి. అప్పలనర్స పిలుపు

అనంతగిరి, నవంబర్03: అనంత జనశక్తి న్యూస్

అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం వేంగడ పంచాయతీలో సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి పి. అప్పలనర్స ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేంగడ, పైనంపాడు పంచాయతీల పరిధిలో హైడ్రో పవర్ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా సీపీఎం పార్టీ పోరాటం చేసిందని తెలిపారు.ఈ ప్రాంతంలో బడా పెట్టుబడిదారుల ప్రయోజనాల కంటే ప్రజల హక్కులు, సమస్యలకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన పేర్కొన్నారు. గిరిజన ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడుతున్న సీపీఎం పార్టీ ఎంపీటీసీ అభ్యర్థి సాలెపు సింహాచలానికి ఓటు వేసి గెలిపించాలని ప్రజలను కోరారు.ఈ ప్రచార కార్యక్రమంలో వేంగడ సెగ్మెంట్ సీపీఎం ఎంపీటీసీ అభ్యర్థి సాలెపు సింహాచలం, సీపీఎం మండల నాయకుడు సివేరి కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

పటిష్ట చర్యలను చేపట్టండి....



యల్లనూరు, నవంబరు 3, అనంత జనశక్తి న్యూస్;

మండలంలో గురువారం జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా ప్రతిష్ట బందోబస్తును ఏర్పాటు చేయాలంటూ సింగనమల నియోజకవర్గ వైసిపి ఇంచార్జ్ మాజీ మంత్రి డాక్టర్ శైలజనాథ్ మంగళవారం ఎస్సై రామాంజనేయరెడ్డికి స్థానిక పోలీస్ స్టేషన్లో వినతి పత్రాన్ని అందజేశారు. శాంతిభద్రతల పరిరక్షణ, ఓటర్లకు భద్రత కల్పించడం మరియు ఇతర ప్రాంతాల నుండి వచ్చి బెదిరింపులకు పాల్పడుతున్న వ్యక్తులపై తగిన చర్యలు తీసుకోవాలని విన్నవించారు.

మండలానికి సంబంధం లేని ఇతర నియోజకవర్గాల నుంచి కొంతమంది వ్యక్తులు యల్లనూరు మండలానికి వచ్చి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులను భయభ్రాంతులకు గురిచేస్తూ, బెదిరింపులకు పాల్పడటమే కాక

నామినేషన్ల సందర్భంగా రాళ్లు రువ్వడం, బెదిరింపులకు పాల్పడటం వంటి ఘటనలపై సంబంధించి పోలీసు అధికారులకు ఫిర్యాదులు చేసినప్పటికీ, ఆశించిన స్థాయిలో చర్యలు తీసుకోలదన్నారు. మండలంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎంపీటీసీ అభ్యర్థుల ఇళ్ల దగ్గరకు వెళ్లి భయానక వాతావరణం సృష్టించడం, బెదిరింపు చర్యలకు పాల్పడటం, అలాగే మల్లగుండ్ల గ్రామానికి చెందిన వైసిపీ నేతలపై విచక్షణారహితంగా దాడి చేసి, వారి వాహనాలకు కూడా నిప్పుపెట్టడం హేమమైన చర్య అన్నారు.మరోమారు సోమవారం రాత్రి గడ్డంవారిపల్లె గ్రామంలో వాహనాన్ని తగలపెట్టడం అత్యంత ఆందోళనకరమైనదన్నారు. కావున జరగబోయే ఎన్నికలలో గ్రామాలలో ఎటువంటి సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా ఉండేలా ప్రతిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆయన విన్నవించారు.

మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్ కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్



- ధర్మవరం బి ఎస్ ఆర్ ఉన్నత పాఠశాలలోని మునిసిపల్ ఎన్నికల కౌంటింగ్ కేంద్రాన్ని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్.

శ్రీ సత్య సాయి జిల్లా ప్రతినిధి ,నవంబర్, 3, అనంత జనశక్తి న్యూస్:

ధర్మవరం పట్టణంలోని బి ఎస్ ఆర్ ఉన్నత పాఠశాలలో మంగళవారం జరుగుతున్న మునిసిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు (కౌంటింగ్) కేంద్రాన్ని శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ తనిఖీ చేశారు.కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాటు చేసిన భద్రత మరియు లెక్కింపు ప్రక్రియ తీరును ఆయన దగ్గరుండి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... ఓట్ల లెక్కింపు ప్రక్రియ పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా మరియు ఎలాంటి అవకతవకలకు తావులేకుండా సజావుగా సాగేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.కౌంటింగ్ కేంద్రం వద్ద బలమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామని, సీసీటీవీ కెమెరాల ద్వారా ప్రతి చర్యను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని స్పష్టం చేశారు. కౌంటింగ్ సిబ్బంది, మైక్రో అబ్జర్వర్లు తమకు కేటాయించిన విధులను బాధ్యతాయుతంగా నిర్వహించాలని, ఏజెంట్లకు ఎలాంటి సందేహాలు ఉన్నా నిబంధనల ప్రకారం నివృత్తి చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ తనిఖీ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ వెంకట రమణయ్య , ఎన్నికల రిటర్నింగ్ అధికారులు మరియు పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

నీటి సంరక్షణ మన సామాజిక బాధ్యత..

- ఆర్టీసీ డిపో మేనేజర్ సత్యనారాయణ

ధర్మవరం నవంబర్ 3, అనంత జనశక్తి న్యూస్ :

నీటి సంరక్షణ మన సామాజిక బాధ్యత అని డిపో మేనేజర్ తెలిపారు. ఈ సందర్భంగా వారు బ్రిక్స్ సుస్థిర జీవనశైలి వారోత్సవాల్లో భాగంగా ఆర్టిసి ఉద్యోగులచే ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం వారు మాట్లాడుతూ..... నీటిని ఆదా చేయడం, లీకేజీ ట్యాంకులను బాగు చేయడం, పైపుల లీకేజీలని అరికట్టడం, ఇంకుడు గుంతల స్థలాలను గుర్తించి తవ్వడం ఇలాంటి విషయాలను వివరించడం జరిగిందన్నారు. అనంతరం 40 మంది ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు.



విద్యార్థుల నైపుణ్యాభివృద్ధికి ఎస్కేయూ – ఉన్నతి ఫౌండేషన్ మధ్య ఒప్పందం



- మూడేళ్ల పాటు ఉచిత శిక్షణ.. ఉద్యోగ అవకాశాలకు ప్రత్యేక ప్రాధాన్యత

అనంతపురం, నవంబర్ 3: అనంత జనశక్తి న్యూస్

విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించి, మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో శ్రీకృష్ణదేవ రాయ విశ్వవిద్యాలయం (ఎస్కేయూ), బెంగళూరుకు చెందిన ఎస్‌జీబీఎస్ ఉన్నతి ఫౌండేషన్‌తో మూడేళ్ల అవగాహన ఒప్పందం (MoU) కుదుర్చుకుంది. ఈ ఒప్పందంలో భాగంగా 2026-27 విద్యా సంవత్సరంలో చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు ఉచితంగా UNXT ఉపాధి నైపుణ్యాభివృద్ధి శిక్షణ అందించనున్నారు.విశ్వవిద్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఉపకులపతి ప్రొఫెసర్ ఎన్. వి.ఆర్.జ్యోతికుమార్, రిజిస్ట్రార్ డా. ఈ.రమేష్‌బాబు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఉన్నతి ఫౌండేషన్ ప్రతినిధి విజయ్ కుమార్, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ కోఆర్డినేటర్ డా. Ch. కృష్ణుడు తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఉపకులపతి ప్రొఫెసర్ జ్యోతికుమార్ మాట్లాడుతూ, ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు కేవలం విద్యార్హతలకే పరిమితం కాకుండా కమ్యూనికేషన్, నాయకత్వ లక్షణాలు, సాంకేతిక పరిజ్ఞానం, ఆత్మవిశ్వాసం వంటి నైపుణ్యాలను కూడా పెంపొందించుకోవాలని సూచించారు. ఉన్నతి ఫౌండేషన్ అందించే శిక్షణ విద్యార్థులు ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవడానికి ఎంతగానో దోహదపడుతుందని తెలిపారు.రిజిస్ట్రార్ డా. ఈ.రమేష్‌బాబు మాట్లాడుతూ, వ్యక్తిత్వ వికాసం, సమయపాలన, సమస్యల పరిష్కారం, వృత్తిపరమైన నైపుణ్యాలు ఉద్యోగ సాధనలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ఈ శిక్షణతో విద్యార్థులు ఉద్యోగ ఇంటర్వ్యూలను ఆత్మవిశ్వాసంతో ఎదుర్కోగలరని ఆశాభావం వ్యక్తం చేశారు.విద్యార్థులకు అకడమిక్ విద్యతో పాటు పరిశ్రమలు, ఉద్యోగ రంగాలకు అవసరమైన ప్రాయోగిక నైపుణ్యాలను అందించడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని డా. కృష్ణుడు వివరించారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

160 గంటల పాటు ప్రత్యేక శిక్షణ

ఈ శిక్షణలో భాగంగా స్పోకెన్ ఇంగ్లీష్, కమ్యూనికేషన్ స్కిల్స్, టీమ్‌వర్క్, నాయకత్వ లక్షణాలు, సమస్యల పరిష్కారం, రెజ్యూమ్ తయారీ, ఇంటర్వ్యూ నైపుణ్యాలు, పబ్లిక్ స్పీకింగ్, సమయపాలన, ఒత్తిడి నిర్వహణ, సైబర్ సెక్యూరిటీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగం వంటి అంశాల్లో శిక్షణ ఇవ్వనున్నారు. మొత్తం 160 గంటల పాటు కొనసాగే ఈ కార్యక్రమంలో 90 గంటలు తరగతి గది బోధన, 70 గంటలు డిజిటల్ స్వీయ అభ్యసనకు కేటాయించారు. శిక్షణ విజయవంతంగా పూర్తి చేసిన విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలు అందజేయడంతో పాటు, ఉన్నతి ఫౌండేషన్‌కు చెందిన 'Udhyogam' ఉద్యోగ వేదిక ద్వారా ప్లేస్‌మెంట్ సహాయం అందించనున్నారు.ఈ ఒప్పందం 2026 అక్టోబర్ 26 నుంచి 2029 అక్టోబర్ 25 వరకు మూడేళ్ల పాటు అమల్లో ఉంటుంది. విద్యార్థులకు ఈ శిక్షణను పూర్తిగా ఉచితంగా అందించనున్నారు.విద్యార్థులను నైపుణ్యవంతులుగా తీర్చిదిద్ది, ఉద్యోగ రంగానికి సిద్ధం చేయడంతో పాటు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా ఎస్కేయూ చేపట్టిన ఈ కార్యక్రమం కీలక ముందడుగుగా నిలవనుంది.

జగన్ అహంకారానికి, వైసీపీ అరాచక రాజకీయాలకు ప్రజలు మరోసారి బుద్ధి చెప్పారు

- పురపాలక ఎన్నికల్లో అభివృద్ధికి పట్టం కట్టి.. కూటమి పాలనకు ప్రజల జైకొట్టిన ఓటర్లు

- పులివెందులలో సైతం జగన్ కోటను బద్దలు కొట్టి కూటమికి మద్దతు పలికిన ప్రజలు

- ఎన్నికల ఫలితాలతోనైనా జగన్ తన తీరు మార్చుకోవాలి: మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి

మదనపల్లె నవంబర్ 03 అనంత జనశక్తి న్యూస్

మదనపల్లె మున్సిపల్ చైర్మన్‌గా కూటమి బలపరిచిన టీడీపీ అభ్యర్థి గుండ్లపల్లి శ్రీరామ్ కుమార్ (చినబాబు) ఘన విజయం సాధించిన సందర్భంగా మంత్రులు బీసీ జనార్దన్ రెడ్డి, మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి విజయం ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు. మదనపల్లె కౌంటింగ్ కేంద్రంలో శ్రీరామ్ కుమార్‌తో పాటు కూటమి తరపున విజయం సాధించిన కౌన్సిలర్లను అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ...ప్రజల తీర్పు ముందు జగన్ అహంకారం మరోసారి తలవంచక తప్పలేదని వ్యాఖ్యానించారు. పురపాలక ఎన్నికల ఫలితాలు కూటమి ప్రభుత్వంపై ప్రజలకు ఉన్న నమ్మకానికి, అభివృద్ధి పాలనకు లభించిన మద్దతుకు నిదర్శనమన్నారు. మాటలతో మభ్యపెట్టే రాజకీయాలకు, అరాచకాలకు ప్రజలు కాలం చెల్లిందని స్పష్టమైన తీర్పు ఇచ్చారని పేర్కొన్నారు.అధికారంలో ఉన్నప్పుడు ప్రజలను ఇబ్బందులకు గురిచేసి, ప్రతిపక్షంలోకి వచ్చాక ప్రజాస్వామ్యం గురించి మాట్లాడటం వైసీపీ నేతల ద్వంద్వ వైఖరికి నిదర్శనమని విమర్శించారు.బెదిరింపులు, దాడులు, రాజకీయ కక్షలతో ప్రజల మనసులను గెలవలేరని, ప్రజల విశ్వాసాన్ని సంపాదించాలంటే అభివృద్ధి చేసి చూపించాలని హితవు పలికారు. అరాచక రాజకీయాలకు చిరునామాగా మారిన వైసీపీకి ప్రజలు మరోసారి గట్టి గుణపాఠం చెప్పారని అన్నారు.జగన్ సొంత నియోజకవర్గం పులివెందులలో సైతం కూటమికి ప్రజలు మద్దతు పలకడం వైసీపీ రాజకీయ పరిస్థితికి అద్దం పడుతోందని వ్యాఖ్యానించారు. సొంత ప్రాంతంలోనే ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోలేని జగన్, రాష్ట్ర ప్రజలకు ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. ఈ ఫలితాలనైనా ఆత్మపరిశీలన చేసుకోవడానికి ఉపయోగించుకోవాలని, ఇప్పటికైనా తన రాజకీయ ధోరణిని మార్చుకోవాలని సూచించారు.ప్రజలకు కావాల్సింది కక్ష సాధింపు రాజకీయాలు కాదని, రోడ్లు, మౌలిక సదుపాయాలు, ఉపాధి అవకాశాలు, సంక్షేమం, సుపరిపాలన అని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమాన్ని సమన్వయం చేస్తూ ముందుకు సాగుతోందని తెలిపారు. ఆ పాలనకు ప్రజలు ఎన్నికల ద్వారా తమ మద్దతును తెలియజేస్తున్నారని పేర్కొన్నారు.ప్రజాస్వామ్యంలో ప్రజలే తీర్పే అంతిమం, ఆ తీర్పును గౌరవించడం ప్రతిపక్షాల బాధ్యత అని, నిర్మాణాత్మక విమర్శలు చేయాల్సింది పోయి నిరాధార ఆరోపణలు, రాజకీయ విద్వేషాలకు పాల్పడటం సరికాదన్నారు.మున్సిపల్ ఎన్నికల్లో కూటమికి లభించిన ప్రజా మద్దతు రానున్న పరిషత్, సర్పంచ్ ఎన్నికల్లోనూ కొనసాగుతుందని, కూటమి అభ్యర్థులు విజయం సాధిస్తారని మంత్రి ధీమా వ్యక్తం చేశారు. మదనపల్లె చైర్మన్‌గా విజయం సాధించిన గుండ్లపల్లి శ్రీరామ్ కుమార్‌తో పాటు కూటమి తరపున గెలుపొందిన కౌన్సిలర్లకు శుభాకాంక్షలు తెలిపారు.



నెల్లూరు కార్పొరేషన్‌లో కూటమి విజయప్రభంజనం..



- ప్రత్యర్థులు వాషౌట్..

- కూటమి వర్ణశోభితం నెల్లూరు.. గోమతి నగర్ క్యాంపు ఆఫీస్‌లో అంబరాన్నంటిన సంబరాలు

నెల్లూరు నవంబర్ 03 అనంత జనశక్తి న్యూస్

నెల్లూరు కార్పొరేషన్ ఎన్నికల ఫలితాల్లో కూటమి పార్టీ విజయప్రభంజనం సృష్టించింది..ప్రత్యర్థులకు ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా అన్ని డివిజన్లలో విజయం సాధిస్తూ క్లీన్ స్వీప్ దిశగా అడుగులు వేస్తోంది. పార్టీ సాధించిన ఈ ఘన విజయంపై కూటమి శ్రేణుల్లో ఉత్సాహం ఉప్పొంగిపోతోంది.ఈ సందర్భంగా గోమతి నగర్‌లోని క్యాంపు కార్యాలయంలో సంబరాలు అంబరాన్నంటాయి. రాష్ట్ర మంత్రి నారాయణ, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డితో పాటు రాష్ట్ర వక్ఫ్ బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్, నారాయణ కుటుంబ సభ్యులు సతీమణి రమాదేవి, కుమార్తెలు షరిణి, సింధు అందరూ ఒకే వేదికపైకి వచ్చి ఈ అద్భుత విజయాన్ని వేడుకగా జరుపుకున్నారు.క్యాంపు కార్యాలయంలో టీడీపీ విజయోత్సవ పాటలు మార్మోగుతుండగా నేతలు, కుటుంబ సభ్యులు ఎంతో ఉత్సాహంగా డాన్సులు చేస్తూ ఆనందాన్ని పంచుకున్నారు. ఒకరికొకరు మిఠాయిలు తినిపించుకుంటూ, పసుపు వర్ణంలో మునిగిపోయిన వాతావరణంలో ఈ చారిత్రాత్మక విజయాన్ని ఘనంగా ఆస్వాదించారు.

అగాపే లో అన్నదానం



యాడికి, నవంబర్ 3, అనంత జనశక్తి న్యూస్ :

మండల కేంద్రంలోని కమలపాడు రోడ్డు పక్కన ఉన్న అగాపే ఆశ్రమంలోని వృద్దలకు మంగళవారం అన్నదాన కార్యక్రమం ను నిర్వహించారని ఆశ్రమ ఫౌండర్ బత్తుల ప్రసాద్ తెలిపారు. మూలం చెన్నప్ప జ్ఞాపకార్థం భార్య గౌరమ్మ , కొడుకు భాస్కర్,మనవడు చంద్ర లు ఆశ్రమంలోని వృద్ధులకు అన్నదాన కార్యక్రమంను నిర్వహించారు. మూలం చెన్నప్ప ఆత్మకు శాంతి కలగాలని, కుటుంబం సభ్యులు ఆయురారోగ్యాలతో, నిండు నూరేళ్ళ ,సుఖశాంతులతో జీవించాలని వృద్ధులు, ఆశ్రమం ఫౌండేషర్ బత్తుల ప్రసాద్ లు దీవించారు.ఈ కార్యక్రమంలో కుటుంబం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి చేస్తాం.

పుట్టపర్తి రూరల్ నవంబర్ 03 అనంత జన శక్తి న్యూస్.

పుట్టపర్తి మున్సిపాలిటీ అభివృద్ధికి అన్ని విధాల కృషి చేస్తామని జనసేన నాయకులు, మేకల ఈశ్వర్,పత్తి చంద్రశేఖర్, గంగాధర్, మార్కెట్ యార్డ్ చైర్మన్ పూల శివప్రసాద్, పేర్కొన్నారు. జనసేన పుట్టపర్తి చైర్మన్ అభ్యర్థి ఈశ్వర్, గెలుపొందిన అనంతరం వారు విలేకరులతో మాట్లాడు, చైర్మన్ అభ్యర్థిగా జనసేనకు అవకాశం కల్పించడం, ఒక శుభ పరిణామం అయితే, జనసేన పార్టీ, కూటమి నాయకులను కలుపుకొని, ఎన్నికల బరిలో దిగి, తొలిసారి విజయం సాధించడం ఎంతో శుభ పరిణామం మని తెలిపారు. అంతేకాక తొమ్మిదో వార్డు కౌన్సిలర్, జనసేన అభ్యర్థి సుకన్య సైతం, గెలవడం జనసేన పార్టీ పుట్టపర్తిలో పట్టుకు, ఇదొక నిదర్శనమని తెలిపారు.
పుట్టపర్తి మున్సిపాలిటీ జనసేన చైర్మన్ అభ్యర్థి మేకల ఈశ్వర్, 9వ వార్డు సభ్యులు, సుకన్య గెలుపునకు కృషిచేసిన, జనసేన, నాయకులకు, కార్యకర్తలకు, పేరుపేరునా నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చైర్మన్ మేకల ఈశ్వర్ మాట్లాడుతూ, ప్రజలకు అందుబాటులో ఉంటూ, వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి, పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు, గత వైసిపి పాలనలో, పుట్టపర్తి మున్సిపాలిటీ అభివృద్ధికి నోచుకోలేదని, పుట్టపర్తి మున్సిపాలిటీలో ప్రజల సమస్యలను తొలిత దృష్టిలో ఉంచుకొని, పరిష్కరిస్తామని తెలిపారు. తమ గెలుపుకు సహకరించిన, కూటమి నాయకులకు ఆయన హర్థిక శుభాకాంక్షలు తెలిపారు.



పోలింగ్ ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రజలు సహకరించాలి

- ఎస్సై చెన్నయ్య

తలుపుల నవంబర్03 (అనంత జనశక్తి న్యూస్):-

ఈనెల 5 న జరగనున్న స్థానిక జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నేపథ్యంలో తలుపుల మండల ప్రజలకు ఎస్సై చెన్నయ్య ప్రజలకు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఎన్నికల విధుల్లో భాగంగా ఇప్పటికే మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాలను పరిశీలించినట్లు ఆయన తెలిపారు. పోలింగ్ ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రజలు, అభ్యర్థులు ప్రజలు పోలీసులకు పూర్తిస్థాయిలో సహకరించాలని కోరారు.ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావివ్వకుండా ప్రతి ఒక్కరూ సంయమనం పాటించాలని సూచించారు.పోలింగ్ కేంద్రాల వద్ద జనసమూహాలు గుమిగూడరాదని, పోలింగ్ కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్లు తీసుకెళ్లకూడదని స్పష్టం చేశారు.ఎన్నికల సందర్భంగా 144 సెక్షన్‌తో పాటు పోలీస్ యాక్ట్ 30 అమల్లో ఉంటుందని తెలిపారు.నిబంధనలు ఉల్లంఘించి శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన
చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.
మండలంలో ఎలాంటి అల్లర్లు, గొడవలకు పాల్పడకుండా ప్రజలు సహకరించాలని, ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును స్వేచ్ఛగా,
నిర్భయంగా వినియోగించుకోవాలన్నారు. పోలీస్ శాఖకు మండల ప్రజలు సహకరించాలని ఆయన కోరారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్ఐ తెలియజేశారు.



సీఐ నాగేంద్రను ఎన్నికల విధుల నుంచి తప్పించాలి

-మా కుటుంబానికి పోలీసు రక్షణ కల్పించాలి

-వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ అభ్యర్థి ఒబులేశ్వరి

తలుపుల నవంబర్03

(అనంత జనశక్తి న్యూస్):-

మండలంలో ఎన్నికలు నిష్పక్షపాతంగా, ప్రశాంతంగా జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని, సీఐ నాగేంద్రను ఎన్నికల విధుల నుంచి తప్పించాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ 3వ వార్డు ఎంపీటీసీ అభ్యర్థి ఒబులేశ్వరి డిమాండ్ చేశారు.తాను, తన భర్త డీకే బాబు గత రెండేళ్లుగా రాజకీయ వేధింపులు, బెదిరింపులు ఎదుర్కొంటున్నామని ఆమె ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ తరపున ఎన్నికల్లో పోటీ చేస్తున్నామనే కారణంతో సీఐ నాగేంద్ర తమను ప్రచారం చేయకుండా అడ్డుకుంటూ, తప్పుడు కేసులు పెడతానని, అవసరమైతే ఎన్‌కౌంటర్ చేస్తానని బెదిరిస్తున్నారని పేర్కొన్నారు.తన భర్త డీకే బాబు ప్రస్తుతం ప్రాణభయంతో తలుపుల మండలానికి రాలేక బెంగళూరుకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలోనూ తన భర్తపై తప్పుడు కేసులు నమోదు చేసి జైలుకు పంపించారని



ఆరోపించారు.తాను వైస్ ఎంపీపీగా, తన భర్త మండల కన్వీనర్‌గా, వైస్ సర్పంచ్‌గా ప్రజలకు సేవలందిస్తున్నామని తెలిపారు. పోలీసు అధికారులు అన్ని రాజకీయ పార్టీల పట్ల సమానంగా వ్యవహరించాలని, రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాలని కోరారు.ఈ విషయంపై జిల్లా ఎస్పీ, జిల్లా కలెక్టర్, రాష్ట్ర డీజీపీ, రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌తో పాటు హైకోర్టు, సుప్రీంకోర్టులకు ఈమెయిల్ ద్వారా ఫిర్యాదులు పంపినట్లు వెల్లడించారు.తన ఫిర్యాదులపై తక్షణమే నిష్పక్షపాత విచారణ జరిపించాలని,విచారణ పూర్తయ్యే వరకు సీఐ నాగేంద్రను తలుపుల మండల ఎన్నికల విధుల నుంచి తప్పించాలని అధికారులను కోరారు.

అలాగే తనకు, తన భర్తకు, కుటుంబ సభ్యులకు పోలీసు రక్షణ కల్పించి, ఎలాంటి బెదిరింపులు లేకుండా ఎన్నికల ప్రచారం చేసుకునే అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.ప్రజాస్వామ్యంలో ఎన్నికల్లో పోటీ చేసే హక్కు ప్రతి ఒక్కరికీ ఉందని, ఎవరు గెలవాలనేది ప్రజలే నిర్ణయించాలని ఒబులేశ్వరి పేర్కొన్నారు. తమకు అధికారం కంటే న్యాయం, పదవుల కంటే కుటుంబ భద్రత, ప్రజాస్వామ్య హక్కులకు గౌరవం ముఖ్యమని ఆమె స్పష్టం చేశారు.

భయం వీడి బడిబాట పట్టండి!

- విద్యార్థులకు, తల్లిదండ్రులకు భరోసా కల్పిస్తున్న ప్రత్యేక బృందాలు

- ఇళ్లకు వెళ్లి కౌన్సెలింగ్.. తిరిగి పాఠశాలలకు వచ్చేలా అవగాహన

రాప్తాడు నవంబర్ 3 అనంత జనశక్తి న్యూస్

రాప్తాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థిని గోపికపై జరిగిన దాడి ఘటన విద్యార్థులు, తల్లిదండ్రుల్లో తీవ్ర భయాందోళనలకు కారణమైంది. ఈ ఘటన అనంతరం పలువురు విద్యార్థులు పాఠశాలలకు వెళ్లేందుకు భయపడుతుండటంతో వారిలో ఆందోళన తొలగించి, తిరిగి బడిబాట పట్టించే దిశగా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది.



ఇందులో భాగంగా రాప్తాడు మండల వ్యాప్తంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు ధైర్యం, భరోసా కల్పించేందుకు 20 మంది కెరీర్ అండ్ విలేజ్ మెంటల్ హెల్త్ కౌన్సిలర్లను ప్రభుత్వం నియమించింది. వీరిని ప్రత్యేక బృందాలుగా ఏర్పాటు చేసి గ్రామాల్లోని విద్యార్థుల ఇళ్లకు నేరుగా వెళ్లి కౌన్సెలింగ్ నిర్వహించే బాధ్యతలు అప్పగించింది.

ఈ క్రమంలో కౌన్సిలర్ల బృందాలు రాప్తాడు, అయ్యవారిపల్లి తదితర గ్రామాల్లో పర్యటిస్తూ పాఠశాలలకు వెళ్లేందుకు భయపడుతున్న విద్యార్థులతో మాట్లాడుతున్నాయి. వారి తల్లిదండ్రులకు కూడా భరోసా కల్పిస్తూ పిల్లల భద్రతకు సంబంధించి ప్రభుత్వం చేపడుతున్న చర్యలను వివరిస్తున్నాయి. పాఠశాలల్లో భద్రతా ఏర్పాట్లు, పగలు, రాత్రి తీసుకోనున్న జాగ్రత్తలు, విద్యార్థినుల రక్షణకు అనుసరించనున్న విధివిధానాలపై అవగాహన కల్పిస్తున్నాయి.

చదువుకునే వయసులో భయాందోళనలకు లోనుకాకుండా విద్యార్థులు ధైర్యంగా పాఠశాలలకు హాజరుకావాలని, తమ భవిష్యత్తుపై దృష్టి సారించాలని కౌన్సిలర్లు సూచిస్తున్నారు. పిల్లల మనసులో ఉన్న భయాలను తల్లిదండ్రులు అర్థం చేసుకొని వారికి అండగా నిలవాలని, ఆత్మవిశ్వాసం కల్పించాలని చెబుతున్నారు.

ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసే దిశగా కెరీర్ అండ్ మెంటల్ హెల్త్ కౌన్సిలర్లు నాగరాజు, ఓబులయ్య, జి.మణి తదితరులు పాల్గొని గ్రామాల్లో విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు.

40వ వార్డులో కొత్తపేట ఆది విజయదుందుభి..

-544 ఓట్ల మెజార్టీతో ఘనవిజయం

-వైసీపీ అభ్యర్థి చందమూరి నారాయణరెడ్డిపై పైచేయి.

-విజయాన్ని అందించిన ఓటర్లకు కృతజ్ఞతలు తెలిపిన కొత్తపేట ఆది

-వార్డు అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని హామీ

ధర్మవరం, నవంబర్ 3, అనంత జనశక్తి న్యూస్ :

ధర్మవరం మున్సిపల్ ఎన్నికల్లో 40వ వార్డు లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి కొత్తపేట ఆది ఘనవిజయం సాధించారు. వైసిపి అభ్యర్థి చందమూరి నారాయణరెడ్డి పై 544 ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు. ఎన్నికల బరిలో తనకు ఎదురైన పోటీని అధిగమించి ప్రజల మద్దతుతో విజయాన్ని సొంతం చేసుకున్నారు. ఈ సందర్భంగా కొత్తపేట ఆది మాట్లాడుతూ.... తనపై నమ్మకంతో ఓటు వేసి గెలిపించిన 40వ వార్డు ప్రజలందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలు తనకు అప్పగించిన బాధ్యతను ఎంతో నిబద్ధతతో నిర్వహిస్తానని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీకి కట్టుబడి ఉంటానని, వార్డులో నెలకొన్న సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు నిరంతరం అందుబాటులో ఉంటానని భరోసా



ఇచ్చాడు. మౌలిక వసతుల కల్పనతో పాటు వార్డు సమగ్ర అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని స్పష్టం చేశారు. తన విజయాన్ని ప్రజలకు అంకితం చేస్తానని ఆయన పేర్కొన్నారు.

కూటమి ప్రభుత్వ అభివృద్ధికి ప్రజల తీర్పే నిదర్శనం

- ఎమ్మెల్యే అమిలినేని

- మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి బుట్టా లక్ష్మికి 11,576 ఓట్ల మెజారిటీతో ఘన విజయం

- 28 మంది కూటమి కౌన్సిలర్ల విజయంతో శ్రేణుల్లో నూతనోత్సాహం

కళ్యాణదుర్గం నవంబర్ 03, అనంత జనశక్తి న్యూస్

మున్సిపల్ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు ప్రజలు అందించిన అపూర్వ విజయమే కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు నిదర్శనమని కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు పేర్కొన్నారు. మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి బుట్టా లక్ష్మి 11,576 ఓట్లతో ఘన విజయం సాధించడంతో పాటు, 28 మంది కూటమి కౌన్సిలర్లు విజయం సాధించడం ప్రజల విశ్వాసానికి ప్రతీక అని అన్నారు.ఎలాంటి గొడవలు, అల్లర్లు చోటుచేసుకోకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కూటమి



ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలు ఆదరిస్తున్నారని, రానున్న రోజుల్లో ప్రతి ఇంటికీ తాగునీరు అందించడమే లక్ష్యంగా పనిచేస్తామని తెలిపారు.ఈ ప్రాంతం నుంచి వైఎస్సార్‌సీపీని పూర్తిగా తరిమికొడతామని వ్యాఖ్యానించారు. రాబోయే జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో ఐదు జడ్పీటీసీ స్థానాలతో పాటు 64 ఎంపీటీసీ స్థానాల్లోనూ కూటమి అభ్యర్థులు ఘన విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు.కంబదూరు నుంచి రెబల్ జడ్పీటీసీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న వేముల శారద విజయం సాధించినా, జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌తో కలిసి ఆ విజయాన్ని జనసేన ఖాతాలోనే వేస్తామని పేర్కొన్నారు. టెంకాయ గుర్తుపై పోటీ చేస్తున్న వేముల శారదను గెలిపించి, ఆ విజయాన్ని పవన్ కళ్యాణ్‌కు కానుకగా అందిస్తామని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు డిపాజిట్లు కూడా దక్కకుండా ప్రజలే తగిన తీర్పు ఇస్తారని ఎమ్మెల్యే అమిలినేని అన్నారు.ఎన్నికల సమయంలో మీడియా మిత్రులు ఎంతో కష్టపడి పనిచేశారని ప్రశంసించారు. మీడియా ప్రతినిధుల సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లి, వారి కుటుంబాలకు న్యాయం జరిగేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

ప్రమాదాల్లో గాయపడిన టీడీపీ నాయకులకు మంత్రి పయ్యావుల కేశవ్ పరామర్శ

అనంతపురం, నవంబర్ 03: అనంత జనశక్తి న్యూస్

ప్రమాదాల్లో గాయపడి అనంతపురంలోని పావని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న టీడీపీ నాయకులు కురుబ మద్రిస్వామి, కురుబ చంద్రలను రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పరామర్శించారు.కూడేరు మండలం జయపురం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు కురుబ మద్రిస్వామి స్థానిక ఎన్నికల ప్రచార కార్యక్రమాల్లో పాల్గొంటున్న సమయంలో ప్రమాదవశాత్తు జారిపడటంతో ఫ్రాక్చర్ అయింది. దీంతో ఆయన పావని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.అదేవిధంగా బెలుగుప్ప మండలం తగ్గుపర్తి గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు కురుబ చంద్ర బైక్ ప్రమాదంలో గాయపడి అదే ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.ఈ విషయం తెలుసుకున్న మంత్రి పయ్యావుల కేశవ్ ఆసుపత్రికి వెళ్లి ఇద్దరినీ పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు.



అభివృద్ధి బాటలో కూటమి ప్రభుత్వం.. టీడీపీ వైపు వైకాపా శ్రేణుల చూపు!

- నందిగామ మండలం కల్లాడ పంచాయతీ నుంచి 15 కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరిక

- నిమ్మాడ క్యాంపు కార్యాలయంలో పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించిన మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

కోటబొమ్మాళి నవంబరు 3 అనంత జనశక్తి న్యూస్

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి పెద్దపీట వేస్తూ, పల్లెల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యమిస్తుండటంతో పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు తెలుగుదేశం పార్టీ వైపు అడుగులు వేస్తున్నారు. ఈ క్రమంలో నందిగాం మండలం కల్లాడ పంచాయతీకి చెందిన వైకాపా నాయకులు, మహిళా కార్యకర్తలు సహా 15 కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరాయి.ఈ మేరకు నిమ్మాడ క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సమక్షంలో వారంతా తెలుగుదేశం పార్టీలో చేరారు. మంత్రి అచ్చెన్నాయుడు వారికి పసుపు కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన నాయకులు, మహిళా కార్యకర్తలు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి గ్రామాల రూపురేఖలు మార్చేలా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతోందని కొనియాడారు. పల్లెల్లో రహదారుల నిర్మాణం, తాగునీటి వసతి, ఇతర మౌలిక సదుపాయాల కల్పనలో ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని పేర్కొన్నారు. ప్రజా సంక్షేమం, గ్రామీణాభివృద్ధికి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యాన్ని గుర్తించి తెలుగుదేశం పార్టీలో చేరాలని నిర్ణయించుకున్నట్లు వెల్లడించారు. పసుపురెడ్డి శ్యామ్‌సుందరరావు, లతమ్మ, తారమ్మ, సుభద్ర, త్రినాధరావు, గౌతమి, భారతి, లక్ష్మి, ఉషారాణి, సుబ్బారావు, చంద్రమ్మ, కనకమ్మ, అరుణకుమారి, భాగ్యలక్ష్మి, భాగవతి తదితరులు పాల్గొన్నారు.



దోమల తెరలు అందజేత....



యల్లనూరు, నవంబర్ 3, అనంత జనశక్తి న్యూస్;

మండలంలోని ఆదర్శ పాఠశాలలో హాస్టల్లో విద్యను అభ్యసిస్తున్న 90 మంది విద్యార్థినిలకు మంగళవారం వైద్యాధికారి లోకేష్ బాబు దోమల తెరలను అందజేశారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో దోమలు అధికం అవడం వలన విద్యార్థులు రోగాల బారిన పడకుండా ఉండేందుకు ముందస్తు చర్యల్లో భాగంగా వీటిని పంపిణీ చేసినట్లు వైద్యాచారి తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన ఎన్నికల ప్రచారం.. రేపే పోలింగ్

అగళి నవంబర్ 03, అనంత జనశక్తి న్యూస్

జడ్పీటీసీ ఎంపిటిసి స్థానాలకు సంబంధించి నిర్వహించిన హోరాహోరీ ప్రచారం మంగళవారం సాయంత్రం తో ముగిసింది. ఎన్నికల నిబంధనల ప్రకారం ముందుగానే మైకులు, ర్యాలీలు, బహిరంగ సభలను నిలిపివేశారు. నవంబర్ 5వ తేదీ ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరగనుండగా, నవంబర్ 7న ఉదయం 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభం కానుంది. ప్రచారం ముగియడంతో అందరి దృష్టి ఇప్పుడు పోలింగ్ మరియు రాబోయే ఫలితాలపైనే కేంద్రీకృతమైంది.

పాదపు పగుళ్లు పై జాగ్రత్తలు పాటించాలి

- హోమియో వైద్యనిపుణురాలు సల్లా పద్మావతి

యాడికి, నవంబర్ 3, అనంత జనశక్తి న్యూస్ :



ప్రతి ఒక్కరు పాదపు పగుళ్లు పై జాగ్రత్తలు పాటించాలని హోమియో వైద్యనిపుణురాలు సల్లా పద్మావతి తెలిపారు. మండల కేంద్రంలో ఉన్న మార్కండేయ స్వామి దేవాలయం కాంప్లెక్స్ లో ఉన్న పద్మావతి డెంటల్, హోమియో కేర్ లో మంగళవారం హోమియో వైద్యనిపుణురాలు సల్లా పద్మావతి మాట్లాడుతూ పాదపు మడమ చర్మం ఎండిపోవడం, గట్టిగా మారి చీలిపోవడం వంటి కొన్ని సమయాల్లో వస్తుంటాయని,ఆ సమయంలో పాదపు పగుళ్ల పై శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు. చర్మం పొడిబారడం ,చెప్పులు లేకుండా నడవడం,అధిక బరువు, డయాబెటిస్, విటమిన్ లోపం పాదపు పగుళ్లు ఏర్పడుతాయని తెలిపారు.గోరువెచ్చని నీటిలో 10 నిమిషాలు పాదాలను నానబెట్టండి, కొబ్బరి నూనె రాత్రి పడుకునే ముందు రాయాలని,కలబంద జెల్ రాయండి చిట్కాలతో నయం చేసుకోవచ్చు అని తెలిపారు.సరైన పాద సంరక్షణతో పాటు, మీ ఆరోగ్య పరిస్థితికి అనుగుణంగా హోమియోపతి వైద్యం ద్వారా వ్యక్తిగత వైద్య సూచనలు సలహాలు పొందాలని తెలిపారు. త్వరగా నయం అవ్వాలంటే ప్రతిరోజూ మాయిశ్చరైజర్ రాయాలని,చెప్పులు వాడాలని,చెప్పులు లేకుండా నడవరాదని తెలిపారు. డయాబెటిస్ ఉన్నవారు స్వయంగా పాదాలను నానబెట్టడం లేదా గట్టిగా రుద్దడం చేయకూడదని తెలిపారు. డయాబెటిస్ ఉంటే నియంత్రణలో ఉంచాలన్నారు. పగుళ్లు లోతుగా ఉండటం, రక్తస్రావం, వాపు లేదా ఇన్ఫెక్షన్ ఉంటే వైద్యుడిని సంప్రదించాలని తెలిపారు .

జగనన్న కాలనీలో వీధిలైట్లు మరమ్మత్తు

- ఈఓ కు కృతజ్ఞతలు తెలిపిన జనసేన ప్రధాన కార్యదర్శి పప్పు వెంకటేష్

యాడికి, నవంబర్ 3, అనంత జనశక్తి న్యూస్ :



మండల కేంద్రంలోని పిన్నెపల్లి రోడ్డు పక్కన ఉన్న జగనన్న కాలనీలో మంగళవారం వీధి లైట్లు మరమ్మత్తం చేశారు. జగనన్న కాలనీలో కొన్ని వీధి లైట్లు వెలగడం లేదని ఈ ఓ గీతా కు జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి పప్పు వెంకటేష్ తెలిపారు.దీంతో తక్షణమే పంచాయతీ సెక్రెటరీ గీతా చొరవ తీసుకొని సిబ్బందిని కాలనీకి పంపించి వీధి లైట్లు మరమ్మత్త చేశారు.జనసేన పార్టీ కోడి సునీల్ కుమార్ సూచనల మేరకు జనసేన పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పప్పు వెంకటేష్ దగ్గరుండి స్ట్రీట్ లైట్స్ వేయించారు. పంచాయతీ సెక్రెటరీ గీతా కు జనసేన ప్రధాన కార్యదర్శి పప్పు వెంకటేష్ కృతజ్ఞతలు తెలిపారు.

స్పటిక లింగం ను దర్శించిన చవ్వా గోపాల్ రెడ్డి

యాడికి, నవంబర్ 3, అనంత జనశక్తి న్యూస్ :

మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల మైదానంలో పక్కన నాగులకట్ట వద్ద ఉన్న భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి దేవాలయంలో మంగళవారం స్పటిక లింగం ను క్లాస్ వన్ కాంట్రాక్టర్ చవ్వా గోపాల్ రెడ్డి దర్శించుకోనున్నారు. ముందుగా క్లాస్ వన్ కాంట్రాక్టర్ చవ్వా గోపాల్ రెడ్డి కి ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు.ప్రత్యేక పూజలు నిర్వహించారు.ప్రజలందరూ సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో ఉండాలని భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి ని క్లాస్ వన్ కాంట్రాక్టర్ చవ్వా గోపాల్ రెడ్డి వేడుకోన్నారు. అనంతరం తీర్థ ప్రసాదాలను అందజేశారు.చవ్వా గోపాల్ రెడ్డి కి శాలువ కప్పి, పూలమాలలతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, తెదేపా నాయకులు,కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



నాడు ఈవీఎంలను తప్పుబట్టావు.. నేడు బ్యాలెట్‌నూ తప్పుబడతావా జగన్?

- కూటమి 2024 ఎన్నికల్లో 93% విజయం, నేడు స్థానిక ఎన్నికల్లో 100% విజయాన్ని సాధించాం
- 2019లో 151 సీట్లు గెలిచినప్పుడు లేని సందేహాలు.. 2024లో కూటమి గెలవగానే ఎందుకొచ్చాయి?
- ఎన్నికలను హైజాక్ చేశారంటున్న జగన్.. నామినేషన్ల నుంచి కౌంటింగ్ వరకు చేసిన విమర్శలకు ఆధారాలు చూపాలి!
- పులివెందుల ఫలితాలపై ఏం చెబుతావు జగన్?
- చొక్కా మడతపెట్టి ఇచ్చే సంకేతాలేంటి?.. మాజీ ముఖ్యమంత్రి హోదాలో బాధ్యతాయుతంగా వ్యవహరించవా?
- మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

అమరావతి, నవంబర్ 03:అనంత జనశక్తి ప్రతినిధి



నాడు ఈవీఎంలపై నిందలు వేసి బ్యాలెట్ విధానాన్ని కోరిన జగన్ మోహన్ రెడ్డి, నేడు బ్యాలెట్ పద్ధతిలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ కూటమి విజయం సాధించడంతో ఎన్నికల నిర్వహణను తప్పుబట్టడం విడ్డూరంగా ఉందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మండిపడ్డారు. 2024 ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం 93% విజయాన్ని నమోదు చేస్తే, నేడు స్థానిక సంస్థల ఎన్నికల్లో 100% విజయం సాధించడం జగన్‌కు మింగుడుపడటం లేదని, అందుకనే సిగ్గులేకుండా కూటమి ప్రభుత్వంపై దిగజారుడు విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు.2019లో వైసీపీ 151 అసెంబ్లీ స్థానాలు గెలిచినప్పుడు ఈవీఎంలపై రాని అనుమానాలు, 2024లో కూటమి 164 స్థానాలు గెలవగానే ఎందుకు వచ్చాయని నిలదీశారు. ఈవీఎంలపై సందేహాలు వ్యక్తం చేసిన జగన్, ఇప్పుడు బ్యాలెట్ ఎన్నికల్లోనూ అక్రమాలు జరిగాయంటూ ఎన్నికల సంఘం, పోలీసులపై నిందలు వేస్తున్నారని విమర్శించారు. ఓటమికి కారణాలు విశ్లేషించుకోకుండా ఎన్నికల వ్యవస్థలను తప్పుబట్టడం మానుకోవాలని హితవు పలికారు. నామినేషన్ల నుంచి కౌంటింగ్ వరకు ఎన్నికలను హైజాక్ చేశారంటున్న జగన్, తన వ్యాఖ్యలకు ఆధారాలు బయటపెట్టాలని మంత్రి సవాల్ చేశారు. నామినేషన్లను ఎవరు అడ్డుకున్నారు? పోలింగ్ ఏజెంట్లను ఎక్కడ బయటకు పంపించారు? ఓటింగ్ శాతాన్ని ఏ కేంద్రంలో మార్చారు? కౌంటింగ్‌లో ఎక్కడ అక్రమాలు జరిగాయి? అంటూ సూటిగా ప్రశ్నించారు. నిర్దిష్ట ఆధారాలుంటే ఎన్నికల సంఘానికి సమర్పించి విచారణ కోరాలని, ఆధారాలు లేకుండా వ్యవస్థలపై విమర్శలు చేయడం సరికాదన్నారు. జగన్ సొంత నియోజకవర్గం పులివెందులలోనూ కూటమి విజయం సాధించడంపై మంత్రి స్పందిస్తూ, ఈ ఫలితాలు జగన్ ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అవసరాన్ని తెలియజేస్తున్నాయని వ్యాఖ్యానించారు. మాజీ ముఖ్యమంత్రిగా ఉండి చొక్కా మడతపెట్టి 'ఎవరొస్తారో రండి' అంటూ మాట్లాడటం ద్వారా ప్రజలకు ఏం సంకేతాలు ఇచ్చారని ప్రశ్నించారు. రాజకీయాల్లో రౌడీయిజం, బెదిరింపులు, ప్రత్యర్థులపై దాడులకు తావులేదని, అధికారులు, పోలీసులు, ఎన్నికల సంఘాన్ని గౌరవించడం ప్రతి నాయకుడి బాధ్యతని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమర్థ నాయకత్వం, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రజాసేవ, ప్రధాని నరేంద్ర మోదీ సహకారంతో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజల్లో ఆదరణ లభిస్తోందని మంత్రి పేర్కొన్నారు. సంక్షేమ పథకాల అమలు, ప్రజాసమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. జగన్ ఇకనైనా తన రాజకీయ వైఖరి మార్చుకుని ప్రజల సంక్షేమంపై దృష్టి సారించాలని సూచించారు. ప్రజల విశ్వాసం పొందాలంటే బెదిరింపులు కాదని,బాధ్యతాయుతమైన రాజకీయాలు అవసరమని స్పష్టం చేశారు.

ధర్మవరంలో కూటమి ప్రభంజనం.. చైర్మన్ పీఠంపై పరిసే సుధాకర్!



- పరిటాల శ్రీరామ్ నాయకత్వానికి ప్రజా మద్దతు....
- 21,124 ఓట్ల భారీ మెజారిటీతో కూటమి అభ్యర్థి చారిత్రాత్మక విజయం....
- ఆర్డీఓ నుంచి అధికారిక ఎన్నికల ధ్రువీకరణ పత్రం స్వీకరణ...

ధర్మవరం నవంబర్ 3 అనంత జనశక్తి న్యూస్ :

ధర్మవరం మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లో కూటమి ఘనవిజయం సాధించి తన రాజకీయ ఆధిపత్యాన్ని చాటుకుంది. కూటమి చైర్మన్ అభ్యర్థి పరిసే సుధాకర్ ఏకంగా 21,124 ఓట్ల భారీ మెజారిటీతో అఖండ విజయాన్ని నమోదు చేసి మున్సిపల్ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. ఎన్నికల ప్రచారం నుంచి ఫలితాల వెల్లడి వరకు కూటమి శ్రేణుల్లో కనిపించిన ఉత్సాహం, నాయకుల సమన్వయం, కార్యకర్తల క్షేత్రస్థాయి కృషి ఈ విజయానికి మరింత బలాన్నిచ్చాయి. ముఖ్యంగా ఎమ్మెల్యే పరిటాల శ్రీరామ్ నాయకత్వం, రాజకీయ వ్యూహాలు, పార్టీ శ్రేణులకు అందించిన దిశానిర్దేశం కూటమి విజయ ప్రస్థానంలో కీలకంగా నిలిచాయి. ఆయన నాయకత్వంలో నాయకులు, కార్యకర్తలు సమష్టిగా ప్రజల్లోకి వెళ్లి కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేశారు. ప్రజలు అందించిన భారీ మెజారిటీతో ధర్మవరం రాజకీయాల్లో కూటమి తన సత్తాను మరోసారి చాటుకుంది.

ప్రజా తీర్పుతో పెరిగిన బాధ్యత.. అభివృద్ధిపై ఆశలు!

ఎన్నికల ఫలితాల అనంతరం కూటమి అభ్యర్థి పరిసే సుధాకర్ ఆర్డీఓ నుంచి అధికారిక ఎన్నికల విజయ ధ్రువీకరణ పత్రం (డిక్లరేషన్ ఫారమ్)ను స్వీకరించారు. ఈ సందర్భంగా కూటమి నాయకులు, కార్యకర్తలు ఆయనకు అభినందనలు తెలియజేస్తూ విజయోత్సాహాన్ని వ్యక్తం చేశారు. 21,124 ఓట్ల భారీ మెజారిటీతో ప్రజలు అందించిన తీర్పు కేవలం ఎన్నికల విజయం మాత్రమే కాకుండా, కూటమిపై వారు ఉంచిన విశ్వాసానికి ప్రతిబింబంగా నిలిచిందని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. పరిటాల శ్రీరామ్ నాయకత్వంలో సాధించిన ఈ విజయం ధర్మవరం కూటమి శ్రేణుల్లో నూతన ఉత్సాహాన్ని నింపడమే కాకుండా, రాబోయే రోజుల్లో మరింత బాధ్యతతో ప్రజలకు సేవ చేయాలనే సంకల్పాన్ని బలపరిచింది. ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగాలని కూటమి శ్రేణులు ఆకాంక్షిస్తున్నాయి. భారీ మెజారిటీతో లభించిన ఈ ప్రజా తీర్పు ధర్మవరం రాజకీయాల్లో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంది.

బైక్ ర్యాలీతో హోరెత్తిన లక్ష్మంపల్లి పంచాయతీ..





- మర్రిస్వామి ప్రచారంలో భారీ సందడి
- టీడీపీ మద్దతుతో ఎంపీటీసీ అభ్యర్థిగా బరిలో మర్రిస్వామి
- గ్రామ అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనే ప్రధాన లక్ష్యమని అభ్యర్థి

తరపు నాయకుల వెల్లడి

శెట్టూరు నవంబర్ 03, అనంత జనశక్తి న్యూస్

లక్ష్మంపల్లి పంచాయతీలో టీడీపీ మద్దతుతో ఎంపీటీసీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న మర్రిస్వామికి మద్దతుగా నిర్వహించిన బైక్ ర్యాలీ సందడిగా సాగింది. పెద్ద సంఖ్యలో కార్యకర్తలు, అభిమానులు పాల్గొని ర్యాలీ నిర్వహించారు. గ్రామంలోని ప్రధాన వీధుల గుండా సాగిన బైక్ ర్యాలీతో ఎన్నికల ప్రచార కార్యక్రమం సందడిగా మారింది.ఈ సందర్భంగా అభ్యర్థి తరపు నాయకులు మాట్లాడుతూ మర్రిస్వామి విద్యావంతుడని, ప్రజా సమస్యలపై అవగాహన కలిగి, ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యలను తెలుసుకునే వ్యక్తి అని పేర్కొన్నారు.
గ్రామ అభివృద్ధిపై స్పష్టమైన ఆలోచన కలిగిన నాయకుడిగా ఆయనను అభివర్ణించారు.గ్రామంలో రోడ్లు, తాగునీరు, పారిశుధ్యం, డ్రైనేజీ, వీధి దీపాలు, విద్య, వైద్యం వంటి మౌలిక సమస్యల పరిష్కారానికి కృషి చేయడమే లక్ష్యమని తెలిపారు. ప్రజా సమస్యలకు ప్రాధాన్యతనిస్తూ లక్ష్మంపల్లి పంచాయతీ అభివృద్ధికి కృషి చేస్తామని వెల్లడించారు.మర్రిస్వామి ప్రచార కార్యక్రమాల్లో కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొంటూ తమ మద్దతును తెలియజేస్తున్నారు. రాబోయే ఎన్నికల్లో ప్రజల మద్దతు కోరుతూ ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు.

ఔషధ మొక్కల పరిశోధనలో ఎస్కేయూ వృక్షవనం కృషి అభినందనీయం

- చంద్రశేఖర్
- విద్యార్థులకు పరిశోధన, ఉద్యోగ, ఉపాధి అవకాశాలపై దిశానిర్దేశం
- వృక్షవనంలోని మొక్కల సంరక్షణ, పరిశోధనా ప్రాజెక్టుల పరిశీలన

అనంతపురం, నవంబర్ 3:అనంత జనశక్తి న్యూస్

శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం (ఎస్కేయూ) వృక్షవనం ఔషధ మొక్కల అభివృద్ధి, పరిశోధనలో చేస్తున్న కృషి అభినందనీయమని ఆంధ్రప్రదేశ్ ఔషధ మరియు సుగంధ మొక్కల బోర్డు (APMAPB) సీఈఓ శ్రీ చంద్రశేఖర్ ప్రశంసించారు.మంగళవారం ఆయన ఎస్కేయూ వృక్షవనాన్ని సందర్శించి అక్కడి వివిధ సదుపాయాలు, మొక్కల సంరక్షణ, పరిశోధన కార్యక్రమాలను పరిశీలించారు. వృక్షవనంలో విస్తారమైన వృక్షజాతుల వైవిధ్యాన్ని సంరక్షించడంతో పాటు, బోర్డు ఆర్థిక సహకారంతో చేపట్టిన పరిశోధనా ప్రాజెక్టు ద్వారా వివిధ ఔషధ మొక్కలను అభివృద్ధి చేసి, వాటి పెంపకాన్ని ప్రోత్సహిస్తున్న తీరును అభినందించారు. ఈ సందర్భంగా వృక్షవనం డైరెక్టర్, వృక్షశాస్త్ర విభాగాధిపతి ప్రొఫెసర్ బి. రవిప్రసాద్ రావు చేస్తున్న కృషిని ప్రత్యేకంగా ప్రశంసించారు.

విద్యార్థులకు కెరీర్‌పై విలువైన సూచనలు

అనంతరం విద్యార్థులు, పరిశోధక విద్యార్థులతో గంటకు పైగా సమావేశమైన చంద్రశేఖర్ వృక్షశాస్త్రంలోని వివిధ విభాగాల్లో ఉన్నత విద్య, పరిశోధన, ఉద్యోగ, ఉపాధి అవకాశాల గురించి వివరించారు. విద్యార్థుల భవిష్యత్ లక్ష్యాలు, ఆసక్తులను తెలుసుకుని వ్యక్తిగతంగా మార్గదర్శనం చేశారు. అందుబాటులో ఉన్న వివిధ కెరీర్ అవకాశాలను గుర్తించి, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో వృక్షవనం డైరెక్టర్, వృక్షశాస్త్ర విభాగాధిపతి ప్రొఫెసర్ బి. రవిప్రసాద్ రావు, డాక్టర్ సంధ్యారాణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్‌ను ఘనంగా సత్కరించారు.



కూటమిపై చెక్కుచెదరని నమ్మకానికి నిదర్శనం ఈ విజయం

- మంత్రి కందుల దుర్గేష్
- మున్సిపల్ ఎన్నికల్లో 28 స్థానాల భారీ విజయం అందించిన నిడదవోలు పట్టణ ప్రజలకు హృదయపూర్వక ధన్యవాదాలు..
- ప్రత్యేకించి ఎన్నికల ప్రచారంలో పాల్గొని సత్ఫలితాలకు కారణమైన టీడీపీ ఇంచార్జ్ బూరుగుపల్లి శేషారావుకు, బీజేపీ నాయకత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు
- దళిత యువతి మురాల జ్యోతికి చైర్‌పర్సన్ పీఠం దక్కడం సామాన్యులకు రాజ్యాధికారానికి నిదర్శనం..ఈ సందర్భంగా మున్సిపల్ ఛైర్ పర్సన్ మురాల జ్యోతికి, గెలిచిన కూటమి అభ్యర్థులకు ఘనంగా సత్కారం
- సాధారణ ఎన్నికలను మించిన తీర్పు ఇచ్చిన ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ 'నవ నిడదవోలు' నిర్మిస్తామన్న మంత్రి కందుల దుర్గేష్

నిడదవోలు నవంబర్ 03 అనంత జనశక్తి న్యూస్

నిడదవోలు మున్సిపల్ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను సాధారణ ఎన్నికలను మించిన ఘనవిజయంతో ఆశీర్వదించిన రాష్ట్రప్రజలకు,ప్రత్యేకించి నిడదవోలు పట్టణ ప్రజానీకానికి రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. గత రెండున్నరేళ్ల కాలంలో ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ల నాయకత్వంలోని కూటమి ప్రభుత్వ సంక్షేమం, అభివృద్ధి, సమర్థవంతమైన పాలనకు ఈ విజయం ప్రజలు ఇచ్చిన గొప్ప తీర్పు అని హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి కందుల దుర్గేష్‌మాట్లాడుతూ "నిడదవోలు పట్టణంలో మొత్తం 32 వార్డులకు గానూ 28 స్థానాల్లోకూటమి విజయం సాధించడం అభినందనీయం. జనసేన 14, టీడీపీ 13, బీజేపీ 1 స్థానంలో బంపర్ మెజార్టీతో గెలుపొందాయి. ఎలాంటి అడ్డంకులు లేకుండా అభ్యర్థుల ఎంపిక నుండి విజయం వరకు జనసేన, టీడీపీ, బీజేపీ నాయకత్వాలు చక్కని సయోధ్యతో పనిచేశాయి. ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ చైర్మన్ బూరుగుపల్లి శేషారావు, బీజేపీ నాయకత్వం, నేను కలిసి వేసిన వ్యూహం ఈ రోజు సత్ఫలితాలను ఇచ్చింది.""మనోబలమే ఆస్తిగా, ఎటువంటి ఆర్థిక బలం, ఆర్భాటం లేని ఒక దళిత యువతి మురాల జ్యోతి... చర్చిపేట వీధుల్లో పుట్టి పెరిగి ఈ రోజు మున్సిపల్ చైర్‌పర్సన్ స్థాయికి ఎదగడం నిడదవోలు చరిత్రలోనే అత్యంత గర్వకారణమైన క్షణం. 'సామాన్యులకు రాజ్యాధికారం కల్పించి ఉన్నత స్థానాల్లో కూర్చోబెట్టాలి' అని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పదే పదే చెప్పే మాటలను ఈ రోజు మేము నిజం చేసి చూపించాం. ఒక విద్యావంతురాలు, సామాన్య కుటుంబంలో పుట్టిన అమ్మాయి ప్రజా ప్రతినిధిగా ఎదగడాన్ని నిష్పక్షపాతంగా సమాజానికి చూపించిన మీడియా రంగానికి నా ప్రత్యేక ధన్యవాదాలు." అని మంత్రి దుర్గేష్ భావోద్వేగంతో తెలిపారు.."ఇది అనుభవం, ఉత్సాహవంతమైన యువత కలగలిసిన అద్భుతమైన టీమ్. మహిళలు సరైన ఆలోచనలు చేస్తే ఒక ఇల్లు ఎంత అద్భుతంగా తీర్చిదిద్దబడుతుందో, విజయం సాధించిన మన మహిళా కౌన్సిలర్లు తమ వార్డులను కూడా అలాగే తీర్చిదిద్దుతారనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. ఈ మహిళా శక్తితో త్వరలోనే 'నవ నిడదవోలు' రూపుదిద్దుకుంటుంది." అని మంత్రి దుర్గేష్ ఆశాభావం వ్యక్తం చేశారు."భారీ మెజార్టీ సాధించిన డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, బయ్యా రామలక్ష్మీలతో పాటు విజయం సాధించిన ప్రతి అభ్యర్థికి నా ప్రత్యేక అభినందనలు. ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున విజయోత్సవ ర్యాలీలు చేయడం లేదు.. గెలిచామనే అహంకారాన్ని ఎవరూ తలకెక్కించుకోకూడదు. ప్రజాసేవే పరమావధిగా పనిచేయాలి. స్థానిక శాసనసభ్యుడిగా, కౌన్సిల్ ఎక్స్‌అఫీషియో మెంబర్‌గా నేను కూడా ప్రతి అడుగులో భాగస్వామినై నిడదవోలును ట్రిపుల్ ఇంజిన్ సర్కార్ అందతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతాను." అని ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ గెలిచిన విజేతలకు దిశానిర్దేశం చేశారు.మున్సిపల్ ఎన్నికల్లో విజయం సాధించిన నేపథ్యంలో మంత్రి కందుల దుర్గేష్ మున్సిపల్ ఛైర్ పర్సన్‌గా గెలిచిన మురాల జ్యోతిని, కౌన్సిలర్ లుగా గెలిచిన అభ్యర్థులకు శుభాకాంక్షలు తెలిపి ఘనంగా సత్కరించారు. చారిత్రాత్మక విజయం సాధించిన సందర్భంగా పట్టణంలోని మంత్రి క్యాంప్ కార్యాలయం వద్ద కూటమి నాయకులు, కార్యకర్తలు పండగ వాతావరణంలో సంబురాలు జరుపుకున్నారు. రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్‌తో పాటు కొత్తగా విజయం సాధించిన అభ్యర్థులకు మేళతాళాలు, బ్యాండ్ మేళాల నడుమ పూలవర్షం కురిపిస్తూ అభిమానులు,శ్రేణులు ఘన స్వాగతం పలికారు.

పరిటాల శ్రీరామ్ ఎన్నికల ప్రచారంలో పోటెత్తిన జనం...





- అడుగడుగునా హారతులు పట్టిన మహిళలు

నల్లచెరువు అక్టోబర్ 03 అనంత జనశక్తి న్యూస్

మండల కేంద్రమైన నల్లచెరువు లో జడ్పిటిసి అభ్యర్థిగా పోటీ చేస్తున్న పరిటాల శ్రీరామ్ మంగళవారం నాడు నల్లచెరువు లో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు మొదట అంబేద్కర్ కాలనీలోని మారెమ్మ స్వామి దేవస్థానం నుండి ప్రారంభించారు పరిటాల శ్రీరామ్ కు యస్సి కాలనీ వాసులు ఘనంగా పూల మాలాలతో స్వాగతం పలికారు అనంతరం ఎన్నికలు ప్రచారం ముగియడంతో ప్రజలు శ్రీరామ్ కు అడుగడుగునా హారతులు ఇచ్చి నీరాజనం పొందారు బస్టాండ్ కూడలిలో భారీ బానసంచాలు పేల్చి గజమాలాలతో ఘనంగా స్వాగతం పలికారు
పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ జిల్లాలో అత్యంత వెనుకబడిన మండలాల్లో ఒకటైన నల్లచెరువు మండలంలో నేను జడ్పిటిసి అభ్యర్థిగా పోటీ చేయడం ఎంతో సంతోషకరమైన విషయమని ఈ మండలంలో మా తండ్రిగారైన స్వర్గీయ రవీంద్ర గారికి ఎన్నో సత్సంబంధాలు ఉన్నాయని తెలిపారు సమగ్ర అభివృద్ధికి తోడ్పాటై నిరంతరం కృషి చేస్తానని మొదటగా నీటి సమస్యకు శాశ్వత పరిస్కారం చేస్తానని జడ్పీటిసి గా నన్ను మరియు ఎంపిటిసి అభ్యర్థులను అత్యంత మెజారిటీతో గెలిపించే అవకాశం కల్పించాలని ఓటర్లను కోరారు.అలాగే ఎమ్మెల్యే కందికుంట ఆశయ సాధనకు నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తామని తెలిపారు ఈ కార్యక్రమంలో నల్లచెరువు 1 ఇంచార్జ్ ప్రభాకర్ 2 ఇంచార్జ్ భరత్ మరియు తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మున్సిపాలిటీల్లో కూటమి హవా





(మొదటి పేజీ తరువాయి)

చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్‌గా కఠారి హేమలత 35,050 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. ఆమె రెండోసారి చిత్తూరు మేయర్‌గా ఎన్నికయ్యారు. మొత్తం 60 డివిజన్లకు గాను 47 టీడీపీ, 2 జనసేన, ఒక బీజేపీ, ఒక వైసీపీ అభ్యర్థి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికలు జరిగిన వార్డుల్లో టీడీపీ 4, వైసీపీ 3, జనసేన ఒకటి, స్వతంత్ర అభ్యర్థి ఒకటి గెలుచుకున్నారు. తుది ఫలితాల్లో టీడీపీ 51, వైసీపీ 4, జనసేన 3, బీజేపీ 1, ఇండిపెండెంట్ ఒక స్థానాన్ని దక్కించుకున్నారు.

నగరిలో టీడీపీకి 32 వార్డులు

నగరి మున్సిపాలిటీ చైర్మన్‌గా శ్రీనివాసన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మొత్తం 40 వార్డులకు గాను మూడు టీడీపీ, ఒక వైసీపీ అభ్యర్థి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికలు జరిగిన వార్డుల్లో టీడీపీ 29, జనసేన ఒకటి, వైసీపీ 6 స్థానాలను గెలుచుకున్నాయి. దీంతో తుది ఫలితాల్లో టీడీపీ 32, వైసీపీ 7, జనసేన ఒక వార్డును కైవసం చేసుకున్నాయి.

పుంగనూరులో నయీమ్ తాజ్ ఏకగ్రీవం

పుంగనూరు మున్సిపల్ చైర్‌పర్సన్‌గా నయీమ్ తాజ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మొత్తం 36 వార్డులకు గాను 27 టీడీపీ, 2 జనసేన, 2 బీజేపీ, ఒక ఎస్డీపీఐ అభ్యర్థి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికలు జరిగిన వార్డుల్లో టీడీపీ 3, సీపీఐ ఒక స్థానాన్ని గెలుచుకున్నాయి. దీంతో తుది ఫలితాల్లో టీడీపీ 30, జనసేన 2, బీజేపీ 2, సీపీఐ ఒకటి, ఎస్డీపీఐ ఒక వార్డును గెలుచుకున్నాయి.

పుత్తూరులో జనసేన అభ్యర్థి ఎలుమలై విజయం

పుత్తూరు మున్సిపల్ చైర్మన్‌గా జనసేన అభ్యర్థి ఎలుమలై 10,023 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. మొత్తం 36 వార్డులకు గాను ఒక వార్డులో టీడీపీ అభ్యర్థి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికలు జరిగిన వార్డుల్లో టీడీపీ 29, వైసీపీ 4, జనసేన 2 స్థానాలను గెలుచుకున్నాయి. తుది ఫలితాల్లో టీడీపీ 30, వైసీపీ 4, జనసేన 2 వార్డులను కైవసం చేసుకున్నాయి.

కుప్పంలో మొత్తం 32 వార్డులు టీడీపీ ఖాతాలోకి

కుప్పం మున్సిపల్ చైర్మన్‌గా టీడీపీ అభ్యర్థి రాజ్‌కుమార్ 15,630 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. మొత్తం 32 వార్డులకు గాను 13 వార్డుల్లో టీడీపీ అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మిగిలిన 19 వార్డులకు జరిగిన ఎన్నికల్లోనూ టీడీపీ అభ్యర్థులే విజయం సాధించారు. దీంతో కుప్పం మున్సిపాలిటీలోని మొత్తం 32 వార్డులూ టీడీపీ ఖాతాలో చేరాయి.

పలమనేరులో టీడీపీకి 26 వార్డులు

పలమనేరు మున్సిపల్ చైర్‌పర్సన్‌గా టీడీపీ అభ్యర్థి రాజ్యలక్ష్మి 3,475 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. మొత్తం 36 వార్డులకు గాను ఆరు వార్డుల్లో టీడీపీ అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికలు జరిగిన వార్డుల్లో టీడీపీ 20, వైసీపీ 8, జనసేన 2 స్థానాలను గెలుచుకున్నాయి. తుది ఫలితాల్లో టీడీపీ 26, వైసీపీ 8, జనసేన 2 వార్డులను దక్కించుకున్నాయి.

మదనపల్లెలో టీడీపీ చైర్మన్ అభ్యర్థి శ్రీరామ్ చిన్నబాబు గెలుపు

మదనపల్లె మున్సిపల్ చైర్మన్‌గా టీడీపీ అభ్యర్థి శ్రీరామ్ చిన్నబాబు 9,027 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. మొత్తం 48 వార్డులకు గాను ఒక వార్డులో టీడీపీ అభ్యర్థి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికలు జరిగిన వార్డుల్లో టీడీపీ 21, జనసేన 6, వైసీపీ 12, బీజేపీ 4, స్వతంత్రులు 3, బీఎస్పీ ఒక స్థానాన్ని గెలుచుకున్నారు. తుది ఫలితాల్లో టీడీపీ 22, వైసీపీ 12, జనసేన 6, బీజేపీ 4, ఇండిపెండెంట్లు 3, బీఎస్పీ ఒక వార్డును కైవసం చేసుకున్నారు.

విశాఖపట్నం నగరపాలక సంస్థ ఎన్నికల్లో టీడీపీ ఘన విజయం సాధించింది. మేయర్ అభ్యర్థిగా బరిలో నిలిచిన ముక్కా శ్రావణి.. తన సమీప ప్రత్యర్థి, వైసీపీ అభ్యర్థి వరుదు కల్యాణిపై గెలుపొందారు. రాష్ట్రంలోనే అతిపెద్ద మున్సిపల్ కార్పొరేషన్ అయిన విశాఖలో మొత్తం 120 డివిజన్లు ఉండగా.. అత్యధిక స్థానాలను కూటమి అభ్యర్థులు కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా ముక్కా శ్రావణి మాట్లాడుతూ.. విశాఖ నగరం తెలుగుదేశం పార్టీకి ఎప్పటి నుంచో కంచుకోటగా ఉందన్నారు. తనపై, కూటమి అభ్యర్థులపై విశ్వాసం ఉంచి గెలిపించిన నగర ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని తెలిపారు. ఈ ఎన్నికల్లో రెండున్నర లక్షల మెజార్టీ లభించిందని ఆమె పేర్కొన్నారు. ఈ విజయంతో సంతోషం కలిగినప్పటికీ, ప్రజల పట్ల బాధ్యత మరింత పెరిగిందని చెప్పారు. నగర ప్రజలు తమపై పెట్టుకున్న ఆశలు, నమ్మకాలకు అనుగుణంగా పనిచేస్తామని స్పష్టం చేశారు. విశాఖను అభివృద్ధిలో దేశంలోనే నంబర్ వన్ స్థానానికి తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని ముక్కా శ్రావణి వెల్లడించారు.

రెండు దశాబ్దాల తర్వాత విజయవాడ మేయర్‌కు మళ్లీ ప్రత్యక్ష ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో విజయవాడ కార్పొరేషన్ ఎన్నిక ప్రతిష్టాత్మకంగా మారిన విషయం తెలిసిందే. దీంతో కూటమి, వైకాపా, స్వతంత్ర అభ్యర్థి మధ్య నెలకొన్న త్రిముఖ పోటీ రాష్ట్ర వ్యాప్తంగా అందరి దృష్టినీ ఆకర్షిస్తోంది. జనసేన తరపున వంగవీటి రాధాకృష్ణ, వైకాపా అభ్యర్థిగా మాజీ మేయర్ రాయన భాగ్యలక్ష్మి, స్వతంత్ర అభ్యర్థిగా విశ్రాంత ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు బరిలో దిగారు.

మేయర్ ఎన్నికకు సంబంధించి ఓట్ల లెక్కింపు ప్రక్రియ కొనసాగుతోంది. ఇప్పటివరకు 2,15,758 ఓట్లను సిబ్బంది లెక్కించారు. వారిలో జనసేన అభ్యర్థి వంగవీటి రాధాకృష్ణకు 1,34,884 ఓట్లు పోలయ్యాయి. వైకాపా అభ్యర్థి రాయన భాగ్యలక్ష్మి 68,025 ఓట్లు, స్వతంత్ర అభ్యర్థి విశ్రాంత ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు 6,986 ఓట్లు సాధించారు.

పట్టణ, స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాల్లో తెదేపా విజయపరంపర కొనసాగుతోంది. తాజాగా విజయనగరం మేయర్ పీఠాన్ని తెలుగుదేశం పార్టీ కైవసం చేసుకుంది. పార్టీ తరపున బరిలో నిలిచిన అవనాపు భార్గవి మేయర్‌గా విజయం సాధించారు. తన ప్రత్యర్థిపై 18,787 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. విజయనగరం కార్పొరేషన్ పరిధిలోని 62 డివిజన్ల లో తెదేపా 35, భాజపా 3, జనసేన 6 చోట్ల విజయం సాధించాయి. వైకాపా 16 చోట్ల, ఇతరులు 2 చోట్ల గెలిచాయి.

ఇప్పటివరకు వెలువడిన మేయర్ ఫలితాల్లో తిరుపతిలో మన్నె శ్రీనివాస ప్రసాద్, చిత్తూరులో కఠారి హేమలత, గుంటూరులో కోవెలమూడి లక్ష్మీ అపర్ణ, మచిలీపట్నంలో షేక్ అబ్దుల్లా అబీదా, విశాఖలో ముక్కా శ్రావణి, ఏలూరులో రెడ్డి అప్పలనాయుడు, కర్నూలులో ప్రత్యూష, విజయనగరంలో అవనాపు భార్గవి ఘన విజయం సాధించారు. నందికొట్కూరు మున్సిపాలిటీలో మాత్రమే వైకాపా గెలుపొందింది.





జగన్‌పై కేసు నమోదు

- పులివెందులలో కేసు నమోదు చేసిన పోలీసులు
- పోలింగ్ రోజు ధర్నా చేసినందుకు..
- ఆర్వో ఆఫీసు ముందు ఆయన బైఠాయింపు



ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌పై కేసు నమోదైంది. జగన్ సొంత నియోజకవర్గమైన కడప జిల్లా పులివెందులలో పోలీసులు కేసు ఫైల్ చేశారు. మున్సిపల్ ఎన్నికల పోలింగ్ రోజు పులివెందుల ఆర్వో కార్యాలయం దగ్గర వైఎస్సార్‌సీపీ నేతలు, ఏజెంట్లతో కలిసి జగన్ ధర్నా చేసిన సంగతి తెలిసిందే. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించి ఆందోళన చేసిందనుకు జగన్‌పై కేసు నమోదు చేశారు. పులివెందుల మున్సిపాలిటీలో తమ ఏజెంట్లను పోలింగ్ బూత్‌ల్లోకి రాకుండా అడ్డుకున్నారని ఆరోపిస్తూ జగన్ నిరసన చేపట్టిన సంగతి తెలిసిందే. జగన్‌తో పాటుగా కడప ఎంపీ అవినాష్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నేతలు, ఏజెంట్లపై నా కేసులు నమోదయ్యాయి.

వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మున్సిపల్ ఎన్నికల పోలింగ్ రోజు పులివెందులలో ఓటు హక్కు వినియోగించుకోవడానికి వచ్చారు. ఆయన, కడప ఎంపీ అవినాష్ రెడ్డితో పాటుగా పార్టీ నేతలు, కేడర్‌తో కలిసి పులివెందులలోని ఆర్వో కార్యాలయం ముందు బైఠాయించారు. వైఎస్సార్‌సీపీ ఏజెంట్లను పోలింగ్ కేంద్రాల్లోకి అనుమతించలేదన్నారు. వెంటనే ఆర్వో జగన్ దగ్గర నుంచి వినతిపత్రం స్వీకరించారు. రాష్ట్రంలో ఎన్నికల ప్రక్రియ అపహాస్యమైందని.. దారుణంగా ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని జగన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పులివెందులలో రీ పోలింగ్ జరపాలని డిమాండ్ చేశారు జగన్. పులివెందులలోని పోలింగ్ బూత్‌లలో వైఎస్సార్సీపీ ఏజెంట్లు లేకుండా.. వారిని లోపలికి అనుమతించడం లేదన్నారు. పోలింగ్ బూత్‌లను టీడీపీ నేతలు ఆక్రమించారని ఆరోపించారు. పోలీసులు, అధికారులు అధికార పార్టీకి కొమ్ము కాస్తున్నారని ఘాటు వ్యాఖ్యలు చేశారు.

మాజీ సీఎం నియోజకవర్గంలోనే పరిస్థితులు దారుణంగా ఉన్నాయన్నారు జగన్. వీళ్లు ఏంచేసినా మరో రెండేళ్లేనని, ఆ తర్వాత తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందన్నారు.. అప్పుడు ప్రజాస్వామ్యాన్ని కాపాడతామన్నారు. అలాగే ఈ ఘటనలపై విచారణ చేయిస్తామన్నారు. ఇలాంటి పరిస్థితులు కొనసాగితే రాబోయే రోజుల్లో లో ఇక ఎన్నికలు జరగవని.. తాను పిలుపు ఇచ్చి ఉంటే ఈ ఎన్నికలే ఆగిపోయేవన్నారు. తాను కానీ ప్రజాస్వామ్యంపై గౌరవంతోనే అలా చేయలేదన్నారు వైఎస్ జగన్. అనంతరం జగన్ ఓటు వేయుకుండా బెంగళూరు వెళ్లిపోయారు. పులివెందులలో రీ పోలింగ్‌కు అనుమతిస్తే అప్పుడు వచ్చి ఓటేస్తానన్నారు.

'స్వప్నమ్మ విజయం పవన్ కళ్యాణ్‌కు గిఫ్ట్'

- ఆదోనిలో గెలిచిన జనసేన రెబల్ అభ్యర్థి భర్త కీలక వ్యాఖ్యలు

ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లో కర్నూలు జిల్లా ఆదోని ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కూటమిలో జనసేనకు చైర్‌పర్సన్ స్థానం దక్కకపోవడంతో రెబల్ అభ్యర్థిగా ఈ ఎన్నికల్లో బరిలోకి దిగిన స్వప్న నాయకర్ విజయం సాధించి అందరి దృష్టిని ఆకర్షించారు. టీడీపీ, వైసీపీ అభ్యర్థుల అంచనాలను తలకిందులు చేస్తూ ఆమె సాధించిన గెలుపుపై జనసేన శ్రేణుల్లో ఆనందం వ్యక్తం అవుతోంది. ఈ విజయంపై ఆమె భర్త, ఆదోని జనసేన ఇన్‌ఛార్జి మల్లప్ప నాయకర్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారాయి. స్వప్నమ్మ విజయాన్ని జనసేన అధినేత, ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు బహుమతిగా ఇస్తున్నామని ఆయన ప్రకటించారు.

ఆదోని మున్సిపాలిటీలో చైర్‌పర్సన్ స్థానం జనసేనకు దక్కుతుందని ఆ పార్టీ స్థానిక నాయకులు ఆశించారు. అయితే కూటమిలో సీట్ల సర్దుబాటులో భాగంగా ఈ స్థానం టీడీపీకి కేటాయించారు. టీడీపీ తరఫున నాగమణి అభ్యర్థిత్వం ఖరారు కావడంతో జనసేన వర్గాల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. తమ పార్టీకి అన్యాయం జరిగిందని జనసేన స్థానిక నాయకులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిణామాల నేపథ్యంలో ఆదోని జనసేన ఇన్‌ఛార్జి మల్లప్ప నాయకర్.. తన సతీమణి స్వప్న నాయకర్‌ను స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దించారు.

జనసేన పార్టీ గుర్తుపై కాకుండా ఇండిపెండెంట్‌గా పోటీ చేసిన ఆమె ప్రచారంలో ప్రజల మద్దతు కూడగట్టుకున్నారు. చివరకు ప్రత్యర్థులను వెనక్కి నెట్టి చైర్‌పర్సన్ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. ఆమెకు సుమారు 4 వేల ఓట్ల మెజారిటీ వచ్చినట్లు తెలుస్తోంది. ఇక..స్వప్న నాయకర్ విజయం ఖరారైన తర్వాత ఆమె భర్త మల్లప్ప నాయకర్ మీడియాతో మాట్లాడారు. తన వెనుక జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఉన్నారని.. ఎలాంటి సమయంలోనైనా కార్యకర్తలకు అండగా నిలిచే నాయకుడు ఆయన అని పేర్కొన్నారు. అర్ధరాత్రి అయినా స్పందించే నాయకుడు పవన్ కళ్యాణ్ అని.. ఆయనే తన వెంట ఉన్నారని మల్లప్ప నాయకర్ తన అభిమానాన్ని చాటుకున్నారు.

స్వప్నమ్మ విజయాన్ని పవన్ కళ్యాణ్‌కు బహుమతిగా ఇస్తున్నామని ఈ సందర్భంగా మల్లప్ప నాయకర్ ప్రకటించారు. పవన్ కళ్యాణ్‌తో తాను మాట్లాడానని.. ఆయన అభినందనలు తెలిపారని వెల్లడించారు. 'నిన్ను చూస్తే గర్వంగా ఉంది' అని పవన్ కళ్యాణ్ అన్నట్లు మల్లప్ప నాయకర్ తెలిపారు. ఈ విజయం తనకు మరింత బాధ్యతను పెంచిందని ఆయన వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్‌కు మల్లప్ప నాయకర్ చేసిన విజ్ఞప్తి కూడా చర్చనీయాంశమైంది. ఆదోని నియోజకవర్గాన్ని కాపాడాలని..ప్రజల సమస్యలపై దృష్టి పెట్టాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా స్థానికంగా జనసేనకు జరిగిన అన్యాయం, కార్యకర్తల్లో ఉన్న అసంతృప్తిని పార్టీ అధినేత దృష్టికి తీసుకెళ్లారు.కూటమిలో భాగస్వాములుగా ఉన్న టీడీపీ, జనసేన మధ్య అభ్యర్థి ఎంపిక విషయంలో తలెత్తిన విభేదాలు ఈ ఎన్నికలో ప్రభావం చూపినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. స్వప్న నాయకర్‌కు జనసేన మద్దతుదారులతో పాటు ఇతర పార్టీల ఓటర్లు కూడా మద్దతు ఇచ్చారా..క్రాస్ ఓటింగ్ జరిగిందా అనే అంశాలపై ఇప్పుడు ఆసక్తి నెలకొంది. ఆదోని మున్సిపాలిటీలో స్వతంత్ర అభ్యర్థిగా స్వప్న నాయకర్ సాధించిన విజయం కూటమి రాజకీయాల్లో చర్చకు దారితీసింది. ఒకవైపు సీట్ల సర్దుబాటులో జనసేనకు చైర్‌పర్సన్ స్థానం దక్కకపోవడం.. మరోవైపు అదే పార్టీకి చెందిన నాయకుడి భార్య ఇండిపెండెంట్‌గా పోటీ చేసి గెలవడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది.



అంబటి రాంబాబుకు ఈడీ నోటీసులు

అమరావతి, నవంబర్ 03, అనంత జనశక్తి న్యూస్

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు మరోసారి నోటీసులు జారీ చేశారు. మద్యం అక్రమ రవాణా కేసుకు సంబంధించిన వ్యవహారంలో రేపు విచారణకు హాజరుకావాలని ఆదేశిస్తూ ఈ సమన్లు పంపారు. గతంలోనే ఈడీ అధికారులు విచారణకు రావాల్సిందిగా ఆయనకు నోటీసులు ఇచ్చినప్పటికీ, అనారోగ్య కారణాల వల్ల హాజరు కాలేకపోతున్నట్లు అంబటి రాంబాబు లిఖితపూర్వకంగా సమాచారం ఇచ్చారు.

ఆ తర్వాత తనకు గుండెకు స్టెంట్లు వేసినట్లు ఆసుపత్రి వైద్యులు ఇచ్చిన వైద్య నివేదికలను కూడా ఈడీ కార్యాలయానికి పంపించారు. ఈ నేపథ్యంలో గత నెల 29వ తేదీన ఈడీ అధికారులు ఈ నెల 4న విచారణకు రావాలని పేర్కొంటూ ఆయనకు అధికారికంగా ఈమెయిల్ ద్వారా సమన్లు పంపారు. అయితే.. ఆ మెయిల్‌ను తాను సమయానికి చూసుకోలేదని అంబటి అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దాంతో నిన్న మరోసారి కొత్తగా నోటీసులు జారీ చేసిన ఈడీ బృందం, రేపు కచ్చితంగా విచారణకు హాజరుకావాలని స్పష్టం చేసింది. అధికారుల ఆదేశాల మేరకు రేపు ఆయన ఈడీ ఎదుట విచారణకు హాజరుకానున్నట్లు తెలుస్తోంది.

తెలంగాణను కరువు రాష్ట్రంగా ప్రకటించాలి



హైదరాబాద్, నవంబర్ 03, అనంత జనశక్తి న్యూస్

జిల్లాలో ఎల్‌నినో ప్రభావంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. సాగునీరు అందక పంట పొలాలు ఎండిపోయి బీడు భూములుగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తెలంగాణను కరువు రాష్ట్రంగా ప్రకటించాలని.. కరువు ప్రభావిత ప్రాంతాలకు వెంటనే ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఎండిపోయిన పంటలకు, బీడు భూములకు పంట నష్టపరిహారం అందించాలని కోరారు. వరి పంటకు ఎకరాకు రూ.30 వేలు, పత్తి, మిర్చి తదితర పంటలకు ఎకరాకు రూ.50 వేల చొప్పున పరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. వ్యవసాయ కూలీలకు రూ.10 వేల కరువు భత్యం అందించాలని, రేషన్ బియ్యంతో పాటు 16 రకాల నిత్యావసర సరుకులను పంపిణీ చేయాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కరువు సమస్యపై దృష్టి సారించకుండా ఒకరిపై ఒకరు నిందారోపణలు చేసుకుంటున్నాయని కూనంనేని విమర్శించారు. రైతులు పంటలు కోల్పోయి తీవ్ర ఇబ్బందులు పడుతుంటే ప్రభుత్వాలు రాజకీయ విమర్శలకే పరిమితమవుతున్నాయని అన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించి తెలంగాణ రాష్ట్రానికి రూ.25 వేల కోట్ల కరువు సహాయ నిధిని ప్రకటించాలని డిమాండ్ చేశారు. రైతులకు న్యాయం జరిగేలా తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ పర్యటనలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర నాయకులు భాగం హేమంతరావు, జిల్లా నాయకులు దొండపాటి రమేష్, ఎర్రబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల పద్ధతి ఏదైనా.. ప్రజల మద్దతు కూటమికే..

(మొదటి పేజీ తరువాయి)

అయితే ఇప్పుడు బ్యాలెట్ పద్ధతిలో నిర్వహించిన స్థానిక ఎన్నికల్లోనూ ప్రజలు కూటమికి అదే స్థాయిలో విజయాన్ని అందించారని అన్నారు. ఈ ఫలితాలు కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు, పాలనపై ప్రజలు వ్యక్తం చేస్తున్న విశ్వాసానికి నిదర్శనమని పేర్కొన్నారు.

మరోవైపు.. స్థానిక ఎన్నికల్లో జనసేన, టీడీపీ, బీజేపీకి అండగా నిలిచిన ఓటర్లందరికీ కృతజ్ఞతలు తెలిపారు పవన్ కల్యాణ్.. కూటమి పక్షాలకు అఖండ విజయాలు అందించిన ప్రజలకు ధన్యవాదాలు తెలియజేశారు. జనసేనకు బలమైన మద్దతు ఇచ్చిన పట్టణ, నగర ఓటర్ల ఆదరణను పార్టీ ఎంతో విలువైనదిగా భావిస్తోందన్నారు. ఎన్నికల్లో విజయం సాధించిన అభ్యర్థులందరికీ అభినందనలు, కృతజ్ఞతలు తెలిపారు జనసేన పార్టీ అధ్యక్షుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్..

మున్సిపల్ ఎన్నికల విజయం మరింత పెద్ద బాధ్యత: లోకేశ్

(మొదటి పేజీ తరువాయి)

కూటమి ఐక్యత, నాయకులు, కార్యకర్తల సమన్వయంతో ఈ విజయం సాధ్యమైందని పేర్కొన్నారు.

మున్సిపల్ ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో ఇక అందరి దృష్టి ప్రజాసేవపైనే ఉండాలని లోకేష్ సూచించారు. ఎన్నికల్లో గెలిచిన ప్రతి ప్రజాప్రతినిధి నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరికీ సేవలందించాలని స్పష్టం చేశారు. ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోవడమే ఇప్పుడు ముందున్న అసలైన బాధ్యత అని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన తీర్పు మరింత వినయంతో, మరింత బాధ్యతతో పనిచేయాలనే సంకల్పాన్ని ఇచ్చిందని పేర్కొన్నారు. ఇక, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా మరింత అంకితభావంతో పనిచేస్తామని నారా లోకేష్ తెలిపారు. ప్రజాసేవ, రాష్ట్ర ప్రగతికి ప్రజా ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తుందని స్పష్టం చేశారు. ఎన్నికల విజయంతో మరింత బాధ్యత పెరిగిందని, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకునేలా ప్రతి ప్రజాప్రతినిధి పనిచేయాలని ఆయన ఆకాంక్షించారు మంత్రి నారా లోకేష్..



కంపెనీల బాటపట్టిన కేఆర్‌వీ

ఐటీ సంస్థల్లో స్థానికులకు

- ఉద్యోగాలు దక్కడం లేదు

- కన్నడ రక్షణ వేదిక 'ఆగ్రహ అభియాన్'

- కంపెనీలను నేరుగా సందర్శించి వినతిపత్రాలు

భారత సిలికాన్ వ్యాలీ బెంగళూరులోని ఐటీ, బీటీ సంస్థల్లో స్థానిక కన్నడిగులకు తగిన ఉద్యోగావకాశాలు కల్పించాలని కోరుతూ ప్రసిద్ధ కన్నడ సంఘం 'కర్ణాటక రక్షణ వేదిక' (కేఆర్‌వీ) రంగంలోకి దిగింది. 'ఆగ్రహ అభియాన్' పేరుతో ప్రత్యేక ప్రచారాన్ని చేపట్టిన కేఆర్‌వీ ప్రతినిధులు, నగరంలోని వివిధ ప్రైవేట్ సంస్థలు, ఐటీ కంపెనీలను నేరుగా సందర్శిస్తున్నారు. రిక్రూట్‌మెంట్‌లో కన్నడిగులపై ఏమైనా వివక్ష చూపుతున్నారా అనే అంశాన్ని పరిశీలించడంతో పాటు, స్థానికులకు కల్పిస్తున్న ఉద్యోగ అవకాశాల సమాచారాన్ని సేకరిస్తున్నారు. కేఆర్‌వీ కన్వీనర్ టీవీ నారాయణగౌడ నేతృత్వంలో పలు బృందాలుగా ఏర్పడిన నాయకులు బెంగళూరులోని వేర్వేరు ప్రాంతాల్లో ఉన్న కంపెనీలకు వెళ్ళి యాజమాన్యాలకు వినతిపత్రాలు సమర్పించారు.

"ఇది నిరసన కాదు.. బాధ్యతను గుర్తుచేయడమే"

కంపెనీల సందర్శనపై సామాజిక మాధ్యమాల్లో వివరణ ఇచ్చిన కేఆర్‌వీ కన్వీనర్ నారాయణగౌడ, ఇది కేవలం అవగాహనా ప్రచారం మాత్రమే తప్ప నిరసన లేదా చట్టాన్ని హస్తగతం చేసుకునే ప్రక్రియ కాదని స్పష్టం చేశారు.

"మా నాయకులు ప్రైవేట్ సంస్థల అధిపతులు, ప్రతినిధులతో ఎంతో మర్యాదగా మాట్లాడుతున్నారు. కర్ణాటకలో వ్యాపారాలు సాగిస్తున్న కంపెనీలు స్థానిక కన్నడిగులకే సింహభాగం ఉద్యోగాలు ఇవ్వాలన్నదే మా డిమాండ్. ఆయా సంస్థలకు ఉన్న నైతిక, సామాజిక బాధ్యతను మాత్రమే మేము గుర్తుచేస్తున్నాం" అని నారాయణగౌడ పేర్కొన్నారు. తమ వినతికి కంపెనీ యాజమాన్యాలు కూడా సానుకూలంగా స్పందించాయని, అవసరమైన సమాచారాన్ని అందిస్తామని హామీ ఇచ్చాయని తెలిపారు.

ఐటీ హబ్‌లో స్థానికుల ఆవేదన

నగరంలో ఏటా విస్తరిస్తున్న ఐటీ పరిశ్రమ వల్ల రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ వేగంగా పుంజుకున్నప్పటికీ, స్థానికులకు తగిన ప్రయోజనం చేకూరడం లేదన్న భావన స్థానిక వర్గాల్లో బలంగా ఉంది. బెంగళూరు ఇన్నోవేషన్ నివేదిక ప్రకారం నగరంలోని టెక్ రంగంలో సుమారు 2.5 లక్షల మంది పనిచేస్తున్నారు. అయితే, అత్యధిక జీతాలు లభించే ఈ ఉద్యోగాలు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే వలసదారులకే దక్కుతున్నాయని, స్థానిక అభ్యర్థులను పక్కన పెడుతున్నారని కన్నడ సంఘాలు చాలాకాలంగా ఆరోపిస్తున్నాయి.

"కన్నడిగుడే సర్వాధికారి.. కానీ చట్టం చేతుల్లోకి తీసుకోవద్దు"

ఈ అంశంపై కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ స్పందిస్తూ, నియామకాల్లో స్థానికులను ఉద్దేశపూర్వకంగా పక్కనబెడితే సహించేది లేదని హెచ్చరించారు.

"కర్ణాటకలో కన్నడిగుడే సర్వాధికారి. ఎలాంటి పరిస్థితుల్లోనూ కన్నడిగుల హక్కులు, ఆత్మగౌరవాన్ని, అవకాశాలను కాలరాసేందుకు ప్రభుత్వం అంగీకరించదు" అని సీఎం ఘాటుగా వ్యాఖ్యానించారు. అదే సమయంలో, ప్రైవేట్ కంపెనీల వద్ద కన్నడ సంఘాలు నిరసనలు తెలుపడంపై సీఎం ఆందోళన వ్యక్తం చేశారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఊరుకునేది లేదని స్పష్టం చేశారు. "కన్నడ సంఘాలు ఐటీ కంపెనీలపై దాడులు చేయడం సరికాదు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవడం తగదు. ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం ఈ సమస్యలను పరిష్కరిస్తాయి. ఏవైనా ఫిర్యాదులు ఉంటే ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలి" అని సీఎం సూచించారు.

50 శాతం రిజర్వేషన్ బిల్లు ఏమైంది?

స్థానిక సంఘాల నుంచి తీవ్ర ఒత్తిడి రావడంతో 2024లో కర్ణాటక ప్రభుత్వం ప్రైవేట్ రంగంలో స్థానికులకు 50 శాతం ఉద్యోగ రిజర్వేషన్లు కల్పించే ప్రతిపాదనను తెచ్చింది. అయితే, నాస్కామ్ సహా పలు పరిశ్రమల సమాఖ్యలు, ఐటీ దిగ్గజాలు ఈ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకించడంతో ఆ ప్రతిపాదనను ప్రభుత్వం తాత్కాలికంగా పక్కనబెట్టింది. ప్రస్తుతం కేఆర్‌వీ చేపట్టిన ఈ కొత్త ప్రచారంతో ప్రైవేట్ ఉద్యోగాల్లో స్థానికుల ప్రాతినిధ్యం అంశం మళ్లీ తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

వెంటనే రీ-అప్‌లోడ్ చేయాలి

- దియా మీర్జా వీడియో తొలగింపుపై

- బాంబే హైకోర్టు తీవ్ర ఆగ్రహం



బాలీవుడ్ నటి దియా మీర్జా దీపావళి వీడియో తొలగింపుపై బాంబే హైకోర్టు తీవ్రంగా స్పందించింది. తక్షణమే వీడియోను మళ్లీ అప్‌లోడ్ చేయాలని బృహన్ ముంబయి మున్సిపల్ కార్పొరేషన్ (బీఎంసీ)ను ఆదేశించింది. ఈ సందర్భంగా భారత్ ఒక లౌకిక దేశమని నొక్కిచెప్పిన బాంబే హైకోర్టు... దియా మీర్జాకు వ్యతిరేకంగా రాజకీయ నాయకులు చేసిన వ్యాఖ్యలపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. అంతేకాకుండా, పర్యావరణ హితంగా దీపావళిని జరుపుకోవాలని నటి చేసిన విజ్ఞప్తిలో తప్పేముందని వ్యాఖ్యానించింది.

బృహన్ ముంబయి మున్సిపల్ కార్పొరేషన్ కోసం రూపొందించిన వీడియోలో.. హైకోర్టు ఉత్తర్వులను దియా ఉటంకిస్తూ బహిరంగ ప్రదేశాల్లో బాణసంచా కాల్చవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. వీడియో డిలీట్ చేయడం 'దురదృష్టకరం' అని హైకోర్టు వ్యాఖ్యానించింది. ''మన దేశంలో జరుపుకునే ఏ పండుగ నుంచీ ఏ వ్యక్తిని దూరం చేయరాదు.. పండుగను అందరూ జరుపుకోవాలని సుప్రీంకోర్టు వెల్లడించిన స్ఫూర్తికి అనుగుణంగా, కార్పొరేషన్ సోషల్ మీడియా నుంచి తొలగించిన ఏ సెలబ్రిటీ శుభాకాంక్షల సందేశాన్ని తిరిగి అప్‌లోడ్ చేయడం సముచితంగా ఉంటుంది'' అని కోర్టు పేర్కొంది.

వీడియో డిలీట్ అంశంపై సుమోటోగా విచారణ చేపట్టిన బాంబే హైకోర్టు.. 'ప్రజా ప్రయోజనాల కోసం పాల్గొని సహకరించిన సెలబ్రిటీలపై కొందరు చేసిన వ్యాఖ్యలు మమ్మల్ని తీవ్రంగా కలచివేశాయి' అని తెలిపింది. ''నిన్న జరిగిన ఈ సంఘటన దురదృష్టకరం... కోర్టు ఉత్తర్వుల తీవ్రతను గానీ, ప్రజల్లో అవగాహన పెంచడం ద్వారా సాధించాలనుకున్న ముఖ్య ఉద్దేశాన్ని గానీ పరిగణనలోకి తీసుకోకుండా ఈ చర్య జరిగింది'' అని కోర్టు పేర్కొంది.

దియా మీర్జా వీడియోను బీఎంసీ తొలగించిన కొద్ది గంటలకే, దీపావళి సమయంలో పర్యావరణహిత వేడుకలు జరుపుకోవాలని చేసిన విజ్ఞప్తులను 'తుక్డే తుక్డే గ్యాంగ్'తో ముడిపెడుతూ ముంబయి బీజేపీ విభాగం అధ్యక్షుడు అమిత్ సతమ్ విమర్శలు చేశారు. హిందువులు పండుగలను ఎలా జరుపుకోవాలో నియంత్రించేందుకు భారత్ వ్యతిరేక శక్తులు ప్రయత్నిస్తున్నాయని సతమ్ ఆరోపించారు.

''గడిచిన 5,000 సంవత్సరాలుగా దీపావళి జరుపుకుంటున్నాం, రాబోయే వేల సంవత్సరాలు కూడా జరుపుకుంటూనే ఉంటాం. దీనిని ఎలా జరుపుకోవాలో మేము ఎవరి నుంచో నేర్చుకోవాల్సిన అవసరం లేదు. 'తుక్డే తుక్డే గ్యాంగ్' సభ్యులు, భారత్ వ్యతిరేక శక్తులు మాకు దీపావళి ఎలా జరుపుకోవాలో నేర్పించాల్సిన పనిలేదు'' అని సతమ్ అన్నారు. ఆయన అభ్యంతరం తెలిపిన కొద్దిసేపటికే బీఎంసీ సోషల్ మీడియా అకౌంట్ నుంచి దియా మీర్జా వీడియోను తొలగించారు. ఎటువంటి అధికారిక వివరణ కూడా బీఎంసీ ఇవ్వకపోవడం గమనార్హం. అయితే, దీపావళికి సంబంధించి మాధురీ దీక్షిత్, అజింక్య రహానే వీడియోలను మాత్రం అలాగే కొనసాగించారు.

లాయర్స్ వర్సెస్ కాప్స్
రోడ్డెక్కిన 150 మంది పోలీసులు

- ఏసీపీ మనస్వి వశిష్ఠపై సస్పెన్షన్ వేటు



ఢిల్లీ పోలీసు ప్రధాన కార్యాలయం బయట ఇటీవల జరిగిన అరుదైన నిరసనకు నాయకత్వం వహించిన అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ మనస్వి వశిష్ఠను సస్పెండ్ చేశారు. అక్టోబర్ 23న షాదరా పోలీస్ స్టేషన్‌లో న్యాయవాదులకు, పోలీసులకు మధ్య జరిగిన ఘర్షణ తర్వాత తనపై, తోటి అధికారిపై తీసుకున్న శాఖాపరమైన చర్యలను నిరసిస్తూ ఆయన ఈ ఆందోళనకు దిగారు. షాదరా పోలీస్ స్టేషన్ ఘటన తర్వాత ఏసీపీ మనస్వి వశిష్ఠ, ఆ స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఇన్‌స్పెక్టర్ అరుణ్ కుమార్‌లను వేరే ప్రాంతాలకు బదిలీ చేశారు. దీన్ని వ్యతిరేకిస్తూ మహిళా అధికారులు సహా సుమారు 150 మంది ఢిల్లీ పోలీసులు సోమవారం నాడు ఢిల్లీ పోలీసు హెడ్‌క్వార్టర్స్ బయట వినూత్న రీతిలో నిరసన చేపట్టారు. ఏసీపీ వశిష్ఠ, ఇన్‌స్పెక్టర్ అరుణ్ కుమార్‌లను మళ్లీ వారి పాత పోస్టులకే కేటాయించాలని ఆందోళనకారులు డిమాండ్ చేశారు.

ఈ నిరసనలో భాగంగా పోలీసుల బృందం పోలీసు కమిషనర్ అనురాగ్ కుమార్‌ను కలిసి ఐదు ప్రధాన డిమాండ్లతో వినతిపత్రం సమర్పించింది. షాదరా ఘటనలో ప్రమేయం ఉన్న న్యాయవాదులపై చర్యలు తీసుకోవాలని, అలాగే రౌడీయిజానికి పాల్పడే లాయర్లపై ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయాలని ఆ డిమాండ్లలో కోరారు. పోలీసుల మనోధైర్యాన్ని దెబ్బతీయకుండా సత్వర తగిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ ఈ సందర్భంగా వారికి హామీ ఇచ్చారు. నిరసనకారులు "వర్దీ కా అప్మాన్ నహీ సహేంగే" (యూనిఫాం అవమానాన్ని సహించబోం) అంటూ ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేశారు. ప్రధాన కార్యాలయం 1వ గేట్ వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడంతో న్యూఢిల్లీ డీసీపీ సచిన్ శర్మ అక్కడికి చేరుకుని పోలీసులను సముదాయించే ప్రయత్నం చేశారు. కొందరిని లోపలికి రావాల్సిందిగా కోరినా వారు తిరస్కరించి, పోలీసు కమిషనర్‌తో నేరుగా 'సంపర్క్ సభ' నిర్వహించాలని పట్టుబట్టడంతో చివరకు అదే విధంగా సమావేశం జరిగింది.

ఈ నిరసనకు సంబంధించిన పిలుపును ఢిల్లీ పోలీసుల వాట్సాప్ గ్రూపుల ద్వారానే సర్క్యులేట్ చేసినట్లు పీటీఐ వార్తా సంస్థ తెలిపింది. తమ సిబ్బంది ఎవరూ ఈ నిరసనలో పాల్గొనకుండా చూడాలని జిల్లా డీసీపీలు, యూనిట్ హెడ్‌స్‌కు ముందే ఆదేశాలు జారీ అయినప్పటికీ, ఇది పూర్తిగా పోలీసు సిబ్బందీ స్వచ్ఛందంగా ఇచ్చిన పిలుపేనని, తాను కేవలం వారిలో భాగస్వామి నయ్యానని ఏసీపీ వశిష్ఠ మీడియాతో చెప్పారు. ఇక, అక్టోబర్ 23న షాదరా పోలీస్ స్టేషన్‌లో పోలీసులు, లాయర్ల మధ్య జరిగిన తోపులాటలో అడ్వకేట్ లలిత్ బన్సల్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటనపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ స్థానిక న్యాయవాదులు పోలీస్ స్టేషన్‌ను ముట్టడించారు. పోలీసులు తమను బెదిరించారని, దురుసుగా ప్రవర్తించారంటూ లాయర్లు ఆరోపించారు. ఈ ఉద్రిక్తతలను తగ్గించేందుకు ఢిల్లీలోని అన్ని జిల్లా కోర్టుల బార్ అసోసియేషన్ల సమన్వయ కమిటీ నిరసనగా నిరవధిక సమ్మెకు పిలుపునిచ్చింది. ఈ వివాదానికి తెరదించే ప్రయత్నంలో భాగంగానే పోలీసు యంత్రాంగం ఏసీపీ వశిష్ఠను, ఇన్‌స్పెక్టర్ అరుణ్ కుమార్‌లను బదిలీ చేసింది. షాదరా బార్ అసోసియేషన్ దాఖలు చేసిన ఎఫ్ఐఆర్‌లు, ఫిర్యాదులపై రెండు నెలల్లో దర్యాప్తు జరుపుతామని హామీ ఇవ్వడంతో న్యాయవాదులు తమ సమ్మెను విరమించుకున్నారు.

లేఆఫ్స్ బాటలో డిస్నీ.. నెట్‌ఫ్లిక్స్

- అమెజాన్ పోటీ తట్టుకోలేక కీలక నిర్ణయం

డిస్నీ సంస్థ తన వార్షిక ఖర్చుల్లో 20 శాతం పొదుపు సాధించడమే లక్ష్యంగా వేలాది ఉద్యోగాల్లో కోతలు విధించడంతో పాటు ఇతర వ్యయాలను తగ్గించుకోవడానికి సిద్ధమవుతోంది. సాంప్రదాయ టెలివిజన్ విభాగం నుంచి వచ్చే ఆదాయం గణనీయంగా పడిపోవడం, ఆన్‌లైన్ స్ట్రీమింగ్ చందాదారుల పెరుగుదల మందగించడమే ఈ నిర్ణయానికి ప్రధాన కారణం. బ్లూమ్‌బెర్గ్ నివేదిక ప్రకారం.. సంస్థ నిర్దేశించుకున్న ఈ పొదుపు లక్ష్యం వల్ల డిస్నీకి చెందిన థీమ్ పార్కులు, టెలివిజన్ ఛానెళ్లు, ఫిలిం స్టూడియోలపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉంది. ప్రపంచవ్యాప్తంగా దాదాపు 2,31,000 మంది ఉద్యోగులు కలిగిన ఈ వినోద దిగ్గజ సంస్థ, గతంలో కూడా ఖర్చులను తగ్గించుకోవడంలో భాగంగా ఏబీసీ, పిక్సార్, ఈఎస్‌పీఎన్, ఇతర అనుబంధ విభాగాలలో వేలాది మందిని ఉద్యోగాల నుంచి తొలగించింది.

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వాటాదారులకు ప్రతి షేరుపై వచ్చే సర్దుబాటు ఆదాయంలో రెండంకెల వృద్ధిని అందిస్తామని డిస్నీ హామీ ఇచ్చింది. ఈ క్రమంలోనే సంస్థ ముఖ్య కార్యనిర్వాహక అధికారి జోష్ డి'అమారో పొదుపు ద్వారా లభించే నిధులలో కొంత భాగాన్ని సినిమాలు, టీవీ కార్యక్రమాలు, సాంకేతిక, థీమ్ పార్కులు, క్రూజ్ షిప్ వ్యాపార విస్తరణలో తిరిగి పెట్టుబడి పెట్టాలని ప్రణాళికలు రచిస్తున్నారు. ఉద్యోగుల తొలగింపు ప్రతిపాదనలపై స్పందించడానికి డిస్నీ ప్రతినిధులు నిరాకరించినప్పటికీ, సంస్థ అంతర్గత పునర్నిర్మాణ చర్యలు ఇప్పటికే వేగవంతమయ్యాయి.

కేవలం డిస్నీ మాత్రమే కాకుండా వినోద రంగానికి చెందిన నెట్‌ఫ్లిక్స్, సోనీ పిక్చర్స్, పారామౌంట్, వార్నర్ బ్రదర్స్ వంటి ఇతర దిగ్గజ సంస్థలు కూడా మార్కెట్ ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. ఒకవైపు సాంప్రదాయ టీవీల మార్కెట్ పడిపోవడం, మరోవైపు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లు, అమెజాన్, యాపిల్ వంటి దిగ్గజ టెక్ కంపెనీల నుంచి డిజిటల్ రంగంలో గట్టి పోటీ ఎదురవుతుండటంతో ఈ సంస్థలన్నీ ఖర్చుల నియంత్రణ బాట పట్టాయి. ప్రస్తుత మారుతున్న సాంకేతిక యుగంలో ముందుకు సాగాలంటే వ్యాపార పరిమాణాన్ని, నిర్వహణ నిర్మాణాన్ని ఎప్పటికప్పుడు సమీక్షించుకోవడం చాలా అవసరమని డిస్నీ ప్రతినిధులు అభిప్రాయపడుతున్నారు. ఉద్యోగాల కోత, వ్యయాల తగ్గింపు చర్యలతో వ్యాపారాన్ని మళ్లీ లాభాల బాట పట్టించి, కొత్త రంగాల్లో విస్తరించాలని డిస్నీ భావిస్తోంది.

ముకేశ్ అంబానీ మళ్లీ ఆసియాలోనే
అత్యంత ధనవంతుడు

- ఆసియాలో ధనవంతుల జాబితా విడుదల

- ప్రపంచ కుబేరుల్లో భారీ మార్పులు..!

- ప్రపంచంలోనే అత్యంత ధనవంతుడిగా మస్క్

- అమెజాన్ వ్యవస్థాపకుడు జెఫ్ బెజోస్ రెండో స్థానంలో

ముకేశ్ అంబానీ మళ్లీ ఆసియాలోనే అత్యంత ధనవంతుడిగా తన అగ్రస్థానాన్ని కైవసం చేసుకున్నారు. రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత అయిన అంబానీ సంపద ఒక్కసారిగా 8 బిలియన్ డాలర్లు (దాదాపు 10.02 శాతం) పెరగడంతో ఆయన మొత్తం నికర ఆస్తి విలువ 88.3 బిలియన్ డాలర్లకు చేరుకుంది. ఫోర్బ్స్ రియల్ టైమ్ బిలియనీర్ల జాబితా ప్రకారం ఈ వివరాలు వెల్లడయ్యాయి. జియో ప్లాట్‌ఫామ్స్ లిస్టింగ్ తర్వాత రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్లు భారీగా లాభపడ్డాయి. 2020 సంవత్సరం తర్వాత ఒకే రోజులో రిలయన్స్ షేర్లు సాధించిన అతిపెద్ద సింగిల్ డే గెయిన్ ఇదే కావడం విశేషం. ఈ అద్భుతమైన ర్యాలీతో అంబానీ ఒక్క రోజులోనే ప్రపంచంలోనే అత్యధికంగా సంపద పెంచుకున్న రెండో వ్యక్తిగా నిలిచారు.

ఇక, ప్రస్తుతం అంబానీ కంటే వెనుకబడిన బైట్‌డ్యాన్స్ వ్యవస్థాపకుడు జంగ్ యిమింగ్ 84 బిలియన్ డాలర్ల ఆస్తితో తదుపరి స్థానంలో ఉండగా, అదానీ గ్రూప్ ఛైర్మన్ గౌతమ్ అదానీ 79.1 బిలియన్ డాలర్ల సంపదతో ఆసియాలో మూడో స్థానంలో కొనసాగుతున్నారు. తాజా ర్యాంకింగ్స్ ప్రకారం జంగ్ యిమింగ్ కంటే అంబానీ 4.3 బిలియన్ డాలర్లు, అదానీ కంటే 9.2 బిలియన్ డాలర్ల ఆధిక్యంలో ఉన్నారు. మరోవైపు, ప్రపంచ స్థాయి బిలియనీర్ల విషయానికి వస్తే.. టెస్లా, స్పేస్ ఎక్స్ అధినేత ఎలాన్ మస్క్ ఏకంగా 878.5 బిలియన్ డాలర్ల అంచనా ఆస్తితో ప్రపంచంలోనే అత్యంత ధనవంతుడిగా తన అగ్రస్థానాన్ని నిలబెట్టుకున్నారు. అమెజాన్ వ్యవస్థాపకుడు జెఫ్ బెజోస్ 366 బిలియన్ డాలర్లతో రెండో స్థానంలో నిలవగా, గూగుల్ లారీ పేజ్ 232.3 బిలియన్ డాలర్లతో మూడో స్థానంలో ఉన్నారు. డెల్ టెక్నాలజీస్ వ్యవస్థాపకుడు మైఖేల్ డెల్ 218.5 బిలియన్ డాలర్లతో నాలుగో స్థానంలో, గూగుల్ సెర్గీ బ్రిన్ 213.9 బిలియన్ డాలర్లతో ఐదో స్థానంలో కొనసాగుతున్నారు.

అలాగే మెటా సీఈఓ మార్క్ జుకర్‌బర్గ్ 208.6 బిలియన్ డాలర్లతో ఆరో స్థానం, ఎన్విడియా అధినేత జెన్సన్ హువాంగ్ 175.3 బిలియన్ డాలర్లతో ఏడో స్థానం, ఒరాకిల్ సహ వ్యవస్థాపకుడు లారీ ఎల్లిసన్ 159.7 బిలియన్ డాలర్ల సంపదతో ఎనిమిదో స్థానంలో నిలిచారు. ఒక్క రోజులోనే అత్యధిక సంపద పెంచుకున్న వారి జాబితాలో ఎలాన్ మస్క్ మొదటి స్థానంలో నిలిచారు. ఆయన సంపద 10 బిలియన్ డాలర్లు (1.15 శాతం) పెరిగింది. ఆ తర్వాత స్థానంలో ముకేశ్ అంబానీ 8 బిలియన్ డాలర్లు పెంచుకుని నిలవగా, జెఫ్ బెజోస్ 4.7 బిలియన్ డాలర్లు (1.29 శాతం) జోడించి మూడో స్థానంలో నిలిచారు. రోబ్ వాల్టన్, ఫ్యామిలీ, జిమ్ వాల్టన్, ఫ్యామిలీ కూడా చెరో 3.8 బిలియన్ డాలర్ల సంపదను పెంచుకుని ఈ జాబితాలో నిలిచారు. వీరి ఆస్తులు వరుసగా 2.58 శాతం మరియు 2.63 శాతం మేర పెరిగాయి.

ఒకవైపు అంబానీ సహా కొందరు బిలియనీర్లు లాభాల్లో దూసుకుపోతే, ఒరాకిల్ సహ వ్యవస్థాపకుడు లారీ ఎల్లిసన్ తీవ్ర నష్టాన్ని చవిచూశారు. ఒక్క రోజులోనే ఆయన ఆస్తి 11.9 బిలియన్ డాలర్లు (6.91 శాతం) పడిపోవడంతో ఆ రోజు అత్యధికంగా సంపద కోల్పోయిన వారిలో మొదటి స్థానంలో నిలిచారు. మైఖేల్ డెల్ నికర ఆస్తి 9.9 బిలియన్ డాలర్లు (4.34 శాతం) తగ్గి రెండో అతిపెద్ద నష్టపోయిన వ్యక్తిగా మారారు. మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు స్టీవ్ బాల్మర్ 3.7 బిలియన్ డాలర్లు (2.31 శాతం), చెన్ తియాన్‌షి 2.9 బిలియన్ డాలర్లు (12.15 శాతం) నష్టపోగా, మార్క్ జుకర్‌బర్గ్ సంపద 2.8 బిలియన్ డాలర్లు (1.32 శాతం) తగ్గింది. స్టాక్ మార్కెట్లలో వచ్చే హెచ్చుతగ్గులు బిలియనీర్ల ఆస్తులపై ఎంతటి తీవ్ర ప్రభావాన్ని చూపుతాయో ఈ తాజా మార్పులు స్పష్టంగా తెలియజేస్తున్నాయి.

శ్రీకృష్ణుడిపై వివాదాస్పద వ్యాఖ్యలు

- బహిరంగంగా క్షమాపణలు కోరిన..

- బాబా బాఘేశ్వర్ ధీరేంద్ర శాస్త్రి!

- దేవుళ్ల వ్యాఖ్యలపై ధీరేంద్ర శాస్త్రి క్షమాపణలు

- వీడియోను తప్పుగా అర్థం చేసుకున్నారంటూ వివరణ

- శాస్త్రి వ్యాఖ్యలను ఖండించిన అఖిలేష్ యాదవ్



మధ్యప్రదేశ్‌లోని ఛతర్‌పూర్ జిల్లా బాగేశ్వర్ ధామ్ పీఠాధిపతి, ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త ధీరేంద్ర కృష్ణ శాస్త్రి అలియాస్ బాగేశ్వర్ బాబా ఇటీవల శ్రీ రాముడు, శ్రీకృష్ణుడి స్వభావాలను పోలుస్తూ చేసిన వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా తీవ్ర రాజకీయ, ఆధ్యాత్మిక వివాదానికి దారితీశాయి. మధ్యప్రదేశ్‌లోని శివపురి జిల్లా కరేరా ప్రాంతంలో నిర్వహించిన రామ్‌కథా కార్యక్రమంలో ఆయన మాట్లాడుతుండగా చిత్రీకరించిన ఒక వీడియో క్లిప్ సోషల్ మీడియాలో విపరీతంగా ప్రచారంలోకి వచ్చింది. ఈ వీడియోలో ఆయన శ్రీరాముడిని ఎంతో నూటిగా, నిటారుగా ఉండే దేవుడిగా వర్ణిస్తూ.. శ్రీకృష్ణుడిని వంకర బుద్ధితో అంటే నటనాత్మక, కోపతాపాలతో కూడిన భావంతో అభివర్ణించారు. వేదికపై వేణువు వాయిస్తున్న వ్యక్తిని చూపిస్తూ.. వేణువు ఊదడం పెద్ద విషయమేమీ కాదని, ధనుస్సును ధరించడం మాత్రమే అసలైన బాధ్యత అని వ్యాఖ్యానించడం భక్తుల మనోభావాలను దెబ్బతినేలా చేసింది. అసలేం జరిగిందంటే..?

ఈ వివాదాస్పద వ్యాఖ్యల క్లిప్పింగ్స్ వెలుగులోకి రావడంతో హిందూ ధార్మిక వర్గాలు, రాజకీయ నేతల నుంచి తీవ్ర నిరసన వ్యక్తమైంది. సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్ ఈ అంశంపై తీవ్రంగా స్పందిస్తూ.. సనాతన ధర్మంలో అత్యంత పూజనీయులైన దేవుళ్ల మధ్య ఇలాంటి చౌకబారు పోలికలు తీసుకురావడం అత్యంత విచారకరమని, అభ్యంతరకరమని మండిపడ్డారు. ఇది హిందూ సమాజంలో విభజన తీసుకురావడానికి చేస్తున్న ప్రయత్నమని ఆరోపిస్తూ, ప్రవచనకర్తపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. భక్తుల నిరసనలు, రాజకీయ నేతల విమర్శలు వెల్లువెత్తడంతో తీవ్ర ఒత్తిడికి గురైన ధీరేంద్ర శాస్త్రి ఒక ప్రత్యేక వీడియో సందేశం ద్వారా తన స్పష్టతనిస్తూ క్షమాపణలు తెలిపారు.

భగవంతుడిపై ప్రేమపూర్వకమైన నిందలు వేసేవాళ్లు తన వివరణలో ధీరేంద్ర శాస్త్రి మాట్లాడుతూ.. పూర్తి వీడియోను చూడకుండా కేవలం ఒక చిన్న భాగాన్ని మాత్రమే చూసి ప్రజలు తప్పుగా అర్థం చేసుకున్నారని అన్నారు. తాను స్వయంగా శ్రీకృష్ణుడి పరమ భక్తుడినని, ప్రజభూమిలో జీవించడమే తన ఆకాంక్ష అని తెలిపారు. పూర్వకాలంలో గోపికలు లేదా పూర్వకవులు భగవంతుడిపై ప్రేమపూర్వకమైన నిందలు వేస్తూ రాసిన ఒక భక్తి గీతాన్ని వివరిస్తున్న సమయంలోనే ఆ ఉదాహరణ చెప్పానని స్పష్టం చేశారు. శ్రీరాముడు, శ్రీకృష్ణుడి మధ్య వ్యత్యాసాలు చూపించడం తన ఉద్దేశం కాదని, వేణువు వాయించడం ఆటపాటల రూపమని, ధనుస్సును పట్టుకోవడం ధర్మ రక్షణకు సంకేతమని ఒక సంతు చెప్పిన భావాన్ని మాత్రమే తాను వివరించానని తెలిపారు.

తాను ఎప్పుడూ శ్రీకృష్ణ జన్మభూమి కోసం ముందుండి పోరాడే వ్యక్తిగా ఉన్నానని, కృష్ణుడికి వ్యతిరేకం కాదని బాగేశ్వర్ బాబా పునరుద్ఘాటించారు. తన మాటల వల్ల లేదా భావాల వల్ల ఎవరి మనోభావాలైనా దెబ్బతిని ఉంటే.. వినయపూర్వకంగా క్షమాపణలు కోరుతున్నానని వ్యాఖ్యానించారు. ఈ వివరణతోనైనా వివాదానికి తెరపడుతుందో లేదో వేచి చూడాల్సి ఉంది.

ఫ్యాటీ లివర్ షుగర్ వ్యాధి ప్రమాదాన్ని ఎలా పెంచుతుంది? కారణాలు, లక్షణాలు తెలుసుకోండి



ఈ రోజుల్లో ఫ్యాటీ లివర్ సమస్య వేగంగా పెరుగుతుంది. ఇక, ఫ్యాటీ లివర్ డయాబెటిస్ ప్రమాదాన్ని పెంచుతుంది. ఇవి రెండూ ఒకే సమయంలో రావడానికి ప్రధాన కారణం ఇన్సులిన్ రెసిస్టెన్స్ . జీవనశైలిలో మార్పులు, వ్యాయామానికి దూరంగా ఉండటం, తిండి అలవాట్లు కారణంగా యువత కూడా ఫ్యాటీ లివర్‌తో పాటు డయాబెటిస్ బారిన పడుతున్నారు. ఫ్యాటీ లివర్ డయాబెటిస్ ప్రమాదాన్ని ఎలా పెంచుతుంది, లక్షణాలు, పాటించాల్సిన జాగ్రత్తలు గురించి డాక్టర్ నుంచి మనం తెలుసుకుందాం.



ఫ్యాటీ లివర్, డయాబెటిస్ మధ్య లింకేంటి?

మన శరీరం ఇన్సులిన్‌ను సరిగ్గా ఉపయోగించుకోలేనప్పుడు.. రక్తంలో షుగర్ లెవల్స్ పెరుగుతాయి. అప్పుడు శరీరం ఆ అదనపు చక్కెరను కొవ్వుగా మార్చి కాలేయంలో నిల్వ చేస్తుంది. కాలేయంలో ఈ కొవ్వు పేరుకుపోవడాన్నే ఫ్యాటీ లివర్ సమస్య అంటారు. ఇది పెరిగే కొద్దీ శరీరంలో ఇన్సులిన్ రెసిస్టెన్స్ ఇంకా ఎక్కువ అవుతుంది.

ఎలాంటి లక్షణాలు కనిపిస్తాయి?

ఫ్యాటీ లివర్ అనేది భవిష్యత్తులో డయాబెటిస్ రావడానికి ఒక మొదటి హెచ్చరిక లాంటిది. ఫ్యాటీ లివర్ డయాబెటిస్ ప్రమాదాన్ని పెంచినప్పుడు, కొన్ని లక్షణాలు కనిపించవచ్చు.

వాపు: కాలేయంలో కొవ్వు వల్ల కలిగే దీర్ఘకాలిక వాపు, కాలేయం పనితీరును దెబ్బతీస్తుంది. దీనివల్ల శరీరం గ్లూకోజ్, కొవ్వును నియంత్రించడంలో విఫలమవుతుంది. అంటే సామర్థ్యాన్ని కోల్పోతుంది.

అలసట, బలహీనత: ఎక్కువ శారీరక శ్రమ చేయకపోయినా అలసట, బలహీనత కనిపిస్తుంది. అంటే చిన్న చిన్న పనులకే అలసిపోవడం, నిద్రపోయినా బలహీనత ఉండటం వంటి లక్షణాలు కనిపిస్తాయి.

తరచుగా మూత్రవిసర్జన: రక్తంలో షుగర్ లెవల్స్ పెరగడం వల్ల దాహం ఎక్కువగా వేస్తుంది. అంతేకాకుండా తరచుగా మూత్రవిసర్జన కూడా అనుభవించవచ్చు.

ఇతర లక్షణాలు: ఉన్నట్టుండి బరువు పెరగడం, పొట్ట చుట్టూ కొవ్వు పేరుకుపోవడం ప్రమాదానికి సంకేతం. పొడి చర్మం, నెమ్మదిగా గాయాలు మానడం, తరచుగా ఇన్ఫెక్షన్లు రావడం కూడా లక్షణాలు.

ఫ్యాటీ లివర్‌కి కారణాలేంటి?

ప్రముఖ హెల్త్‌లైన్ నివేదిక ప్రకారం అనేక వ్యాధులు, ఆరోగ్య సమస్యలు నాన్-ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్ వ్యాధిప్రమాదాన్ని పెంచుతాయి. వాటిలో కొన్ని కింద గమనించవచ్చు.

అధిక కొలెస్ట్రాల్
ఇన్సులిన్ రెసిస్టెన్స్
జీవక్రియ సిండ్రోమ్
టైప్ - 2 డయాబెటిస్
హైపోపిట్యూటరిజం
గ్రోత్ హార్మోన్ లోపం
అబ్స్ట్రక్టివ్ స్లీప్ సిండ్రోమ్
రక్తంలో ట్రైగ్లిజరైడ్స్ అధిక స్థాయిలో ఉండటం
ఊబకాయం, ముఖ్యం బెల్లీ ఫ్యాట్
ఫ్యాటీ లివర్, ఊబకాయం కుటుంబ చరిత్ర
థైరాయిడ్ పనిచేయకపోవడం లేదా హైపోథైరాయిడిజం

ఇతర ప్రమాదాలు

ఫ్యాటీ లివర్ అనేది భవిష్యత్తులో డయాబెటిస్ రావడానికి అనేది ఓ ముందస్తు సంకేతం. ముఖ్యంగా టైప్ - 2 డయాబెటిస్‌కి కారణమవుతుంది. ఇక, ఈ మెటబాలిక్ సమస్యలు కేవలం షుగర్ వ్యాధితో ఆగకుండా గుండె జబ్బులు, ఇతర తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు కారణమవుతాయని డాక్టర్ హెచ్చరిస్తున్నారు.



ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

బరువు నియంత్రణ: ఊబకాయం వివిధ రకాల వ్యాధుల ప్రమాదాన్ని పెంచుతుంది. అందుకే బరువు నిర్వహణ చాలా ముఖ్యం. బరువును అదుపులో ఉంచకపోతే పరిస్థితులు అదుపు తప్పవచ్చు.

సరైన ఆహారం: చక్కెరలు, అనారోగ్యకరమైన కొవ్వు పదార్థాలకు దూరంగా ఉండాలి. ప్రాసెస్ చేసిన ఆహారాల్ని నివారించాలి.

వైద్య పరీక్షలు: క్రమం తప్పకుండా మెడికల్ చెకప్స్ చేయించుకోవడం వల్ల వ్యాధి ముదరకుండా కాపాడుకోవచ్చు.

పాటించాల్సిన ఆహార నియమాలు

ఫ్యాటీ లివర్, డయాబెటిస్‌ను కంట్రోల్‌లో ఉంచుకోవడానికి ప్రత్యేకమైన డైట్ అంటూ ఏం లేదు. అయితే, బరువు తగ్గించుకోవడంతో పాటు ఆహారంలో కొన్ని మార్పులు చేసుకుంటే కాలేయంపై భారం తగ్గించవచ్చని హెల్త్‌లైన్ నివేదిక చెబుతుంది. ఆ ఆహార మార్పులు ఏంటంటే..

చక్కెరను తగ్గించండి: సోడాలు, స్వీట్లు, కూల్ డ్రింక్స్, ప్యాక్ చేసిన జ్యూస్‌ల్ని నివారించడం చాలా ముఖ్యం. వీటిలో కృత్రిమ చక్కెరలు ఉంటాయి. ఇవి కాలేయంలో కొవ్వును వేగంగా పెంచుతాయి.

శుద్ధి చేసిన పిండి పదార్థాలకు నో చెప్పండి: మైదా, వైట్ రైస్, వైట్ బ్రెడ్ వంటి వాటిని తినడం తగ్గించండి.

తృణధాన్యాలు: జొన్నలు, రాగులు, సజ్జలు లేదా బ్రౌన్ రైస్ వంటి తృణధాన్యాల్ని మీ ఆహారంలో భాగం చేసుకోండి.

ఆరోగ్యకరమైన కొవ్వులు: బాగా వేయించిన ఆహారాలు తీసుకోవడం తగ్గించి బాదం, వాల్‌నట్స్, ఆలివ్ ఆయిల్ వంటి ఆరోగ్యకరమైన కొవ్వులు ఉన్న ఫుడ్స్‌ను తీసుకోండి.

ఫైబర్ తీసుకోండి: పండ్లు (మితంగా), ఆకుకూరలు, కూరగాయలు ఎక్కువగా తీసుకోవడం వల్ల రక్తంలో షుగర్ లెవల్స్ కంట్రోల్‌లో ఉంటాయి.

ప్రసవం తర్వాత జుట్టు ఎందుకు రాలుతుంది? కారణాలు



గర్భధారణ సమయంలో మహిళల శరీరంలో అనేక మార్పులు వస్తాయి. వాటి ప్రభావాలు ప్రసవం తర్వాత కూడా కనిపిస్తాయి. అలాంటి సమస్యల్లో జుట్టు రాలడం ఒకటి. ప్రసవం తర్వాత జుట్టు రాలడం అనేది చాలా మంది కొత్త తల్లుల్లో కనిపించే ఒక సాధారణ సమస్య. గర్భధారణ సమయంలో శరీరంలో ఈస్ట్రోజెన్ హార్మోన్ స్థాయిలు పెరుగుతాయని డాక్టర్ అంటారు. దీనివల్ల జుట్టు రాలడం తగ్గి, ఒత్తుగా కనిపిస్తుంది. కానీ ప్రసవం తర్వాత ఈ హార్మోన్ స్థాయిలు ఒక్కసారిగా అసమతుల్యతకు గురవుతాయి అంటే పడిపోతాయి. దీనివల్ల పెరుగుదల దశలో ఉన్న జుట్టు అంతా ఒక్కసారిగా రాలే దశకు చేరుకుంటుంది. సాధారణంగా ప్రసవం జరిగిన 2 నుంచి 3 నెలల తర్వాత ఈ సమస్య మొదలవుతుంది.



ప్రసవం తర్వాత జుట్టు రాలడం అనేది చాలా మంది కొత్త తల్లుల్లో కనిపించే ఒక సాధారణ సమస్య. దీనిని పోస్ట్‌పార్టమ్ హెయిర్ లాస్ అంటారు. డెలివరీ తర్వాత జుట్టు రాలడానికి అతిపెద్ద కారణం హార్మోన్ల మార్పులు. ప్రెగ్నెన్సీ సమయంలో ఈస్ట్రోజెన్ స్థాయిలు ఎక్కువగా ఉంటాయి. ఇది జుట్టును మందంగా, బలంగా ఉంచుతుంది. అదే డెలివరీ తర్వాత ఈస్ట్రోజెన్ స్థాయిలు వేగంగా పడిపోతాయి. ఈ హార్మోన్ల అసమతుల్యత జుట్టు మూలాల్ని బలహీనరుస్తుంది. జుట్టు రాలడానికి కారణమవుతుంది.

జుట్టు రాలడానికి ఇతర కారణాలు

పోషకాహార లోపం: ప్రెగ్నెన్సీ సమయంలో బరువు పెరుగుతారు. దీంతో బరువు తగ్గాలనే తొందరంలో డైట్ ఫాలో అవుతారు. దీంతో ఐరన్, ప్రోటీన్ వంటి పోషకాలు సరిగ్గా అందవు. దీంతో, జుట్టు రాలుతుంది.

ఒత్తిడి, నిద్రలేమి: కొత్తగా తల్లి అయినప్పుడు పెరిగే బాధ్యతలు, ఒత్తిడి కారణంగా జుట్టు రాలుతుంది. నవజాత శిశువును జాగ్రత్తగా చూసుకోవడం, రాత్రంతా మేల్కొని ఉండటం, శారీరక అలసట తల్లిని మానసికంగా క్షీణింపజేస్తాయి. దీంతో, జుట్టు రాలడం కనిపిస్తుంది.



జుట్టు రాలడాన్ని తగ్గించుకునే నివారణ చర్యలు

మానసిక ఆరోగ్యం: ప్రసవం తర్వాత ఎదురయ్యే ఒత్తిడిని తగ్గించుకోవాలి. ఇందుకోసం యోగా, ధ్యానం, లోతైన శ్వాస వ్యాయామాలు చేయడం ద్వారా ఒత్తిడిని తగ్గించుకోవాలి.

సరైన ఆహారం: తాజా పండ్లు, కూరగాయలు, తృణధాన్యాలు, ప్రోటీన్ ఎక్కువగా ఉండే ఆహారం తీసుకోవాలి. ఇది జుట్టు కుదుళ్లకు బలాన్ని ఇస్తుంది.

సహజ చిట్కాలు: ఉసిరి నూనె జుట్టు కుదుళ్లకు తగిన పోషణనిస్తుంది. ఇంటర్నేషనల్ జర్నల్ ఆఫ్ ఫార్మాసూటికల్ సైన్సెస్‌లో పబ్లిష్ అయిన జర్నల్‌లో మెంతుల్ని నానబెట్టి మెత్తగా చేసి జుట్టుకు పట్టించడం వల్ల కుదుళ్లు దృఢంగా మారుతాయి.

జుట్టు పెరుగుదలకు పోషకాహారం

జుట్టు లోపలి నుంచి దృఢంగా మారాలంటే కింది ఆహారాల్ని రోజువారీ డైట్‌లో చేర్చుకోవాలి.

ప్రోటీన్: జుట్టు ప్రధానం కెరాటిన్ అనే ప్రోటీన్‌తో నిర్మితమవుతుంది. అందుకే గుడ్లు, పప్పు ధాన్యాలు, సోయా, పనీర్ ఎక్కువగా తీసుకోండి.

ఐరన్: రక్తహీనత సమస్య వల్ల జుట్టు రాలడం పెరుగుతుంది. పాలకూర, బెల్లం, ఖర్జూరం, శనగలు, పెసలు, రాజ్మా వంటివి తీసుకోవడం వల్ల ఐరన్ పెరుగుతుంది. దీంతో, జుట్టు పెరుగుదల మెరగవుతుంది.

బయోటిన్, ఒమేగా - 3: బాదం, వాల్‌నట్స్, అవిసె గింజలు జుట్టుకు మంచి మెరుపును, బలాన్ని ఇస్తాయి.

విటమిన్ సి: సిరికాయ, నిమ్మరసం, జామకాయ వంటి విటమిన్ సి ఫుడ్స్ తినాలి. దీంతో, ఐరన్ శరీరానికి బాగా అందుతుంది.

కొన్ని ముఖ్యమైన జాగ్రత్తలు

తడి జుట్టును దువ్వకండి: జుట్టు తడిగా ఉన్నప్పుడు కుదుళ్లు సాధారణంగా బలహీనంగా ఉంటాయి. అప్పుడు దువ్వితే జట్టు ఎక్కువగా రాలుతుంది.

హీటింగ్ వద్దు: హెయిర్ డ్రైయర్లు, స్ట్రెయిటెనర్లు, కర్లర్స్ వంటి వేడిని ఉత్పత్తి చేసే పరికరాలను వాడటం తగ్గించండి.

నీళ్లు: రోజుకు కనీసం 3-4 లీటర్ల నీరు తాగండి. ఎందుకంటే జుట్టుకు తగినంత హైడ్రేషన్ ముఖ్యం.

ఓ మాతా రే.. మైసా రే

ఈ దసరాకి 'రణబాలి'తో ప్రేక్షకుల్ని పలకరించారు నటి రష్మిక. ఇప్పుడీ నవంబరులో 'మైసా'తో అలరించేందుకు సిద్ధమవుతున్నారు. ఆమె టైటిల్ పాత్రలో నటించిన ఈ పాన్ ఇండియా సినిమాని రవీంద్ర పుల్లె తెరకెక్కించారు. అన్‌ఫార్ములా ఫిల్మ్స్ సంస్థ నిర్మించింది. ఈశ్వరీ రావు, రావు రమేశ్, గురు సోమసుందరం తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమా ఈ నెల 27న విడుదల కానుంది. ఈ నేపథ్యంలోనే సోమవారం "ఓ మాతా రే.. మైసా రే.." అంటూ సాగిన ఈ చిత్ర తొలి గీతాన్ని విడుదల చేశారు. జేక్స్ బిజోయ్ స్వరపరిచిన ఈ గీతానికి సుద్దాల అశోక్ తేజ సాహిత్యమందించగా.. సింధూజ శ్రీనివాసన్ ఆలపించారు. బృందా మాస్టర్ నృత్యరీతులు సమకూర్చారు. ఈ పాటలో రష్మిక కనిపించిన తీరు.. ఆమె వేసిన ఆవేశభరితమైన స్టెప్పులు ఆకర్షణగా నిలిచాయి. ఈ సినిమాలో తను శక్తిమంతమైన గిరిజన గోండు యువతిగా కనిపించనున్నారు.



టైగర్ ష్రాఫ్‌పై కాల్పుల కేసు..

యువతి అరెస్ట్

బాలీవుడ్ నటుడు టైగర్ ష్రాఫ్ కారుపై కాల్పుల ఘటన కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసుకు సంబంధించి ముంబయి క్రైమ్ బ్రాంచ్ పోలీసులు హరియాణాలోని కర్నాల్‌కు చెందిన 22 ఏళ్ల యువతిని అరెస్టు చేశారు. దీంతో ఇప్పటివరకు అరెస్టయిన వారి సంఖ్య 13కు చేరింది. అరెస్టయిన యువతిని సుభేహా పండిట్‌గా గుర్తించారు. ఈ కేసులో ఇప్పటికే అరెస్టయిన రాధ, బబిత తర్వాత నిందితుల జాబితాలో చేరిన మూడో మహిళ ఈమె. గతంలో అరెస్టయిన ఇద్దరు మహిళలు నిందితులకు ఆయుధాలు సరఫరా చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. నేర కార్యకలాపాల్లో సుభేహా పండిట్ కూడా భాగస్వామిగా ఉన్నట్లు క్రైమ్ బ్రాంచ్ దర్యాప్తులో గుర్తించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో నవంబర్ 1న హరియాణా పోలీసుల సహకారంతో కర్నాల్‌లో ఆమెను అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు. ఈ కేసులో మరిన్ని వివరాల కోసం దర్యాప్తు కొనసాగిస్తున్నారు.



డేర్ డెవిల్‌లో శ్రీలీల

వైవిధ్యమైన కథలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చేస్తూ... వరుస చిత్రాలతో అలరించేందుకు సిద్ధమవుతున్నారు కథానాయిక శ్రీలీల. తాజాగా ఆమె ఖాతాలో మరో తమిళ ప్రాజెక్ట్ చేరింది. అగ్ర కథానాయకుడు అజిత్ కుమార్ ముఖ్య పాత్రధారిగా తెరకెక్కుతున్న 'డేర్ డెవిల్' సినిమాలో ఆమె కథానాయికగా నటించనున్నారు. ఎప్పట్నుంచో ప్రచారంలో ఉన్న ఈ చిత్రం ఎట్టకేలకు చిత్రీకరణ ప్రారంభించుకుంది. సోమవారం ఈ సినిమాని అధికారికంగా ప్రారంభించినట్లు చిత్రబృందం సామాజిక మాధ్యమాల వేదికగా వెల్లడించింది. 'గుడ్ బ్యాడ్ అగ్లీ' హిట్ తర్వాత అజిత్.. దర్శకుడు అధిక్ రవిచంద్రన్‌ల కలయికలో వస్తోన్న చిత్రమిది. ఇందులో ఉన్ని ముకుందన్, పార్థిబన్, సునీల్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమాని అజిత్ భార్య శాలిని అజిత్ కుమార్ బ్రేవ్‌హార్ట్స్ ప్రొడక్షన్ బ్యానర్‌పై నిర్మిస్తున్నారు.



ఎప్పటికీ ఇలాగే యవ్వనంగా ఉండాలి

ప్రముఖ బాలీవుడ్ నటుడు షారుక్ ఖాన్ 61వ పుట్టినరోజు సందర్భంగా సినీ ప్రముఖులు ఆయనకు సోషల్ మీడియా వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. స్నేహితులు, సహనటులు, సినీ పరిశ్రమకు చెందిన పలువురు తమదైన శైలిలో విషెస్ చెప్పారు. ఈ క్రమంలో షారుక్ ధన్యవాదాలు తెలిపిన వీడియో నెట్టింట వైరల్‌గా మారింది.

"హ్యాపీ బర్త్‌డే షారుఖ్.. మీరు ఎల్లప్పుడూ సంతోషంగా, ఇలాగే యవ్వనంగా ఉండాలి కింగ్. ఇదే నా కోరిక" - సల్మాన్ ఖాన్

"పుట్టినరోజు శుభాకాంక్షలు కింగ్. మీతో కలిసి డ్యాన్స్ చేసే ఆ రోజు కోసం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను" - కరీనా కపూర్ "నా మిత్రుడు, సహ నటుడు, వ్యాపార భాగస్వామి షారుక్‌కి.. జన్మదిన శుభాకాంక్షలు. ప్రపంచానికి నువ్వు కింగ్‌వి. అయినా ఎంతో సాధారణంగా ఉంటావు. ఇన్నేళ్ల ఈ స్నేహంలో.. మీతో చాలా జ్ఞాపకాలు ఉన్నాయి. మా ప్రేమాభిమానాలు మీకు ఎప్పుడూ ఉంటాయి" - జుహి చావ్లా "ఫొటోతో పాటు.. స్నేహం కూడా పాతదే. పుట్టినరోజు శుభాకాంక్షలు షారుక్" - అజయ్ దేవ్‌గణ్ "భాయ్.. మా అందరి హృదయాల్లో ఎప్పటికీ నువ్వే కింగ్‌వి. నవ్వులు, ప్రేమతో నీ పుట్టినరోజు ఆనందంగా సాగాలి. 'కింగ్' బ్లాక్‌బస్టర్ కావడం ఖాయం. డిసెంబర్ 24న థియేటర్లలో ఆ మ్యాజిక్ చూసేందుకు ఎదురుచూస్తున్నా. లవ్ యు.." - రితేశ్ దేశ్‌ముఖ్

నా వ్యాఖ్యల్ని వక్రీకరించారు అమితాబ్ బచ్చన్

చిత్ర పరిశ్రమలో బ్లాగ్ ద్వారా పాత సినీ జ్ఞాపకాలు, రోజువారి సంగతుల్ని అభిమానులతో పంచుకునే వారిలో ముందు వరుసలో ఉంటారు బాలీవుడ్ అగ్రనటుడు అమితాబ్ బచ్చన్. సోమవారం ఆయన ఓ మీడియా సంస్థపై ఎక్స్ వేదికగా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను శ్రీకృష్ణుణ్ని కీర్తిస్తూ చేసిన ఓ పోస్టును వక్రీకరించి, యుద్ధ హెచ్చరికగా చిత్రీకరించారంటూ మండిపడ్డారు. దీంతో అమితాబ్ ఆ మీడియా సంస్థ శ్రీకృష్ణుడి కీర్తనను అవమానించడమే కాదు, ఆ వ్యాఖ్యలను వక్రీకరించి తాను ప్రత్యర్థులను హెచ్చరిస్తున్నట్లుగా చిత్రీకరించారని ఓ పోస్టు పెట్టారు.



యూరప్ టూర్‌కు నో ఫండింగ్.. సొంత డబ్బులతో ఆడిన షట్లర్లు..!

యూరోపియన్ బ్యాడ్మింటన్ టూర్‌లో భారత షట్లర్లు మెరుగైన ప్రదర్శన చేశారు. స్టార్ ఆటగాళ్లు పీవీ సింధు, లక్ష్య సేన్ పతకాలు సాధించి సత్తా చాటారు. అయితే, ఈ టూర్‌కు సంబంధించి తాజాగా వెలుగులోకి వచ్చిన ఓ కీలక విషయం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఐరోపా టూర్‌లో పాల్గొనేందుకు మన బ్యాడ్మింటన్ ప్లేయర్ల కు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా నిధులు విడుదల చేయలేదని సమాచారం. ఈ మేరకు పలు జాతీయ మీడియాలు కథనాలు వెల్లడించాయి.

ఈ టూర్‌లో భాగంగా భారత బృందం ఫిన్‌లాండ్, డెన్మార్క్, ఫ్రాన్స్, జర్మనీ టోర్నమెంట్లలో పాల్గొంది. అయితే, ఈ గేమ్స్ కోసం సాయ్ నుంచి ఆటగాళ్లకు ఎలాంటి ఫండింగ్ రాలేదట. అక్టోబరు 6న జరిగిన ఆర్కిటిక్ ఓపెన్‌కు కొన్ని రోజుల ముందు స్పోర్ట్స్ అథారిటీ తమ నిర్ణయాన్ని ఆటగాళ్లకు తెలియజేసినట్లు సదరు కథనాలు పేర్కొన్నాయి. దీంతో ప్రత్యామ్నాయ మార్గాలు వెతుక్కునే సమయం లేక షట్లర్లు ఇబ్బంది పడినట్లు సమాచారం.



ఫలితంగా ఆటగాళ్లు తమ సొంత ఖర్చులతో ఈ టోర్నీలో పోటీపడాల్సి వచ్చినట్లు తెలిసింది.

ఫిన్‌లాండ్‌లో జరిగిన ఓపెనింగ్ టోర్నమెంట్‌కు వసతి సౌకర్యాలను బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (BAI) చూసుకుంది. మిగతా ఈవెంట్లకు మాత్రం చేతులెత్తేయడంతో ప్రయాణ, వసతి, ఆహార ఖర్చులను ఆటగాళ్లే భరించినట్లు ఆ కథనాలు పేర్కొన్నాయి. ప్రయాణ ఖర్చులు భరించలేక కొందరు ఆటగాళ్లు తమ కోచ్‌లను వెంట తీసుకెళ్లలేకపోయారని సమాచారం. అష్మిత చలీహా, తన్వి శర్మ.. తమ కోచ్‌లు లేకుండానే పోటీల్లో పాల్గొన్నట్లు తెలుస్తోంది.

నిధుల కట్.. అందుకేనా?

ఇటీవల జపాన్ వేదికగా జరిగిన ఆసియా గేమ్స్‌లో భారత బ్యాడ్మింటన్ బృందం తీవ్రంగా నిరాశపర్చిన సంగతి తెలిసిందే. కనీసం ఒక్క విభాగంలోనూ పతకం దక్కలేదు. ఈ టోర్నీలో భారత్‌కు మెడల్ రాకపోవడం 2014 తర్వాత ఇదే తొలిసారి. దీంతో షట్లర్ల ప్రదర్శనపై సాయ్ అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. ఆ కారణంగానే తాజా టోర్నీకి నిధులు ఇవ్వలేదనే ఊహాగానాలు వినిపించాయి. అయితే, ఈ వార్తలను సాయ్ అధికారులు తోసిపుచ్చారని తాజా కథనాలు పేర్కొన్నాయి.

"సాధారణంగా టోర్నీకి 30 రోజుల ముందు అందులో పాల్గొనే ఆటగాళ్ల వివరాలను బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా సమర్పించి ఫండింగ్ కోసం ప్రతిపాదనలు చేయాలి. ఆ నిర్ణీత సమయంలో ప్రతిపాదనలు రాకపోవడం వల్లే నిధులు విడుదల చేయలేదు" అని సాయ్ వర్గాలు వెల్లడించినట్లు సమాచారం. రాబోయే టోర్నీలకు నిధులను పునరుద్ధరించామని, అయితే యూరప్ టూర్‌లో ఆటగాళ్లు భరించిన ఖర్చులను క్లెయిమ్ చేసుకునే అవకాశం లేదని స్పోర్ట్స్ అథారిటీ వర్గాలు పేర్కొన్నాయి.

దేశవాళీ క్రికెట్ ఆడాకే.. పాండ్యా రీఎంట్రీ: అప్‌డేట్ ఇచ్చిన గిల్

వరుస గాయాలతో గత కొన్ని నెలలుగా టీమ్‌ఇండియాకు దూరమయ్యాడు ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్య. వచ్చే ఏడాది వన్డే ప్రపంచకప్ జరగనున్న నేపథ్యంలో జాతీయ జట్టులోకి అతడి రీఎంట్రీ ఎప్పుడనేదానిపై అభిమానులు ఆసక్తికరంగా ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలోనే పాండ్య పునరాగమనంపై టీమ్‌ఇండియా కెప్టెన్ శుభ్‌మన్ గిల్ తాజాగా బిగ్ అప్‌డేట్ ఇచ్చాడు. జాతీయ బాధ్యతల్లోకి వచ్చేముందు.. అతడు దేశవాళీ మ్యాచ్‌లు ఆడాల్సి ఉంటుందని చెప్పాడు.

నవంబరు 4 (బుధవారం) నుంచి న్యూజిలాండ్‌తో టీమ్‌ఇండియా ఐదు వన్డేల సిరీస్ ఆడనుంది. ఈ నేపథ్యంలో గిల్ నేడు ప్రెస్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ పాండ్య రీఎంట్రీ పై స్పందించాడు. "పాండ్య జట్టులోకి వస్తే 7, 8 స్థానాల్లో ఎవరు ఆడాలన్న దానిపై ఓ స్పష్టత వస్తుంది. అప్పుడు బ్యాటింగ్ పరంగా జట్టు కూడా బ్యాలెన్స్‌డ్‌గా కన్పిస్తుంది. పాండ్య గొప్ప ఆల్‌రౌండర్. కొత్త, పాతి బంతితోనూ ప్రభావం చూపించగలడు. చాలా కొద్ది మందిలో మాత్రమే అలాంటి నైపుణ్యాలుంటాయి. అందుకే అతడితో ఏ దశలోనైనా బౌలింగ్ చేయించొచ్చు. అయితే, గాయాల కారణంగా కొంతకాలంగా అతడు జాతీయ జట్టుకు దూరంగా ఉంటున్నాడు. త్వరలోనే అతడు భారత్-ఎ మ్యాచ్‌లతో తిరిగొస్తాడు. అయితే, అంతకంటే ముందు పాండ్య కొన్ని దేశవాళీ మ్యాచ్‌లు ఆడాలి" అని గిల్ వివరించాడు.



150+స్కోర్.. కివీస్‌తో టెస్టులకు ముందు ఫామ్‌లోకి వచ్చిన యశస్వి

కొంతకాలంగా పేలవ ప్రదర్శనతో విమర్శలు ఎదుర్కొంటోన్న భారత డ్యాషింగ్ ఓపెనర్ యశస్వి జైస్వాల్ తిరిగి ఫామ్‌లోకి వచ్చాడు. న్యూజిలాండ్-ఎతో జరిగిన రెండో అనధికారిక టెస్టులో అజేయ సెంచరీతో అదరగొట్టాడు. 162 బంతుల్లో 155 పరుగులు బాదిన జైస్వాల్ .. టెస్ట్ సిరీస్‌కు ముందు కివీస్ బౌలర్లకు గట్టి సందేశం పంపాడు.

ఓవర్‌నైట్ స్కోరు 32 పరుగులతో నాలుగో రోజు ఆట ప్రారంభించిన భారత్-ఎ ఆదిలోనే సాయి సుదర్శన్ (11) వికెట్ కోల్పోయింది. ఆ తర్వాత వచ్చిన దేవదత్ పడిక్కల్ కూడా నిరాశపర్చడంతో ఒక దశలో మన జట్టు 36/2తో కష్టాల్లో పడింది. ఆ సమయంలో క్రీజులోకి వచ్చిన యశ్ రాథోడ్‌తో కలిసి యశస్వి అద్భుతమైన ఇన్నింగ్స్ నిర్మించాడు. వీరిద్దరూ 247 పరుగుల భాగస్వామ్యాన్ని సాధించారు. యశస్వి 155 పరుగులు బాదాడు. ఇందులో 15 బౌండరీలు, 5 సిక్సర్లు ఉన్నాయి. ఇక లెఫ్ట్ హ్యాండర్ యశ్ రాథోడ్ కూడా 100 పరుగులతో అజేయ శతకం నమోదు చేశాడు.

ఇండియాఎ సారథిగా తిలక్

దిల్లీ: ఏసీసీ రైజింగ్ స్టార్స్ ఆసియా కప్‌లో పాల్గొనే ఇండియా-ఎ జట్టుకు హైదరాబాదీ తిలక్‌వర్మ సారథ్యం వహించనున్నాడు. ఈనెల 19 నుంచి 29 వరకు దోహాలో జరగనున్న ఈ టోర్నీకి రజత్ పాటీదార్ వైస్ కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. గ్రూపు-బిలో ఇండియా-ఎతో పాటు పాకిస్థాన్-ఎ, నేపాల్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ఉన్నాయి. గ్రూపు-ఎలో బంగ్లాదేశ్-ఎ, శ్రీలంక-ఎ, అఫ్గానిస్థాన్-ఎ, హాంకాంగ్, చైనాలకు చోటు దక్కింది. ఎ, బి గ్రూపుల్లో మొదటి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు సెమీఫైనల్‌కు అర్హత సాధిస్తాయి. ఇండియా-ఎ: అభిషేక్‌శర్మ, వైభవ్ సూర్యవంశీ, ప్రభ్‌సిమ్రన్ సింగ్ (వికెట్ కీపర్), తిలక్‌వర్మ (కెప్టెన్), రజత్ పాటీదార్ (వైస్ కెప్టెన్), రింకూ సింగ్, కుమార్ కుశాగ్ర (వికెట్ కీపర్), సూర్యాంశ్ షెడ్గె, షాబాజ్ అహ్మద్, విప్రాజ్ నిగమ్, హర్ష్ దూబె, తనుష్ కొటియాన్,



హర్షిత్ రాణా, ప్రిన్స్ యాదవ్, అర్షద్‌ఖాన్

PRINTER, PUBLISHER AND OWNED BY SHANKARAGALLU VENKATESULU, AND PRINTED AT M/S SREE VASAVI PUBLICATIONS#4/38, Main Road, Settur515, 767, Ananthapuram Dist., (A.P)
EDITOR : SHANKARAGALLU VENKATESULU. Email: anantha janasakshi2019@gmail.com, Cell : 9533633213, RNI REGD NO : APTEL/2015/61314